


www.navabhoomi.in | epaper.navabhoomi.in
RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 30 సోమవారం | డిసెంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 104
Navabhoomi daily fallows..




# ఘోర విమాన ప్రమాదం

- విమాన ప్రమాదంలో 179 మంది మృతి...
- ద.కొరియాలోని ముయాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఘోర ప్రమాదం
- ల్యాండింగ్ అవుతూ అదుపు తప్పి రక్షణ గోడకు ఢీకొన్న విమానం
- ల్యాండింగ్ గేర్ వైఫల్యమే కారణమంటున్న ఎయిర్‌పోర్టు అధికారులు
- పక్షి ఢీకొట్టడం వల్లే ప్రమాదం జరిగిందన్న వాదన ప్రచారంలోకి..

2



**ముయాన్-నవభూమిబ్యూరో**

ఆ పక్షి కారణమా? ఇక, ఈ ప్రమాదం చోటు చేసుకున్న సమయంలో ఆరుగురు సిబ్బందితో పాటు 175 ప్రయాణికులు ఉన్నారని చెబుతున్నారు. ఇటీవల అజర్ బైజన్ ఎయిర్ లైన్స్ కు చెందిన ఫ్లైట్ జే2 - 8243 విమాన ప్రమాదంలో సుమారు 40 మంది మృతి చెందడం తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే! ఆ విమాన ప్రమాదానికి పక్షి ఢీకొనడమే కారణం అనే కథనాలు రాగా.. ఆ విమానాన్ని ఉక్రెయిన్ డ్రోన్ గా భావించి రష్యా దాడి చేసిందనే చర్చా తెరపైకి వచ్చింది. దీంతో... ఆ విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇదే సమయంలో తాజాగా దక్షిణ కొరియాలోని ముయాన్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌లో ఘోర ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. అయితే... ఈ ప్రమాదానికి కారణం ల్యాండింగ్ గేర్ వైఫల్యమే అని అంటున్నా.. దానికంటే ముందు పక్షి ఢీకొనడం వల్లే ఇది జరిగిందనే చర్చ తెరపైకి వచ్చింది. బ్యాంకాక్ నుంచి బయలుదేరిన ది జేజు ఎయిర్ ఫ్లైట్ కు చెందిన 7సీ2216 నంబర్ బోయింగ్ 737-800 శ్రేణి విమానం ల్యాండ్ అవుతూ అదుపుతప్పి, రక్షణ గోడను ఢీకొని, మంటల్లో చిక్కుకుని పేలిపోయింది. ఈ ఘోర ప్రమాదానికి ల్యాండింగ్ గేర్ వైఫల్యమే ప్రధాన కారణం అని తెలుస్తోందని అంటున్నారు. ఈ సందర్భంగా స్పందించిన అధికారులు.. ఈ విమానం ప్రమాదానికి ముందు ఒకసారి ల్యాండింగ్ కు యత్నించి విఫలమైందని పేర్కొన్నారు. ఇది ఎయిర్ పోర్ట్ లో గోడను ఢీకొనడంతో విమానంలో ఇంధనం ఒక్కసారిగా మండిందని.. మంటలు వ్యాపించాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే పక్షి ఢీకొట్టిందనే విషయం తెరపైకి వచ్చింది. ఈ సందర్భంగా స్పందించిన దక్షిణ కొరియా ఫైర్ చీఫ్ లీ జియోంగ్ హైయాన్... విమానం ఇంజిన్ ను పక్షి ఢీకొనడం.. వాతావారణ పరిస్థితుల కారణంగా ల్యాండింగ్ గేర్ లో సమస్య కారణమై ఉండొచ్చని పేర్కొన్నారు. ఇదే సమయంలో... ప్రమాదం జరిగిన వీడియో దృశ్యాల్లో కూడా విమానం రన్ వేపై అదుపుతప్పి దుసుకెళ్తూ గోడను ఢీకొనే సమయానికి ల్యాండింగ్ గేర్ వెనక్కే ఉన్నట్లు భావిస్తున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో... జరిగిన ప్రమాదానికి థాయిల్యాండ్ కు చెందిన జేజు ఎయిర్ సంస్థ క్షమాపణలు తెలిపింది. అదేవిధంగా... ప్రమాద నివారణకు తాము శక్తివంచన లేకుండా ప్రయత్నించినట్లూ

# గంటకు 450 కిలోమీటర్ల బుల్లెట్ రైలు



- సీఆర్ 450 రైలును బీజింగ్‌లో పరీక్షించిన రైల్వే అధికారులు
- ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన వాణిజ్య రైలు
- బీజింగ్ నుంచి షాంఘైకు కేవలం 2.5 గంటల్లోనే..
- హైస్పీడ్ రైళ్ల కోసం వంతెనలు, ట్రాక్లు, సొరంగాల నిర్మాణం

**బీజింగ్-నవభూమిబ్యూరో**

చైనా వరుసగా ఆవిష్కరణలను ప్రపంచానికి చూపిస్తోంది. తాజాగా గంటకు అత్యధికంగా 450 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగల బుల్లెట్ రైలును ప్రపంచానికి. పరిచయం చేసింది. దీనిని సీఆర్450గా వ్యవహరిస్తోంది. ఆదివారం బీజింగ్లో పరీక్షించారు. గంటకు 400 కిలోమీటర్ల వేగాన్ని అందుకొంది. ఈ రైల్ డిజైన్ చాలా నాజుగ్గా, బుల్లెట్ షేప్ ముక్కుతో ఉంటుందని చైనా రైల్వే వెల్లడించింది. ఇది అత్యధికంగా గంటకు 450 కిమీ వేగాన్ని అందుకోగలదని తెలిపింది. ఇది వినియోగంలోకి వచ్చే నాటికి ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన వాణిజ్య రైలుగా నిలుస్తుందని చెప్పింది. ఈ ట్రైన్ బీజింగ్ నుంచి షాంఘైకి కేవలం 2.5 గంటల్లోనే ప్రయాణించగలదు. గతంలో ఈ ప్రయాణానికి నాలుగు గంటల సమయం పట్టేది.

ప్రస్తుతం చైనాలోని హైస్పీడ్ రైలు వ్యవస్థ అతిపెద్దది. మొత్తం 45,000 కిలోమీటర్ల మేరకు విస్తరించింది. ఈ ఏడాది సెప్టెంబర్లోనే చైనా ప్రభుత్వరంగ రైల్వే సంస్థ సీఆర్450 ప్రొటోటైపు డిసెంబర్లో పరీక్షిస్తామని పేర్కొంది. చైనా 14వ పంచవర్ష ప్రణాళికలో భాగంగా ఈ ప్రాజెక్టును చేపట్టారు. దీని కింద హైస్పీడ్ రైళు ..వంతెనలు, ట్రాక్లు, సొరంగాలు నిర్మించనునా ౖరు. ఈ రైలు బాడీ బరువు కేవలం 10 టన్నులు మాత్రమే. ప్రస్తుతం సీఆర్400 మోడల్ కంటే ఇది 12 శాతం తక్కువ. విద్యుత్తును కూడా 20 శాతం తక్కువగానే వినియోగించుకుంటుందని అధికారులు చెబుతున్నారు. ఇక గత మోడల్ కంటే అదనంగా 50 కిలోమీటర్లు అధిక వేగంతో ప్రయాణించగలదు. ఇంజిన్ పరీక్షల్లో ఇది అత్యదికంగా గంటకు 453 కిమీ వేగాన్ని అందుకుంది.చైనా రెండ్రోజుల క్రితమే ఆరో తరానికి చెందినదిగా చెబుతున్న జె-36 యుద్ధ విమానాన్ని ఆవిష్కరించింది. సిచువాన్ ప్రావిన్స్ లోని చెంగ్డూలో దీనిని అభివృద్ధి చేసినట్లు భావిస్తున్నారు. దీనికి 3 ఇంజిన్లు అమర్చినట్లు బావిస్తున్నారు.

# మన్మోహన్‌కు స్మృతిచిహ్నం

- హైదరాబాద్ నడి బొడ్డున విగ్రహస్థాపన కూడా
- సీఎం రేవంత్ సంచలన నిర్ణయం
- నేడు అసెంబ్లీలో సీఎం ప్రకటన చేసే అవకాశం
- మాజీ ప్రధాని మన్మోహన్‌కు ఘన నివాళి అర్పించనున్న సభ

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

ముఖ్యమంత్రి రేవంత్ కీలక ప్రకటనకు సిద్ధం అవుతున్నారు. తెలంగాణ అసెంబ్లీ రేపు (సోమవారం) ప్రత్యేకంగా సమావేశం కానుంది. మాజీ ప్రధాని మన్మోహన్ కు నివాళి అర్పించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసారు. ఇక, ఇదే చర్చ సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ దివంగత ప్రధాని మన్మోహన్ పేరుతో హైదరాబాద్ నడిబొడ్డున స్మృతి ఏర్పాటుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీని పైన అసెంబ్లీ వేదికగా ప్రకటన చేయనున్నట్లు సమాచారం. మాజీ ప్రధానికి తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమై నివాళి అర్పించనుంది. మన్మోహన్ అంత్యక్రియల్లో పాల్గొన్న సీఎం రేవంత్ ఆ వెంటనే ఈ నిర్ణయం తీసుకున్నారు. సోమవారం సభలో మన్మోహన్ చేసిన సేవలను ప్రస్తావించనున్నారు. పదేళ్ల పాటు కాంగ్రెస్ ప్రధానిగా మన్మోహన్ అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. దేశ ఆర్థిక రంగాన్ని గాడిన పెట్టటంలో కీలక పాత్ర పోషించారు. ఇక, మన్మోహన్ ప్రధానిగా ఉన్న సమయంలో హైదరాబాద్ విమానాశ్రయం, ఓఆర్ఆర్, మెట్రో విస్తరణ పైన వేగంగా నిర్ణయాలు జరిగాయి. ఇక, మన్మోహన్ చరిత్రలో చిర స్థాయిగా నిలిచిపోయే వ్యక్తి కావటంతో.. ఆయన కు గుర్తుగా సీఎం రేవంత్ కీలక నిర్ణయానికి సిద్దమైనట్లు తెలుస్తోంది. మన్మోహన్ స్మృతిగా సచివాలయం సమీపంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. అదే విధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో త్వరలో ప్రారంభించే స్కీంకు మన్మోహన్ పేరుతో కొనసాగించేలా ప్రకటన చేయనున్నారు. ప్రస్తుతం ఇందిరా, రాజీవ్ విగ్రహాలు తరహాలోనే మన్మోహన్ విగ్రహం సైతం ఏర్పాటు చేయాలని డిసైడ్

# కూటమి పాలనపై రాబిన్ శర్మ గ్రౌండ్ రిపోర్ట్



- కూటమి సర్కార్ ఏర్పడిన ఏడు నెలల్లో పాలనపై ప్రజల అభిప్రాయంపై సర్వే
- కూటమి సర్కార్‌కు కీలకమైన నివేదిక ఇచ్చిన రాబిన్ శర్మ టీం
- చీఫ్ మినిస్టర్ ఫెలోస్ అనే పేరుతో యువ టీంను ఏర్పాటు
- ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో చదివిన ప్రతిభావంతులైన 25 మందితో టీం
- శిక్షణ అనంతరం ఒక్కొక్కరికి ఒక్కో జిల్లా కేటాయింపు

2

**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు పూర్తి కానుంది. భారీ మెజార్టీతో అధికారంలోకి వచ్చిన కూటమి పాలన పైన ప్రజల్లో ఎలాంటి అభిప్రాయం ఉంది. ఇదే అంశం పైన ఎన్నికల్లో టీడీపీ కోసం పని చేసిన రాబిన్ శర్మ టీం ఇప్పుడు గ్రౌండ్ రిపోర్ట్స్‌తో సిద్దమైంది. ప్రభుత్వానికి అలర్ట్స్ ఇచ్చింది. ఇదే సమయంలో ప్రభుత్వంలోనూ రాబిన్ శర్మ సేవలు వినియోగించుకోవాలని చంద్రబాబు నిర్ణయించారు. ఇందు కోసం కొత్త ఆలోచనలను అమలు చేయనున్నారు. సీఎం కోసం కీలక నిర్ణయం ముఖ్యమంత్రి చంద్రబాబు తన పాలనలో కొత్త ఆలోచనలకు శ్రీకారం చుడుతున్నారు. ఇందు కోసం రాజకీయ వ్యూహకర్త రాబిన్ శర్మ టీం సేవలను కొనసాగించాలని డిసైడ్ అయ్యారు. దీని కోసం చీఫ్ మినిస్టర్ ఫెలోస్ అనే పేరుతో యువ టీంను ఏర్పాటు చేస్తున్నారు. ఈ టీం క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకోవటం.. లోటు పాట్ల గురించి నేరుగా ముఖ్యమంత్రికి నివేదిక ఇవ్వనుంది. కొన్ని రాష్ట్రాల్లోని ముఖ్యమంత్రులు ఇప్పటికే ఇటువంటి బృందాలు కొనసాగుతున్నాయి. ఇందు కోసం 25 మందితో టీం ఏర్పాటు చేయనున్నారు. ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఉన్నత విద్యాభ్యాసం చేసిన ప్రతిభావంతులను ఎంపిక చేస్తున్నారు. శిక్షణ అనంతరం ఒక్కొక్కరికి ఒక్కో జిల్లా బాధ్యతలు కేటాయిస్తారు. సంక్రాంతి తర్వాత ఏపీలో మళ్ళీ మూడురోజుల పండుగ.. రెడీ అవ్వమన్న చంద్రబాబు!" రంగంలోకి కొత్త టీంలు ఇక, ప్రభుత్వ నిర్ణయాలు - పథకాల అమలు విషయంలో రాబిన్ శర్మ కూటమి ప్రభుత్వానికి సహాయకారిగా పని చేయనుంది. భుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయం ఎలా ఉందో ఎప్పటికప్పుడు తెలుసుకొని సూచనలు, సలహాలు ఇవ్వడానికి కొత్తగా ఒక టీం పని చేయనుంది. రాబిన్ టీంలో కీలక సభ్యుడు

# ఇన్నేళ్లల్లో ఎప్పుడూ జరగలేదు

- పోలీసుల నోటీసుకు సంధ్య థియేటర్ యాజమాన్యం రిప్లై ఇదే
- ఘటనపై వివరణ ఇస్తూ 6 పేజీల లేఖ పోలీసులకు అందజేత
- తొక్కిసలాట ఘటనపై థియేటర్ యాజమాన్యానికి నోటీసులు
- గతంలోనూ అనేకసార్లు థియేటర్‌లో షో చూసేందుకు హీరోలురాక

2




**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సంధ్య థియేటర్ యాజమాన్యానికి పోలీసులు నోటీసులు ఇచ్చా రు. ఈ క్రమంలో సంధ్య థియేటర్ యాజమా న్యం స్పందించింది. సంధ్య థియేటర్‌కు అన్ని అనుమతులు ఉన్నాయని పేర్కొంటూ పోలీసులు ఇచ్చిన నోటీసులకు థియేటర్ యాజమాన్యం సమాధానం పంపింది. మరికొన్ని కొన్ని వివరాలను కూడా జత చేసింది. డిసెంబర్ 4న పుష్ప-2 ప్రీమియర్ షోకు 80 మంది థియేటర్ సిబ్బంది విధుల్లో ఉన్నారని తెలిపింది. డిసెంబర్ 4,5 తేదీల్లో థియేటర్ నిర్వహణను మైత్రీ మూవీ మేకర్స్ తీసుకుందని వెల్లడించింది. ఇక, సినిమాల విడుదలకు గతంలోనూ హీరోలు థియేటర్‌కు వచ్చారని సంధ్య థియేటర్ యాజమాన్యం తెలిపింది.

# టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఎవరికి?

2



- ప్రస్తుత టీడీపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న పల్లాకు మంత్రి పదవి
- పల్లా స్థానంలో పార్టీ అధ్యక్షుని పదవి కోసం చంద్రబాబు కసరత్తు
- పెరుగుతున్న ఆశావహుల సంఖ్య..బీసీలకు ఇస్తారనే ప్రచారం
- రాయలసీమ ప్రాంతానికి ఇవ్వాలని ఆ ప్రాంతం నుంచి డిమాండ్లు

**అమరావతి-నవభూమిబ్యూరో**

పల్లాకు మంత్రి పదవి? టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఎవరికి? ఇప్పుడు పల్లా మంత్రి అయితే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొత్తవారిని నియమిస్తారా? లేక పల్లానే కొనసాగిస్తారా? అనేది చర్చకు తావిస్తోంది. ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును త్వరలో రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారని గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. జనసేన నేత నాగబాబుతోపాటు పల్లాకు క్యాబినెట్ ఖాయమని చెబుతున్నారు. దీంతో పల్లా మంత్రి అయితే ఆయన స్థానంలో పార్టీ అధ్యక్ష బాధ్యతలు ఎవరికి అప్పగిస్తారనే చర్చ మొదలైంది. ఏపీ టీడీపీ అధ్యక్షుడిగా ఈ ఏడాది జూన్‌లో పల్లా శ్రీనివాసరావును నియమించారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిచిన పల్లాను కచ్చితంగా మంత్రివర్గంలోకి తీసుకుంటారని భావించారు. అయితే సామాజిక సమీకరణాలు, ఇతర ప్రాధాన్యాలు తెరపైకి రావడంతో పల్లా పేరు చివరి నిమిషంలో వెనక్కి వెళ్లిపోయింది. దీంతో అప్పటివరకు ఏపీ టీడీపీ అధ్యక్షుడిగా పనిచేసిన అచ్చెన్నాయుడు స్థానంలో పల్లాను పార్టీ చీఫ్‌గా నియమించారు. . రోజురోజుకు పెరుగుతున్న ఆశావాహులు దాదాపు ఏడు నెలలుగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్న పల్లా అధినేత మన్ననలు అందుకుంటున్నారు. పార్టీ కార్యక్రమాలను పకడ్బందీ నిర్వహిస్తూ తన సమర్థతను నిరూపించుకుంటున్నారు. పార్టీ కార్యక్రమంలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న ప్రజాదర్బారులో తనతోపాటు పార్టీ నేతలు

# ప్రభుత్వ పాఠశాలలపై సీఎం కీలక నిర్ణయం

- కన్హాలోని శాంతివనాన్ని సందర్శించిన సీఎం రేవంత్
- విద్యార్థులకు అందించే సాఫ్ట్‌స్కిల్స్ పరిశీలన
- వీటిన్ని అన్ని స్కూళ్లల్లో అమలు చేయాలని నిర్ణయం



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** ప్రభుత్వ పాఠశాలలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కన్హా శాంతివనాన్ని ఆదివారంముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందర్శించారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని కన్హా గ్రామంలోని కన్హా శాంతివనంలో చిన్నారులు, విద్యార్థులకు అందించే సాఫ్ట్ స్కిల్స్‌కు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కళ్లకు గంతలు కట్టుకుని రంగులను గుర్తించడం, పదాలను చదవడం వంటి స్కిల్స్‌ను అక్కడి విద్యార్థులు ప్రదర్శించడం చూసి ముఖ్యమంత్రి వారిని అభినందించారు. ఇలాంటి స్కిల్స్‌ను ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్‌లోనూ అందించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. అనంతరం కన్హా శాంతివనం ఆవరణలోని ట్రీ కన్జర్వేషన్ సెంటర్‌ను సందర్శించారు. వివిధ రకాల వంగడాల అభివృద్ధి, మొక్కల పెంపకానికి సంబంధించిన విధానాలను శాంతి వనం నిర్వాహకులు సీఎం రేవంత్‌రెడ్డికు వివరించారు. శాంతివనంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెయిన్ ఫారెస్ట్‌ను సీఎం సందర్శించారు. అనంతరం మెడిటేషన్ సెంటర్ వద్ద మొక్కను నాటి మెడిటేషన్ హాల్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, ఎమ్మెల్యే శంకరయ్య, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# ఏపీలో పెరిగిన సైబర్ నేరాలు

- ఏపీ ప్రజల నుండి అలా 1229కోట్ల రూపాయల దోపిడీ!
- రోజుకు 3.36 కోట్ల రూపాయలను కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్ళు
- ఈ ఏడాది ఏడు లక్షల ఇరవై మూడు వేల 378 ఫిర్యాదులు
- రూ.225 కోట్లను నేరగాళ్ల బారి నుండి కాపాడిన పోలీసులు

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2024 సంవత్సరంలో సైబర్ నేరాలు విపరీతంగా జరిగాయి. గతంలో ఎన్నడూ లేనంతగా సైబర్ నేరాలు పెరిగాయి. ఇది ఏపీ వాసులను ఆందోళనకు గురిచేస్తున్న అంశం. కేవలం 2024 సంవత్సరంలో ఫోన్ కాల్స్ ద్వారా పోలీసులకు ఏడు లక్షల ఇరవై మూడు వేల 378 ఫిర్యాదులు అందాయి అంటే ఎంత పెద్ద ఎత్తున సైబర్ నేరాలు జరిగి ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. ఏపీలో భారీగా సైబర్ నేరాలు ఇక ఈ సైబర్ నేరాలకు సంబంధించిన కాల్స్ ను పరిశీలించి పోలీసులు కేసులు నమోదు చేసి వాటిని దర్యాప్తు చేస్తున్నారు. మొత్తం 916 సైబర్ నేరాలను నమోదు చేసిన పోలీసులు ఈ సైబర్ నేరగాళ్లను పట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. 2024 సంవత్సరంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన నేరాలలో సైబర్ నేరాలు ఆందోళనకర స్థాయిలో పెరగడం ప్రధానంగా కనిపిస్తుంది. రోజుకు 3.36 కోట్ల రూపాయలను కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్ళు మొత్తం సైబర్ నేరాలలో బాధితులు 1229 కోట్ల రూపాయలను

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in


# హైదరాబాద్ పబ్స్‌లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు



**హైదరాబాద్-నవభూమి:** నగరంలోని పబ్స్‌లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పబ్స్, బార్స్ లో న్యూ ఇయర్ వేడుకలను దృష్టిలో పెట్టుకుని సోదాలు చేశారు. పబ్స్, బార్స్‌లో డ్రగ్స్ సరఫరా చేసినా.. మైనర్లను అనుమతించినా చర్యలు తప్పవని పోలీసులు వార్నింగ్ ఇచ్చారు. కాగా నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా పబ్స్, బార్స్‌పై నిఘా ఉంచారు. ఈ క్రమంలో మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పబ్స్, బార్స్‌లో ఆకస్మిక తనిఖీలు చేశారు. నార్కోటిక్, ఎక్సైజ్, ఎస్‌వోటీ, మాదాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. అనుమతులు ఎంత వరకు ఉన్నాయన్న దానిపై ఆరా తీశారు. గంజాయి, డ్రగ్స్ సరఫరా చేసినట్లు తమ దృష్టికి వస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డాగ్ స్క్వాడ్ తో ప్రత్యేకంగా తనిఖీలు చేశారు. సౌండ్ పొల్యూషన్‌తో పాటు సౌండ్ ప్రూఫ్ కూడా మెయింటైన్ చేయాలను పబ్ యజమానులకు పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. ప్రశాంతంగా న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని పబ్ యజమానులకు సూచించారు. ఎట్టి పరిస్థితిలలో డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాలను అనుమతించిన కఠిన చర్యలు వుంటాయని మరోసారి హెచ్చరించారు.కాగా ఏపీ, తెలంగాణ సరిహద్దుల్లో డ్రగ్స్ పట్టుబడడం కలకలం రేపింది. కోదాడ మండలం, నల్లబండగూడెం వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో అక్రమంగా తరలిస్తున్న డ్రగ్స్‌ను పోలీసులు సీజ్ చేశారు. భువనేశ్వర్ నుంచి హైదరాబాద్ వస్తున్న బస్సులో డ్రగ్స్ పట్టుబడ్డాయి. ఈ ఘటనలో ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని విచారిస్తున్నారు. ల్యాబ్ పరీక్షల అనంతరం డ్రగ్స్ వివరాలు వెల్లడిస్తామని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.

## సంక్రాంతికి రైతుల అకౌంట్లలో డబ్బులు.. రైతు భరోసాపై కీలక కసరత్తు



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ ప్రభుత్వం రైతులకు పంట పెట్టుబడి సాయం రైతు భరోసా అమలు చేసేందుకు సిద్ధమైంది. ఈ పథకం కింద ఎకరాకు రూ. 15 వేలు సాయం చేయనుండగా.. సంక్రాంతి నుంచి అమలు చేయనున్నారు. కేవలం సాగులో ఉన్న భూములకే పరిహారం ఇవ్వాలని సర్కార్ డిసైడ్ కాగా.. నేడు డిప్యూటీ సీఎం భట్టి అధ్యక్షతన జరిగే కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు.తెలంగాణ ప్రభుత్వం అనేక రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రూ. 2 లక్షల రైతు రుణమాఫీ చేశారు. నాలుగు విడతల్లో దాదాపు 25 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.22 వేల కోట్లు జమ చేశారు. తాజాగా పంట పెట్టుబడి సాయం రైతు భరోసా ఇచ్చేందుకు కూడా సిద్ధమయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరుతో ఎకరాకు రూ. 10 వేలు రెండు విడతల్లో ఇవ్వగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అదే పథకాన్ని రైతు భరోసా పేరుతో ఎకరాకు రూ. 15 వేలు ఇచ్చేందుకు సిద్ధమైంది.

సంక్రాంతి నుంచి ఈ పథకం అమలు చేస్తామని అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ప్రకటించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సాగులో లేని భూములకు రైతు బంధు నిధులు జమ చేసిందని.. ప్రభుత్వం ఆరోపిస్తుంది. తాము మాత్రం సాగులో ఉన్న భూములకే పంట పెట్టుబడి సాయం అందిస్తామని స్పష్టం చేసింది. అందుకు గాను.. విధివిధానాల రూపకల్పన కోసం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీని కూడా నియమించింది. ఈ సబ్ కమిటీ కాసేపట్లో సమావేశం కానుంది. డిప్యూటీ సీఎం భట్టి అధ్యక్షతన సెక్రటేరియట్‌లో కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు భేటీ కానున్నారు. ఈ భేటీలో రైతు భరోసా విధి విధానాలపై కులంకుషంగా చర్చించనున్నారు. సంక్రాంతి నుంచి రైతు భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధం కావటంతో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇప్పటికే ఉమ్మడి జిల్లాల వారిగా రైతు భరోసాపై సబ్ కమిటీ అభిప్రాయ సేకరణ పూర్తి చేసింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనూ రైతు భరోసాపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసెంబ్లీలో చర్చ పెట్టారు. ప్రతిపక్షాల నుంచి ప్రభుత్వం సలహాలు, సూచనలు స్వీకరించింది. రైతు భరోసాను రైతు బంధు మాదిరిగా భూరికార్డుల మేరకు కాకుండా సాగు భూమి లెక్కల ఆధారంగా అందించాలని రేవంత్ సర్కార్ యోచిస్తోంది. గూగుల్ డేటా, శాటిలైట్ ఇమేజ్ ఆధారంగా సాగు విస్తీర్ణం లెక్కించి పంట వేసిన మేరకే రైతులకు రైతు భరోసా సహాయం అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. నేడు జరిగే కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకోనున్నారు.

## 'మాది భయపడే రక్తం కాదు.. భయపెట్టే రక్తం.. దేనికీ భయపడను: ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికొదిలేసి.. కక్ష సాధింపు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ తప్పుడు కేసులు పెడుతున్నాయని ఫైరయ్యారు. ఎవరెన్ని ఇబ్బందులు పెట్టినా బయపడేది లేదని.. తెలంగాణలో మరోసారి గులాబీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు.తెలంగాణలో కాంగ్రెస్ రాక్షస పాలన సాగిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. పేరు మర్చిపోయినా కేసులు పెడ్తున్నారని ఫైరయ్యారు. నిజామాబాద్‌లో పర్యటించిన ఆమె.. పేరు మర్పిపోయినా, రైతులు భూములు ఇవ్వకపోయినా సీఎం రేవంత్ రెడ్డి కేసులు పెడుతున్నారన్నారు. కేసీఆర్ ఎదుర్కొనే ధైర్యం, దమ్ములేక తనపై, కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టారని ఫైరయ్యారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని చెప్పారు.నేను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డను.. దేనికీ భయపడను. మాది భయపడే రక్తం కాదు.. భయపెట్టే రక్తం. మేము తప్పు చేయలేదు... భయపడే ప్రసక్తే లేదు. ఎన్ని కేసులు పెట్టిన బీఆర్ఎస్ కార్యకర్తలు నిప్పు కణికల్లా బయటికి వస్తారు. కేంద్రాన్ని ఎదురించి ప్రశ్నిస్తే బీజేపీ కేసులు పెడుతోంది. రాష్ట్రంలో అక్రమ కేసుల గురించి చెప్పనవసరం లేదు. పేరు మర్పిపోయినా, రైతులు భూములు ఇవ్వకపోయినా కేసులు పెడుతున్నరు. ప్రభుత్వానికి ఎందుకింత భయం? బరువు ఎత్తుకున్నోడు ఓపికతో ఉండాలి. ప్రజల ఇబ్బందులను పరిష్కరించడానికే అధికారం ఇచ్చారన్న విషయాన్ని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మరిచిపోయాయి. పోరాటం చేసి రాష్ట్రాన్ని తీసుకొచ్చిన వాళ్లం. గట్టిగా నిలబడుతాం.. ప్రజల పక్షనా పోరాటం చేస్తాం. డిగ్రీ చదువుకున్న ఆడపిల్లలకు స్కూటీల పంపిణీ ఏమైంది? మహిళలకు నెలకు రూ. 2500, కళ్యాణ లక్ష్మీ కింద తులం బంగారం ఇవ్వలేదు. మైనారిటీలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా కాంగ్రెస్ సర్కార్ అమలు చేయలేదు. బీరాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పటి వరకు పెన్షన్లు మొత్తాన్ని పెంచలేదు. మనం ఊరుకుంటే ప్రభుత్వం కదలదు.. ప్రతీ ఒక్కరూ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. గ్రామ గ్రామాన కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి. విద్యార్థులు, రైతులు, మహిళలను, ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. పీపుల్స్ ఫ్రెండ్లీ పోలిసింగ్ పోయి... రాష్ట్రంలో కాంగ్రెస్ ఫ్రెండ్లీ పోలీసింగ్ నడుస్తోంది. రాష్ట్రంలో పోలీసు జులుం నడుస్తున్నది. కేసీఆర్ ప్రవేశపెట్టిన మంచి పనులను ప్రభుత్వం కొనసాగించాలి. రాబోయేది గులాబీ జెండా శకమే.. అందులో సందేహమే లేదు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానే. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసాపై ప్రభుత్వం మాట్లాడడం లేదు. గురుకులాలను పడడానికి కూడా ప్రభుత్వానికి చేతకావడం లేదు. ఇప్పటికే 57 మంది పిల్లలను పొట్టనపెట్టుకున్నారు.. ఇంకెంత మందిని పొట్టనపెట్టుకుంటారు? ఉద్యోగాల పేరిట సీఎం రేవంత్ రెడ్డి యువతను తప్పదోవ పట్టిస్తున్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పటి వరకు కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లకే ఉద్యోగాలు ఇస్తున్నారు. ఆటో కార్మికులకు ఇబ్బందులు అన్నీ ఇన్నీ కాదు.మహిళలక ఉచిత బస్సు అని చెప్పి బస్సుల సంఖ్య తగ్గించారు. సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబు శిష్యుడు. తెలంగాణ తల్లి స్థానంలో కాంగ్రెస్ మాతను ఏర్పాటు చేశారు. మన తెలంగాణ తల్లి మనకు కావాలి. తెలంగాణ తల్లి మాదిరా.. కాంగ్రెస్ తల్లి మీదిరా.. మన పొట్టమీదనే కాదు మన సంస్కృతిపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం దాడి చేస్తుంది. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని నిర్బంధాలకు పాల్పడినా భయపడే ప్రసక్తే లేదు.' అని ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యనించారు.

## గొప్ప మనసు చాటుకున్న మంత్రి కోమటిరెడ్డి.. చదువుల తల్లికి ఆర్థిక సాయం



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఉదారత చాటుకున్నారు. చదువుల తల్లికి ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. తన కుమారుడు ప్రతీక్ పేరు మీద పెట్టిన ఫౌండేషన్ తరపున తరచూ ఏదో ఒక సేవ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. విదేశాల్లోని ప్రముఖ యూనివర్సిటీలో మాస్టర్స్ సీటు వచ్చినా సరే.. వెళ్లేంత ఆర్థిక స్థోమతలేని ప్రణవి అనే యువతి పరిస్థితిని తెలుసుకుని వెంటనే స్పందించారు. ప్రతీక్ ఫౌండేషన్ తరపున ప్రణవికి ఆర్థిక సాయం అందించిన అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మరోసారి తన గొప్ప మనసు చాటుకున్నారు. తన కుమారుడి పేరు మీద.. ప్రతీక్ ఫౌండేషన్ స్థాపించి తరచూ ఏదో రకంగా సమాజ సేవ చేస్తూ.. పేద ప్రజల ముఖాల్లో విసిరే చిరునవ్వులో తన కుమారున్ని చూసుకుంటుంటారు మంత్రి కోమటిరెడ్డి. ఈ క్రమంలోనే.. ఇటీవల సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ మరణించటంతో పాటు ఆమె కుమారుడు శ్రీతేజ్ కోమాలోకి వెళ్లిన విషయం తెలిసిందే. కాగా.. బాధిత కుటుంబానికి ఫౌండేషన్ తరపును రూ.25 లక్షల నగదుసాయాన్ని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అందించారు. తాజాగా.. మరో గొప్పపని చేసి తన ఉదారత చాటుకున్నారు.ఇటలీలోని ప్రఖ్యాత విద్యాసంస్థ పాలిటెన్సికో డి టోరినోలో అర్కిటెక్చర్ కన్‌స్ట్రక్షన్‌లో మాస్టర్స్‌లో సీటొచ్చినా.. వెళ్లేందుకు ఆర్థిక స్థోమత లేని విద్యార్థిని ప్రణవి చొల్లేటి పరిస్థితిని తెలుసుకుని చలించినపోయిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. వెంటనే స్పందించారు. ప్రణవిని ఇంటికి పిలిపించుకుని మాట్లాడారు. ప్రతీక్ ఫౌండేషన్ తరపున వెంటనే లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు. తన చదువుకు అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చారు. ఏ అవసరం వచ్చినా తానున్నానని ప్రణవికి కోమటిరెడ్డి భరోసా ఇచ్చారు.ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థి చదువు ఆగిపోతే.. వారి జీవితం ఆగిపోతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిభ కలిగిన ఏ విద్యార్థి చదువు ఆగిపోకూడదని కోమటిరెడ్డి పేర్కొన్నారు. జీవితాలను మార్చే ఆయుధం చదువు ఒక్కటేనని.. మంత్రి అభిప్రాయపడ్డారు.మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన సాయంపై స్పందించిన ప్రణవి.. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎంతో అప్యాయంగా మాట్లాడారన్నారు. తామేవరమో తెలియకపోయినా తమ కష్టం తెలుసుకొని.. ఇంటికి పిలిచి స్వీట్లు ఇచ్చి మర్యాద చేశారని చెప్పుకొచ్చారు. తన చదువులకు అండగా ఉంటానని చెప్పారని ప్రణవి ఎమోషనల్ అయ్యారు. అప్పటికప్పుడే ఆర్థిక సహాయం చేసినట్టు తెలిపారు. తన చదువుల బాధ్యత తీసుకుంటానని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట ఇచ్చినట్టు ప్రణవి తెలిపారు. మంత్రి చేసిన సాయంపై ప్రణవి హర్షం వ్యక్తం చేశారు. తనలాంటి ఎంతో మంది పేద విద్యార్థల చదువులకు అండగా నిలబడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ప్రణవి కృతజ్ఞతలు తెలిపారు.

### తెలంగాణలో పోలీసుల వరుస ఆత్మహత్యలు..

# డీజీపీ సంచలన వ్యాఖ్యలు..!



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో 2024 కు సంబంధించి క్రైం రేటు వివరాల వార్షిక నివేదికను డీజీపీ జితేందర్ వెల్లడించారు. ఈ క్రమంలో రాష్ట్రంలో ఎన్ని కేసులు నమోదయ్యాయి.. ఏఏ కేసుల్లో ఎంత మందిని అరెస్టు చేశారన్న వివరాలను తెలంగాణ పోలీస్ బాస్ వెల్లడించారు. ఈ క్రమంలోనే.. రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న పోలీసులు వరుస ఆత్మహత్యలపై కూడా డీజీపీ స్పందించారు. పోలీసుల ఆత్మహత్యలు ప్రతి ఏడాది చోటుచేసుకుంటున్నాయని.. ఈ సంవత్సరం మాత్రమే కొత్త కాదని చెప్పుకొచ్చారు.తెలంగాణలో పోలీసుల వరుస ఆత్మహత్యలు సర్వత్రా సంచలనంగా మారాయి. ఎస్సై, మహిళా కానిస్టేబుల్‌తో పాటు మరో యువకుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారగా.. ఆదివారం (డిసెంబర్ 29న) ఒకే రోజు ఇద్దరు కానిస్టేబుళ్లు కూడా ఆత్మహత్య చేసుకోవటం ఆందోళన కలిగిస్తోంది. పోలీసుల వరుస ఆత్మహత్యల ఘటనలు ప్రస్తుతం.. ఆందోళన రేకెత్తిస్తున్న నేపథ్యంలో వీటిపై డీజీపీ జితేందర్ స్పందించారు. 2024 సంవత్సరంలో నమోదైన క్రైం రేటుకు సంబంధించి వార్షిక నివేదికను విడుదల చేసిన డీజీపీ జితేందర్ రెడ్డి.. పోలీసుల ఆత్మహత్యలపై కూడా స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు.ఈ ఏడాది మాత్రమే కాదని.. ప్రతి సంవత్సరం ఏదో ఒక కారణంతో పోలీసులు సూసైడ్ మరణాలు చోటుచేసుకుంటున్నాయని డీజీపీ జితేందర్ అభిప్రాపడ్డారు. ఆర్థిక సంబంధిత వ్యవహారాలు, వ్యక్తిగత ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో పోలీసులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటూ అభిప్రాయపడ్డారు. కొన్ని కేసుల్లో పని ఒత్తిడి వల్ల కూడా ఆత్మహత్య లు చేసుకుంటున్నారని డీజీపీ వెల్లడించారు. పోలీసులకు ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని డీజీపీ తెలిపారు.క్రైమ్ రేట్‌పై వార్షిక నివేదికను విడుదల చేసిన డీజీపీ జితేందర్ సంచలన వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది కేసుల నమోదు పెరిగిందని డీజీపీ తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈసారి క్రైం రేటు 9.87 శాతం పెరిగిందని వెల్లడించారు. డ్రగ్స్ రహిత తెలంగాణే పోలీసు శాఖ లక్ష్యమని డీజీపీ తెలిపారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 142.95 కోట్లు మాద్రకద్రవ్యాలను సీజ్ చేశామని.. ఇప్పటివరకు 4682 మంది నిందితులను అరెస్టు చేసినట్టు వెల్లడించారు. మోసాలకు పాల్పడుతున్న 1800 వెబ్‌సైట్లను బ్లాక్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది 33,618 సైబర్ క్రైం కేసులు నమోదు చేసినట్టు డీజీపీ తెలిపారు. ఈ కేసుల్లో రూ.180 కోట్లను బాధితులకు తిరిగి అప్పగించామన్నారు. 703 దొంగతనం కేసులో, 58 దోపిడీ, 1525 కిడ్నాప్, 856 హత్య, 2945 లైంగిక దాడుల కేసులు నమోదు చేశామని చెప్పుకొచ్చారు.డయల్ 100కు ఏకంగా 16,92,173 కంప్లైంట్స్ వచ్చాయని డీజీపీ పేర్కొన్నారు. కొత్త నేర చట్టాల అమలు కోసం పోలీసులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపిన డీజీపీ.. డిజిటల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. కొత్త చట్టాలు అమల్లోకి వచ్చిన తర్వాత 85,190 కేసులను నమోదు చేసినట్టు తెలిపారు. కొత్త చట్టాల ప్రకారం సైబరాబాద్ పరిధిలో 15,360 కేసులు, హైదరాబాద్‌లో 10,501, రాచకొండలో 10,251 కేసులు నమోదైనట్టు వివరించారు. . అని డీజీపీ జితేందర్ వివరించారు.చట్టవిరుద్దమైన ప్రైవేట్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని డీజీపీ తెలిపారు. సోషల్ మీడియాపై ప్రత్యేక మానిటరింగ్ ఏర్పాటు చేశామన్నారు. సైబర్ క్రైం ఇన్వెస్టిగేషన్ పేరుతో సోషల్ మీడియా ప్రచారాలపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. కేసులు పోలీసులు మాత్రమే ఇన్వెస్టిగేషన్ చేస్తారని.. ప్రైవేట్ వ్యక్తులకు ఎవరికి సంబంధం ఉండదని డీజీపీ జితేందర్ పేర్కొన్నారు.

# కొత్త సీఎస్ విజయానంద్

- నియామక ఉత్తర్వులు జారీ
- రాష్ట్రాభివృద్ధికి ఇద్దరూ కలిసి పనిచేయండి
- సాయిప్రసాద్, విజయానంద్‌లకు సీఎం సూచన
- నియామకానికి ముందు ఇరువురితో భేటీ



**అమరావతి-నవభూమిబ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వ తదుపరి ప్రధాన కార్యదర్శిగా కె. విజయానంద్ నియమితులయ్యారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ(పొలిటికల్) కార్యదర్శి ఎస్. సురేశ్‌కుమార్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మంగళవారం(31వ తేదీ) పదవీ విరమణ చేయన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి ప్రధాన కార్యదర్శిగా కె. విజయానంద్‌ను సీఎం చంద్రబాబు ఎంపిక చేశారు. అనంతరం ఆయన నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు విడుదలయ్యాయి. కాగా, ఈ పోస్టుకు ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారుల పేర్లు వినిపించాయి. వీరిలో జి. సాయి ప్రసాద్ పేరు ప్రముఖంగా తెరమీదికి వచ్చింది. అయితే, ఈయనకు సర్వీసు ఇంకా ఉండడంతో విజయానంద్ వైపే చంద్రబాబు మొగ్గు చూపారు. కాగా, తనకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు విజయానంద్ ధన్యవాదాలు తెలిపారు.

**ప్రత్యేక పరిస్థితులు: చంద్రబాబు**

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నియామకానికి సంబంధించిన జీవో జారీకి ముందు సీనియర్ ఐఏఎస్ అధికారులు సాయిప్రసాద్, విజయానంద్‌లతో ఉండవల్లిలోని తన నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ఇద్దరూ సీనియర్లే అయినప్పటికీ ప్రత్యేక పరిస్థితుల్లో విజయా నంద్‌కు సీఎస్‌గా అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఇద్దరూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సీనియర్ ఐఏఎస‌ల సహయ, సహకారాలు ప్రభుత్వానికి చాలా అవసరమని వివరించారు.

**పలు రంగాలపై పట్టు**

తదుపరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె. విజయానంద్ ఉమ్మడి కడప జిల్లాకు చెందినవారు. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన ఆయన ఉమ్మడి, విభజిత ఏపీలలో కీలక పోస్టుల్లో పనిచేశారు. విద్యుత్ సహా పలు రంగాల మంచి పట్టుసాధించారు. 1993లో తొలుత ఆదిలాబాద్ జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా విధుల్లో చేరిన ఆయన... 1996లో రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా, గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు డైరెక్టర్‌గా పని చేశారు. 1997-2007 మధ్య ఉమ్మడి ఏపీలో రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. అనంతరం శ్రీకాకుళం, నల్గొండ జిల్లాల్లో కలెక్టర్‌గా సేవలందించారు. 2016-2019 మధ్య ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. 2019-2021 మధ్య రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. 2022లో ఏపీ జెన్కో చైర్మన్‌గా ఉన్న ఆయన 2023లో ఏపీ ట్రాన్స్‌కో చైర్మన్, ఎండీగా సేవలందించారు. విద్యుత్ రంగంలో ఆయనకు సుదీర్ఘ అనుభవం ఉంది. దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ రంగంపై అవగాహన ఉండడంతో పాటు విద్యుదుత్పత్తి, ప్రసారం, పంపిణీపై అపారమైన అనుభవం సొంతం చేసుకున్నారు. ఏపీతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లో విద్యుత్ రంగానికి సంబంధించిన సమస్యలు తలెత్తినప్పుడు వాటి పరిష్కారానికి ఆయన ఇచ్చిన సలహాలు, సూచనలు ఎంతో దోహదపడ్డాయి.

## కాలుష్య కారక పరిశ్రమలపై పవన్ కన్నెర్ర

**కాకినాడ-నవభూమి:** కాకినాడ తీరప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతున్న పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టాలని డిప్యూటీ సీఎం, పర్యావరణ, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తీర ప్రాంతంలో యూనివర్సల్ బయో?ఫ్యూయల్స్ సంస్థ విడుదల చేస్తున్న కాలుష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఆదేశాలతో కాకినాడ రూరల్ మండలం వాకలపూడిలోని ఈ ఫ్యాక్టరీని పరిశీలించిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు.. దీనిని తాత్కాలికంగా మూసివేయించారు. కొంతకాలంగా వాయు కాలుష్యంపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంపై డిప్యూటీ సీఎం పవన్ స్పందించారు. పీసీబీ చైర్మన్ కృష్ణయ్య, జిల్లా పీసీబీ ఈఈ శంకరరావులతో ఫోన్‌లో మాట్లాడారు. యూనివర్సల్ బయో ఫ్యూయల్స్ సంస్థ కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, వాస్తవ పరిస్థితిని పరిశీలించి తక్షణం నివేదిక అందజేయాలని ఆదేశించారు.

## కూటమి పాలనపై రాబిన్ శర్మ గ్రౌండ్ రిపోర్ట్

(1వపేజీ తరువాయి)శంతన్ స్థానంలో నియమితుడైన అనంత్ తివారీ నేతృత్వంలో ఈ కొత్త బృందం ప్రభుత్వానికి సహాయకారిగా పని చేయనుంది. దీనిని పార్టీ తరపున ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్లానింగ్ శాఖ ఆధ్వర్యంలో ఒక బృందాన్ని మంత్రులందరి వద్ద నియమించనున్నారు.

## టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఎవరికి?

(1వపేజీ తరువాయి)క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూస్తున్నారు. అదేసమయంలో కార్యకర్తలు కష్టసుఖాలకు ప్రాధాన్యమిస్తున్నారని చెబుతున్నారు. వీటిన్నటికీ మించి టీడీపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేశారు. దాదాపు 80 లక్షల సభ్యత్వాలు చేయించి పార్టీ నెట్ వర్క్ విస్తరించారు. దీంతో ఆయన సమర్థతకు తగిన గుర్తింపునివ్వాలని అధినేత చంద్రబాబు భావిస్తున్నారని అంటున్నారు. %ూశ్రీంశీ =ముం% - వైరల్ : యూపీ వరుడి బరాత్‌లో రష్యన్ సెక్సీ డాన్సర్‌లు తెలుగుదేశం పార్టీ జాతీయ పార్టీగా నమోదైన తర్వాత రెండు తెలుగు రాష్ట్రాలకు రెండు కార్యవర్గాలను నియమించారు. ఏపీ టీడీపీకి తొలి అధ్యక్షుడిగా ఉత్తరాంధ్రకు చెందిన బీసీ నేత కిమిడి కళావెంకటరావును నియమించారు. 2014లో పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన కళా 2017లో రాష్ట్ర మంత్రివర్గంలో చేరారు. ఆ తర్వాత కూడా 2019 వరకు ఆయనే పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2019 ఎన్నికల్లో ఓటమి తర్వాత కళా నుంచి అధ్యక్ష బాధ్యతలను మరో బీసీ నేత అచ్చెన్నాయుడికి అప్పగించారు. అచ్చెన్నాయుడు కూడా ఐదేళ్లపాటు రాష్ట్రపార్టీ చీఫ్ గా పనిచేశారు. ఆయన మంత్రివర్గంలో చేరాక ఉత్తరాంధ్రకే చెందిన బీసీ నేతగా పల్లాకు చాన్స్ ఇచ్చారు. ఇప్పుడు పల్లా మంత్రి అయితే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొత్తవారిని నియమిస్తారా? లేక పల్లానే కొనసాగిస్తారా? అనేది చర్చకు తావిస్తోంది. రాష్ట్ర పార్టీ చీఫ్ గా బీసీ నేతలకు అవకాశమిస్తున్న అధినేత చంద్రబాబు నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది. పార్టీ అధికారంలో ఉండగా, అధ్యక్ష పదవి చేపట్టాలని చాలా మంది నేతలు పోటీపడుతున్నారు. వరుసగా పదేళ్ల పాటు ఉత్తరాంధ్ర నేతలే ఈ పదవిని చేపడుతున్నారు. దీంతో ఈ సారి రాయలసీమ, దక్షిణ కోస్తా నేతలకు చాన్స్ వస్తుందని భావిస్తున్నారు. ఆనవాయితీ ప్రకారం ఈ సారి బీసీలకే పట్టం కడతారా? లేక ఎస్సీ, ఎస్టీ నేతలు ఎవరినైనా పార్టీ చీఫ్ చేస్తారా? అన్నది చర్చనీయాంశంగా మారింది.

## ఏపీలో పెరిగిన సైబర్ నేరాలు

(1వపేజీ తరువాయి)కొల్లగొట్టారు అంటే ఏ మేరకు ఏపీ ప్రజలు మోసపోయారో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్ర ప్రజల నుంచి సైబర్ నేరగాళ్లు సగటున రోజుకు 3.36 కోట్ల రూపాయలను కొల్లగొట్టారని తాజాగా 2024 వార్షిక నేర గణాంకాల నివేదికలో ఏపీ డీజీపీ ద్వారకా తిరుమల రావు వెల్లడించారు. 2024లో ఏపీ ప్రజలను నిండా ముంచేశారు 2023 సంవత్సరంతో పోలిస్తే 2024 సంవత్సరంలో సైబర్ నేరాలపై ఫిర్యాదులు 52.4% పెరిగాయి. ఇక నమోదైన కేసుల సంఖ్య 34.3% పెరిగింది. బాధితులు కోల్పోయిన సొమ్ము విలువ ఏకంగా 610 శాతం పెరిగింది. సైబర్ నేరాల పైన ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నప్పటికీ ఏపీలోని ప్రజలను సైబర్ నేరగాళ్లు నిండా ముంచుతూనే ఉన్నారు.

225 కోట్ల రూపాయలను నేరగాళ్ల బారి నుండి కాపాడిన పోలీసులు 2023 వ సంవత్సరంలో 682 సైబర్ నేరాలు నమోదు కాగా 2024 సంవత్సరంలో 916 సైబర్ నేరాలు నమోదు కావడం ప్రధానంగా కనిపిస్తుంది. ఇక సైబర్ నేరాలపై ఫోన్ కాల్స్ ద్వారా 2023 లో నాలుగు లక్షల 74 వేల పైచిలుకు ఫిర్యాదులు రాగా, 2024 సంవత్సరంలో 1930 నెంబర్ కు 7 లక్షల ఇరవై మూడు వేల పైచిలుకు ఫిర్యాదులు వచ్చాయి. 2024లో పోలీసులు 225 కోట్ల రూపాయలను నేరగాళ్ల బారి నుండి కాపాడారు.

## ఘోర విమాన ప్రమాదం

(1వపేజీ తరువాయి)వెల్లడించింది. బాధిత కుటుంబాలకు సాయం చేస్తామని ప్రకటించింది. . ఇక, ఈ ప్రమాదం చోటు చేసుకున్న సమయంలో ఆరుగురు సిబ్బందితో పాటు 175 ప్రయాణికులు ఉన్నారని చెబుతున్నారు. అయితే... వారిలో ఇద్దరు సిబ్బంది మాత్రమె ప్రాణాలతో బయటపడగా.. మిగిలిన 179 మంది మృతి చెందినట్లు చెబుతున్నారు. విమానంలో భారీ పేలుడు సంభవించడంతో అది మొత్తం కాలిపోయిందని అధికారులు ధృవీకరించారు. మరోపక్క.. ఈ విమాన ప్రమాదంపై దక్షిణ కొరియా తాత్కాలిక అధ్యక్షుడు చోయ్ సాంగ్ మోక్ స్పందిస్తూ.. తక్షణమే అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పోలీసు, అగ్నిమాపక శాఖలతో పాటు ఇంటీరియర్, ల్యాండ్ మినిస్ట్రల్లకు మార్గదర్శకాలు జారీ చేశారు. ఇదే సమయంలో... ముయాన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అన్ని విమానాల రాకపోకలను రద్దు చేశారు. కాగా... దక్షిణ కొరియాలో 1997లో జరిగిన విమాన ప్రమాదంలో 228 మంది మృతిచెందగా.. ఆ తర్వాత ఇదే పెద్ద ప్రమాదం అని చెబుతారు!


## ఇన్నేళ్లల్లో ఎప్పుడూ జరగలేదు

(1వపేజీ తరువాయి)థియేటర్‌లో కార్లు, బైక్‌లకు ప్రత్యేక పార్కింగ్ ఉందని పేర్కొంది. ఈ మేరకు 6 పేజీల లేఖను సంధ్య థియేటర్ యాజమాన్యం పోలీసులకు పంపింది. కాగా, డిసెంబర్ 4న సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటో రేవతి అనే మహిళ మృతి చెందగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆ బాలుడు ప్రస్తుతం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబానికి అల్లు అర్జున్ రూ. కోటి, దర్శకుడు సుకుమారు రూ. 50 లక్షలు, మైత్రీ మూవీ మేకర్స్ రూ. 50 లక్షలు ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు, తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రెడ్డి రూ. 25 లక్షలు అందించారు. కాగా, తొక్కిసలాట ఘటన నేపథ్యంలో సంధ్య థియేటర్ యాజమాన్యంతోపాటు అల్లు అర్జున్‌పైనా కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అల్లు అర్జున్‌ను కూడా అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన బెయిల్‌పై విడుదల చేశారు.

## కోనేరు హంపికి ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ అభినందనలు

**హైదరాబాద్-నవభూమి:** ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో ర్యాపిడ్ ఛాంపియన్‌గా నిలిచిన కోనేరు హంపిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. కోనేరు హంపి విజయం దేశానికే గర్వకారణమంటూ 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. 2024.. భారతదేశ చెస్ క్రీడాకారులకు మరిచిపోలేని సంవత్సరమని చంద్రబాబు పేర్కొన్నారు. కాగా, కోనేరు హంపికి మంత్రి లోకేశ్ కూడా అభినందనలు తెలిపారు. అసాధారణమైన పట్టుదల, సంకల్పం, నైపుణ్యం హంపి సొంతమని లోకేశ్ ట్వీట్ చేశారు. మరిన్ని విజయాలు సాధించి భావితరాలకు హంపి స్ఫూర్తిగా నిలవాలని లోకేశ్ ఆకాంక్షించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 | హైదరాబాద్
సోమవారం
30 । డిసెంబర్ । 2024




## స్కామ్‌లతో దిగజారిన కాంగ్రెస్ ప్రతిష్ట..



**బెంగళూరు -నవభూమి:** కర్ణాటక రాజకీయాలను 2024 సంవత్సరం కుదిపేసింది! ఈ ఏడాది భారీ కుంభకోణాలు వెలుగుచూడటంతో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ట పూర్తిగా దిగజారింది. ముఖ్యంగా వాల్మీకి, ముడా కుంభకోణాల్లో అధికార పార్టీ ప్రమేయం స్పష్టంగా వెల్లడైంది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన భార్యకు ముడా భూముల కుంభకోణంలో పాత్ర ఉందని నిర్ధారణ కావడంతో ఆయనపై కేసు నమోదై, విచారణను ఎదుర్కొంటున్నారు. ఇక విపక్ష బీజేపీ నేత, మాజీ సీఎం యెడియూరప్పపై పోక్సో కేసు నమోదు కావడంతో పాటు ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది.తన మైనర్ కుమార్తెపై యెడియూరప్ప లైంగిక దాడి చేశారని ఒక మహిళ ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. మరో విపక్ష నేత, జేడీఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై లైంగిక వేధింపుల ఆరోపణలు తీవ్ర సంచలనం సృష్టించాయి. ఇక రాష్ట్రంలో శాంతి భద్రతల విషయానికి వస్తే మార్చి 1న రామేశ్వరం కేఫ్‌లో జరిగిన బాంబు పేలుడు రాష్ట్రాన్ని కుదిపేసింది. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు కాంగ్రెస్ సర్కార్ తీవ్ర అస్థిరత మధ్య పాలన కొనసాగించిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. సీఎం పదవికి ఎవరు ఎసరు పెడతారోనని తెలియని అనిశ్చితి పరిస్థితుల్లో సీఎం సిద్ధరామయ్య క్షణమొక యుగంలా పాలన కొనసాగిస్తున్నారు.

## చైనా సరిహద్దులో శివాజీ విగ్రహం.. ఆవిష్కరించిన భారత సైన్యం



**న్యూఢిల్లీ-నవభూమి:** తూర్పు లడఖ్ సెక్టర్‌లోని వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ)కి సమీపంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని భారత సైన్యం ఆవిష్కరించింది. పాంగాంగ్ సో సరస్సు తీరంలో, సముద్ర మట్టానికి 14,300 అడుగుల ఎత్తులో దీనిని ఏర్పాటు చేసింది. లెఫ్టినెంట్ జనరల్ హితేష్ భల్లా గురువారం ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఛత్రపతి శివాజీ ఔన్నత్యం నిరంతరం స్ఫూర్తిదాయకమని లేహ్‌లోని 14 కోర్ ఎక్స్ పోస్ట్‌లో తెలిపింది.ధైర్యసాహసాలు, ముందుచూపు, చెక్కు చెదరని న్యాయాలకు ప్రతీక శివాజీ అని కొనియాడింది. ఇదిలా వుండగా, ఇటీవల చిట్టచివరి ఘర్షణ ప్రాంతాలైన దెమ్‌చోక్, డెప్సాంగ్‌ల నుంచి భారత్, చైనా తమ సైన్యాలను ఉపసంహరించాయి. దీంతో దాదాపు నాలుగున్నరేళ్ల నుంచి ఇరు దేశాల మధ్య ఏర్పడిన ఘర్షణ వాతావరణానికి తెర పడింది.

## మాజీ కానిస్టేబుల్ ఆస్తుల్లో.. 14 కోట్ల నగదు, 40 కోట్ల విలువైన పసిడి



**భోపాల్-నవభూమి:** మధ్యప్రదేశ్ రవాణా శాఖకు చెందిన ఓ మాజీ కానిస్టేబుల్ నివాసాలలో సోదాలు జరిపిన వివిధ దర్యాప్తు సంస్థలకు దాదాపు రూ.14 కోట్ల నగదు, రూ.40 కోట్ల విలువైన బంగారం, రూ.2 కోట్ల విలువైన వెండి,రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు సంబంధించిన అనేక పత్రాలు లభించాయి.
మాజీ కానిస్టేబుల్ సౌరభ్ శర్మ ఇంటిపై గత వారం లోకాయుక్త మొదటిసారి దాడి జరపగా రూ. 2.87 కోట్ల నగదు, 275 గ్రాముల వెండితోసహా రూ.7.98 కోట్ల చరాస్తులు లభించాయి. ఆదాయ పన్ను శాఖ మరోసారి దాడి జరపగా రూ.40 కోట్ల విలువైన 52 కిలోల బంగారు బిస్కెట్లు, రూ.11 కోట్లకు పైగా నగదు భోపాల్‌లో ఒక నిర్జన ప్రదేశంలో వదిలివేసిన కారులో లభించాయి.

## పూర్తిగా అవమానకరం

### మన్మోహన్ అంత్యక్రియల తీరుపై రాహుల్ ఆగ్రహం



**న్యూఢిల్లీ-నవభూమి:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఢిల్లీలోని నిగంబోధ్ ఘాట్‌లో శనివారం అంత్యక్రియలు నిర్వహించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా విరుచుకుపడ్డారు. గతంలో అంత్యక్రియలకు ఇతరులకు ప్రత్యేక స్మశాన స్థలాలను ఇచ్చిన విషయాలను ఆయన ఉటంకిస్తూ.. ఇది మాజీ ప్రధాని, సిక్కు జాతిని పూర్తిగా అవమానపర్చడమేనని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. మన్మోహన్ అంత్యక్రియల విషయంలో రాజకీయాలకు, సంకుచిత భావాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించ లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ విమర్శించారు. ఈ సందర్భంగా 2016లో మాజీ ప్రధాని వాజపేయి అంత్యక్రియల నాటి ఫుటేజ్‌ను షేర్ చేస్తూ మన్మోహన్ సింగ్ విషయంలో కేంద్రం వైఖరిని తప్పుబట్టారు.

**స్మారకంపై రాజకీయాలు వద్దు**


మన్మోహన్ అంత్యక్రియలు, స్మారక నిర్మాణ విషయంలో మోదీ ప్రభుత్వ వైఖరిని సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్పీ, ఆప్ తీవ్రంగా ఖండించాయి. ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ ఎక్స్ వేదికగా శుక్రవారం స్పందిస్తూ దేశ మాజీ ప్రధాన మంత్రులను గౌరవించే సాంప్రదాయాన్ని కొనసాగించాలని ప్రధాని మోదీని కోరారు.

**పీవీ విషయాన్ని కాంగ్రెస్ మరిచిందా?**

బతికి ఉన్నప్పుడు ఎన్నడూ మన్మోహన్ సింగ్‌ను గౌరవించని కాంగ్రెస్ ఇప్పుడు ఆయన మరణాంతరం రాజకీయాలు చేస్తున్నదని బీజేపీ సీనియర్ నేత సుధాంశు త్రివేది విమర్శించారు. మాజీ ప్రధానులు లాల్ బహదూర్ శాస్త్రి, పీవీ నరసింహారావులు సహా గాంధీయేతర నేతలెవ్వరికీ కాంగ్రెస్ గౌరవాన్ని ఇవ్వలేదని ఆరోపించారు. బీజేపీ నేత సీఆర్ కేశవన్ మాట్లాడుతూ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కు ఢిల్లీలో అంత్యక్రియలు జరపకుండా కాంగ్రెస్ అడ్డుకున్న విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ దీనిపై సమాధానం చెప్పాలన్నారు.

బీఎస్ఎన్ఎల్‌లో రెండో విడత వీఆర్ఎస్

## ఆర్థిక శాఖ అనుమతి కోరిన టెలికాం శాఖ




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రభుత్వ టెలికాం రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌లో ఉద్యోగుల రెండో విడత స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్)కు రంగం సిద్ధమవుతున్నది. సంస్థలోని 35 శాతం సిబ్బందిని తగ్గించే లక్ష్యంతో చేపట్టే రెండో విడత వీఆర్ఎస్‌కు టెలి కమ్యూనికేషన్స్ శాఖ ఆర్థిక శాఖను అనుమతి కోరింది. ఈ మేరకు 15 వేల కోట్ల రూపాయలను కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. ఈ పథకం ద్వారా ప్రస్తుతం 18 వేల నుంచి 19 వేల మంది ఉద్యోగులను సంస్థ నుంచి ఇంటికి పంపనుంది.వీఆర్ఎస్ కారణంగా భవిష్యత్తులో సంస్థపై ఆర్థిక భారం తగ్గడమే కాక, లాభదాయకత పెరుగుతుందని పేర్కొంది. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ తన ఆదాయంలో 38 శాతమైన రూ.7,500 కోట్లను సిబ్బంది జీతాలకు వెచ్చిస్తున్నది. దీంతో కంపెనీ కార్యకలాపాలను క్రమబద్ధం చేసేందుకు ఈ ఖర్చును రూ.5,000 కోట్లకు తగ్గించాలని ప్రణాళిక వేస్తున్నది. రెండో విడత వీఆర్ఎస్‌కు ఆర్థిక శాఖ నుంచి అనుమతి వస్తే దానిని కేంద్ర మంత్రివర్గం ఆమోదానికి పంపాలని ఆ శాఖ యోచిస్తున్నది. కాగా, ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ ఇంకా 4జీ సేవలను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురాలేదు.

## కండోమ్స్ అమ్మకాల్లో బెంగళూరు టాప్.. తర్వాత ఢిల్లీ, హైదరాబాద్, రాత్రి 10 దాటాక..!




**న్యూఢిల్లీ-నవభూమి:** కండోమ్స్ అమ్మకాలకు సంబంధించి స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ఒక వార్షిక నివేదికను విడుదల చేసింది. ఇందులో దేశంలోని వివిధ నగరాల్లో ఈ ఏడాది అమ్ముడుపోయిన కండోమ్ వివరాలను తెలిపింది. ఇందులో అత్యధికంగా బెంగళూరులో కండోమ్‌లు అమ్ముడుపోయినట్లు వెల్లడించింది. రెండు, మూడు స్థానాల్లో ఢిల్లీ, హైదరాబాద్ నగరాలు నిలిచాయి. రాత్రి 10 దాటిన తర్వాత కండోమ్స్ అమ్మకాలు అధికంగా ఉన్నాయని తాజాగా పేర్కొంది.
కొత్త సంవత్సరం రాబోతోంది. ఇక పాత సంవత్సరం ముగియనుండటంతో.. ఈ ఏడాదికి సంబంధించి జరిగిన విషయాలు మొత్తం రివైండ్ అవుతున్నాయి. ఇక ఏడాది మొత్తానికి సంబంధించిన పలు నివేదికలు వెల్లడి అవుతున్నాయి. ఇక ఆన్‌లైన్ డెలివరీ యాప్ స్విగ్గీ కూడా ఈ ఏడాది తమ ప్లాట్‌ఫారమ్‌లో విక్రయించిన వస్తువుల గురించి వార్షిక రిపోర్ట్‌ను తాజాగా వెలువరించింది. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో ఈ ఏడాది విక్రయం అయిన వస్తువులకు సంబంధించి ఇందులో వెల్లడించింది. ఈ క్రమంలోనే తమ ప్లాట్‌ఫారమ్‌లో విక్రయించిన కండోమ్స్‌కు సంబంధించి టాప్-3 నగరాల పేర్లను విడుదల చేసింది. ఇందులో మొట్టమొదటి స్థానంలో బెంగళూరు ఉండగా.. ఆ తర్వాతి స్థానాల్లో ఢిల్లీ, హైదరాబాద్ నగరాలు ఉన్నట్లు స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ స్పష్టం చేసింది.రాత్రి 10 గంటల తర్వాత ఈ కండోమ్స్ విక్రయాలు అధికంగా ఉన్నట్లు తెలిపింది. మరీ ముఖ్యంగా రాత్రి 10 గంటల నుంచి 11 గంటల మధ్య అత్యంత రహస్యంగా కండోమ్స్ అమ్మకాలు జరుగుతున్నాయని వెల్లడించింది. ఆన్‌లైన్ షాపింగ్‌లో ఈ కండోమ్స్ ఎక్కువగా కొంటున్నట్లు పేర్కొంది. 140 ఆర్డర్స్‌లో ఒక సెక్స్ వెల్నెస్ ఐటెమ్ ఉంటుందని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వివరించింది. బెంగళూరు వాసులు కండోమ్స్ ఎక్కువగా కొనుగోలు చేసినట్లు స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వార్షిక నివేదికలో తెలిపింది.
ఇక ఆన్‌లైన్ షాపింగ్‌లో కిరాణా సామాగ్రితో పాటు నిత్యవసర వస్తువులను వేగంగా డెలివరీ చేస్తున్నట్లు స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వెల్లడించింది. ఇక రాత్రి 10 గంటల తర్వాత కండోమ్స్‌తో పాటు మసాలా ఫ్లేవర్స్ చిప్స్, కుర్ కురే, ఫ్లేవర్డ్ కండోమ్‌లు అధికంగా సేల్ అవుతున్నాయని తెలిపింది. ఇక ఈ రహస్య వస్తువులు అన్నీ బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్‌లోనే ఎక్కువగా అమ్ముతున్నట్లు వివరించింది.కండోమ్స్ మాత్రమే కాకుండా స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో ఈ ఏడాది అత్యధిక లో దుస్తుల అమ్మకాల్లో కూడా బెంగళూరు నుంచే జరిగాయి. హైదరాబాద్, ముంబైతో సమానంగా బెంగళూరువాసులు కూడా లో దుస్తులను ఆర్డర్ చేసినట్లు తెలిపింది. మరోవైపు.. బెంగళూరు ప్రజలు పూజ సామగ్రి, నిత్యావసర వస్తువులను కూడా స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో ఎక్కువగా ఆర్డర్ చేశారని పేర్కొంది. ఇతర నగరాలతో పోలిస్తే దీపావళి వేడుకల సందర్భంగా బెంగళూరు వినియోగదారులు 1.8 రెట్లు అధికంగా మద్యం, షాట్ గ్లాసులను కొనుగోలు చేసినట్లు వెల్లడించింది. దేశంలోని అన్ని నగరాల కంటే బెంగళూరు ప్రజలు ఎక్కువ టూత్ బ్రష్‌లను ఆర్డర్ చేశారు. 2024లో ఎక్కువమంది ఇష్టపడే ఆహార పదార్థాల డేటాను కూడా స్విగ్గీ నివేదికలో తెలిపింది. బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి 2024లో

## పీఎస్ఎల్‌వీ సీ 60 రాకెట్ ప్రయోగం.. మరి కొద్ది గంటల్లో కౌంట్‌డౌన్ ప్రారంభం




**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ రాకెట్ ప్రయోగానికి ఈరోజు రాత్రి 8.58 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభానికి ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ రాత్రి బెంగళూరు నుంచి షార్‌కు చేరుకోనున్నారు. పీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది 62వ ప్రయోగం కాగా పీఎస్ఎల్‌వీ కోర్ అలోన్ దశతో చేసే 18వ ప్రయోగమిది. రేపు నింగికేగనున్న పీఎస్ఎల్‌వీ సీ60 రాకెట్ 320 టన్నుల బరువు, 44.5 మీటర్ల ఎత్తు ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు.(స్ట్రాపాన్ బూస్టర్లను )ఉపయోగించకపోవడంతో ఈ రాకెట్ బరువు 229 టన్నులుగా ఉంటుందని వివరించారు. రాకెట్‌లో రెండో దశకు ద్రవ ఇంధనం, మూడో దశకు ఘన ఇంధనం, నాలుగో దశకు ద్రవ ఇంధనాన్ని వినియోగించనున్నట్లు వివరించారు. ఇస్రో రూపొందించిన స్పాడెక్స్ అనే జంట ఉపగ్రహాలు ఈ ప్రయోగంలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని, వీటిని ఛేజర్, టార్గెట్ అనే పేర్లను నామకరణం చేశామన్నారు. ఈ ఉపగ్రహాలు స్పేస్ డాకింగ్, ఫార్మేషన్ ఫ్లయింగ్, మానవ అంతరిక్షయానం వంటి సేవలకు ఉపయోగపడతాయని స్పష్టం చేశారు.

## ఏడు ఖండాలు.. 7 అత్యంత ఎత్తైన పర్వతాలను అధిరోహించిన బాలిక



**ముంబై - నవభూమి:** ముంబైకు చెందిన 16 ఏళ్ల కామ్యా కార్తికేయన్ పర్వతారోహణలో ప్రపంచ రికార్డును సాధించింది. ఏడు ఖండాల వ్యాప్తంగా ఏడు అత్యంత ఎత్తైన పర్వతాలను అధిరోహించిన అతి పిన్నవయస్కురాలైన బాలికగా కామ్య చరిత్ర సృష్టించింది. ఏడు పర్వతాలను అధిరోహించే సవాల్‌ను స్వీకరించిన కామ్య మౌంట్ కిలిమంజారో(ఆఫ్రికా), మౌంట్ ఎల్‌బ్రస్(యూరపు), మౌంట్ కాజీయాస్కో (ఆస్ట్రేలియా), మౌంట్ అకాన్‌కాగువా(దక్షిణ అమెరికా), మౌంట్ డెనలి(ఉత్తర అమెరికా), మౌంట్ ఎవరెస్ట్(ఆసియా), మౌంట్ విన్సన్(అంటార్కటికా)లను విజయవంతంగా అధిరోహించింది.తన తండ్రి కమాండర్ కార్తికేయన్‌తో కలసి మౌంట్ విన్సన్ చేరుకున్న కామ్య డిసెంబర్ 24న సప్త పర్వాతాధిరోహణ సవాల్‌ను పూర్తి చేసింది. ముంబైలోని నేవీ చిల్డ్రన్ స్కూల్‌లో 12వ తరగతి చదువుతున్న కామ్య, ఆమె తండ్రి కమాండర్ కార్తికేయన్‌ను భారతీయ నేవీ అభినందించింది. ఉత్తర ధ్రువం, దక్షిణ ధ్రువం చేరుకోవడాన్ని తన తదుపరి లక్ష్యంగా కామ్య నిర్దేశించుకుంది.

## రైలు చక్రాల మధ్య దాక్కుని 250 కి.మీ... అసలు విషయం ఇదే!



**న్యూఢిల్లీ-నవభూమి:** సోషల్ మీడియాలో వైరల్ గా మారే విషయాలు కొన్ని సందర్భాల్లో సంతోషంగా అనిపిస్తే.. మరికొన్ని సందర్భంగా జుగుప్సాకరంగా ఉంటాయని అంటారు. ఇదే సమయంలో.. కొన్ని వీడియోలు సర్ ప్రైజ్ గా అనిపిస్తే, మరికొన్ని విషయాలు షాకింగ్ అనిపిస్తాయి. అలాంటి వీడియో ఒకటి ఇటీవల నెటిజన్లను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన సంగతి తెలిసిందే. ఒక వ్యక్తి ఎక్స్ ప్రెస్ రైలు బోగీ కింద చక్రాల మధ్య దాక్కుని సుమారు 250 కి.మీ. మేర ప్రయాణించాడని అందులో పేర్కొనడమే! ఈ వీడియో నెట్టింట తీవ్ర సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ వ్యవహారంపై రైల్వే శాఖ స్పందించింది. ఈ సందర్భంగా... వైరల్ అవుతున్న వీడియోలో వాస్తవం లేదని స్పష్టం చేసింది. . ఓ వ్యక్తి ఎక్స్ ప్రెస్ రైలు బోగీ కింద చక్రాల మధ్య దాక్కుని 250 కి.మీ. మేర ప్రయాణించాడనే వీడియో నెట్టింట వైరల్ గా మారిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... ఓ వ్యక్తి ఇటార్సీ నుంచి జబల్ పూర్ వరకూ సుమారు 250 కిలో మీటర్ల దూరాన్ని ఎక్స్ ప్రెస్ రైలు బోగీ కింద చక్రాల మధ్య దాక్కుని ప్రయాణించాడని ఆ వీడియోలో పేర్కొన్నారు. ఆ వీడియోలో.. ఆగి ఉన్న రైలు కోచ్ చక్రాల నుంచి ఓ వ్యక్తి బయటకు వస్తున్నట్లు కనిపిస్తుంది. రైలు టిక్కెట్ కొనుక్కునేందుకు డబ్బులు లేకపోవడంతోనే అతడు ఈ విధంగా చేశాడని కూడా సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం సాగింది. దీంతో.. పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై తాజాగా రైల్వే శాఖ స్పందించి.. క్లారిటీ ఇచ్చింది. ఆగి ఉన్న రైలులో వీల్ యాక్సిల్ నుంచి బయటకు వస్తున్న వ్యక్తిని ఎవరో వీడియో చిత్రీకరించారని.. టిక్కెట్ కొనుక్కోవడానికి డబ్బులు లేనందున ఇలా చక్రాల మధ్య దాక్కుని ప్రయాణించాల్సి వచ్చిందని తప్పుదోవ పట్టించే వాదనతో దీన్ని ప్రసారం చేశారని రైల్వే అధికారులు తెలిపారు. ఇది పూర్తిగా నకిలీ నివేదిక అని అన్నారు. దీనిపై స్పందించిన రైల్వే బోర్డు సమాచార ప్రచార ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దిలీప్ కుమార్.. రైలు కదలకుండా ఉన్నప్పుడు ఆ వ్యక్తి వీల్ యాక్సిల్ దగ్గర దాక్కున్నాడని.. కదులుతున్న రైలు చక్రాలపై మధ్యలో దాక్కోవడం ఎవరికీ ఆచరణ సాధ్యం కాదని.. కదులుతున్న వీల్స్ తో పాటు వీల్ సెట్ కూడా కదులుతుందని వెల్లడించారు.

## హైదరాబాద్ ఏఎంబీ మాల్‌లో బౌన్సర్లతో యూట్యూబర్ అతి




**హైదరాబాద్- నవభూమి:** హైదరాబాద్ ఏఎంబీ మాల్ లో బౌన్సర్లతో యూట్యూబర్ అతి తాజాగా మరోసారి అలాంటి ప్రయత్నమే చేశాడు. ఇతగ 'బౌన్సర్లు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలి. హద్దులు దాటితే వారిపై కఠిన చర్యలు ఉంటాయి' అంటూ హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీపీ ఆనంద్ వార్నింగ్ ఇవ్వటం తెలిసిందే. అతి బిల్డప్ ఇచ్చేందుకు బౌన్సర్లను చుట్టూ వేసుకొని హడావుడి చేసే బ్యాచ్ ఉంటుంది. ఇలాంటి వారికి సేవలు అందించే బౌన్సర్ల తాట తీయాల్సిన అవసరం ఉందన్న విషయం తాజా ఎపిసోడ్ ను చూస్తే అర్థమవుతుంది. ఇంతకూ అసలేం జరిగిందంటే.. ఇటీవల కాలంలో సినీ తారలు.. సెలబ్రిటీలకు తోడుగా చిన్నసైజు సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్ల హడావుడి ఎక్కువైంది. వారి బాటలోనే యూట్యూబర్లు కూడా. కొందరు తమ ఇమేజ్ ను పెంచుకోవటానికి.. సోషల్ మీడియాలో మరింత ఫేమస కావటానికి పిచ్చి పిచ్చి వేషాలు వేస్తున్నారు. ఇందుకోసం అడ్డదారులు తొక్కుతున్నారు. హైదరాబాద్ కు చెందిన ఒకడు తన ఇన్ స్టా ఫాలోవర్స్ ను పెంచుకోవటానికి వీలుగా ఒక ఎత్తు వేశాడు. ! కొండాపూర్ లోని శరత్ సిటీ మాల్ కు బౌన్సర్లతో వెళ్లాడు. ఏఎంబీ మాల్ లోని రెండో అంతస్తుకు వస్తే వారికి డబ్బులు ఇస్తానని పేర్కొంటూ.. సూట్ కేసులతో మాల్ వద్ద హడావుడి చేశాడు. అయితే.. అతన్ని అక్కడి ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. ఇలాంటి వాటిని తాము అనుమతించమని చెప్పటంతో.. మరేం చేయలేక వెనుదిరిగాడు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ హడావుడి చేసినోడ్ని వంశీగా గుర్తించారు. గతంలోనూ సోషల్ మీడియాలో ఫేమస్ కావటానికి వీలుగా కేపీహెచ్ బీలోనూ హడావుడి చేయటంతో.. అక్కడి పోలీసులు అతడి మీద కేసు బుక్ చేశారు. తాజాగా మరోసారి అలాంటి ప్రయత్నమే చేశాడు. ఇతగాడి అతి చేష్టలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఉదంతంపై తాము ఎలాంటి కేసు నమోదు చేయలేదని గచ్చిబౌలి పోలీసులు చెబుతున్నారు. కాకుంటే.. వైరల్ వీడియోల పుణ్యమా అని అతడిపై కేసు నమోదయ్యే అవకాశం ఉందంటున్నారు. ఏం జరుగుతుందో చూడాలి.

## కలెక్టర్ కూతురైతే ఇలాగే చేస్తారా? బోరు బావిలోని చిన్నారిపై తల్లి



**జైపూర్ (రాజస్థాన్):-నవభూమి:** "కలెక్టర్ మేడమ్ కుమార్తె అయితే ఇలాగే చేస్తారా? నా కూతురు ఆరు రోజులుగా గోతిలో అల్లాడిపోతోంది. ఇన్ని రోజులుగా ఇలాగే వదిలేస్తారా? దయచేసి వీలైనంత త్వరగా బయటకు తీయండి" - రాజస్థాన్‌లో ఆరు రోజులుగా బోరు బావిలో చిక్కుకున్న మూడేళ్ల చిన్నారి చేతన తల్లి ధోలీదేవి ఆవేదన ఇది.కోట్‌పుత్లీ-బెహ్రోర్ జిల్లాకు చెందిన చేతన ఈ నెల 23న తండ్రి పొలంలోని 150 అడుగుల లోతైన బోరుబావిలో పడిపోయింది. 110 గంటలుగా చిన్నారిని రక్షించేందుకు సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అధికారులు పైపు ద్వారా ఆహారం, నీళ్లు అందిస్తున్నారు.

## స్పోర్ట్స్ షూ వేసుకుని ఆఫీస్‌కు వచ్చిందని ఉద్యోగం తీసేశారు.. ఆ మహిళ కోర్టుకు ఎక్కితే..



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆఫీస్‌కు వెళ్లేటపుడు కాస్త పద్ధతిగా తయారై వెళ్లాలి. ఫార్మల్ డ్రెస్ వేసుకుని ఆఫీస్ కోడ్‌ను బట్టి టక్ చేసుకుని షూ వేసుకుని వెళ్లాలి. అలా వెళ్లకపోతే బాస్‌ల నుంచి తిట్లు తినాల్సి ఉంటుంది. అంతకు మించి పెద్ద ప్రమాదం జరగదు. అయితే బ్రిటన్‌లోని ఓ సంస్థ మహిళా ఉద్యోగికి కోలుకోలేని షాకిచ్చింది.ఆఫీస్ కు వెళ్లేటపుడు కాస్త పద్ధతిగా తయారై వెళ్లాలి. ఫార్మల్ డ్రెస్ వేసుకుని ఆఫీస్ కోడ్‌ను బట్టి టక్ చేసుకుని షూ వేసుకుని వెళ్లాలి. అలా వెళ్లకపోతే బాస్‌ల నుంచి తిట్లు తినాల్సి ఉంటుంది. అంతకు మించి పెద్ద ప్రమాదం జరగదు. అయితే బ్రిటన్ లోని ఓ సంస్థ మహిళా ఉద్యోగికి కోలుకోలేని షాకిచ్చింది. స్పోర్ట్స్ షూ వేసుకుని ఆఫీస్‌కు వచ్చిందనే నెపంతో ఏకంగా ఉద్యోగంలో నుంచి తీసేసింది. దీంతో ఆ మహిళ సదరు యాజమాన్యంపై కోర్టుకు ఎక్కింది. ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.బ్రిటన్‌కు చెందిన 20 ఏళ్ల ఎలిజబెత్ బెనాస్సీ ఓ సంస్థలో పని చేస్తోంది. ఆమె తన ఆఫీస్‌కు వెళ్లేటపుడు స్పోర్ట్స్ షూ వేసుకుని వెళ్లింది. దీంతో ఆమెను బాస్ ఉద్యోగంలో నుంచి తీసేశాడు. దీంతో ఆమె సదరు సంస్థ యాజమాన్యంపై కోర్టులో పిటిషన్ వేసింది. చాలా మంది ఉద్యోగులు ఆ తరహా షూలతోనే రోజూ ఆఫీస్‌కు వస్తారని, యాజమాన్యం తనను టార్గెట్ చేసిందని, అందుకే ఆ సాకు చూపి తనను ఉద్యోగంలో నుంచి తీసేసిందని పేర్కొంది. మొత్తం వాదనలు విన్న న్యాయమూర్తి ఎలిజబెత్‌కు అనుకూలంగా తీర్పునిచ్చారు.సౌత్ లండన్ ట్రిబ్యునల్ బెనాస్సీ పక్షం వహించి, ఉద్యోగికి అనుకూలంగా తీర్పునిచ్చింది. సదరు యాజమన్యం కావాలనే ఎలిజబెత్‌ను టార్గెట్ చేసినట్టు నిర్ధారణకు వచ్చింది. కంపెనీకి భారీ నష్టపరిహారం విధించింది. సదరు సంస్థ ఎలిజబెత్‌కు 30,000 పౌండ్లు (దాదాపు రూ. 32 లక్షలు) చెల్లించాలని ఆదేశించింది. ఈ కేసు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

## ఎన్నారై ఓటింగ్ గురించి షాకింగ్ రిపోర్ట్.. ఈ రాష్ట్రాల్లో ఒక్కరూ కూడా..

**న్యూఢిల్లీ-నవభూమి:** లోక్‌సభ ఎన్నికల తర్వాత ఎన్నికల సంఘం ఓ కీలక డేటాను విడుదల చేసింది. ఈ డేటా ప్రకారం విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల ఓటింగ్ గణాంకాల గురించి షాకింగ్ నిజాలు వెలుగులోకి వచ్చాయి. అయితే ఓటరు జాబితాలో ఎన్ఆర్ఐ ఓటర్లు వారి పేర్లను చేర్చుకునే సమయంలో చాలా ఉత్సాహం కనిపించిందని ఎన్నికల సంఘం తెలిపింది. ఆ క్రమంలో ఓటరు జాబితాలో 1.2 లక్షల మంది తమ పేర్లను చేరుకున్నారు. కానీ ఎన్నికల సమయంలో మాత్రం ఇండియాకు ఓటు వేసేందుకు వచ్చింది కేవలం 2.48 శాతం మంది మాత్రమే.డేటా ప్రకారం 2024లో 1,19,374 మంది ఎన్ఆర్ఐలు వారి పేర్లను నమోదు చేసుకున్నారని ఎన్నికల సంఘం గణాంకాలను విడుదల చేసింది. ఇందులో కేరళ నుంచి అత్యధికంగా 89,839 రిజిస్ట్రేషన్లు జరిగాయి. కానీ లోక్‌సభ ఎన్నికల సమయంలో కేవలం 2,958 మంది మాత్రమే భారతదేశానికి వచ్చారు. అందులో 2,670 మంది కేరళ నుంచి మాత్రమే ఉన్నారు. ప్రధాని మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 885 మంది విదేశీ ఓటర్లలో లోక్‌సభ ఎన్నికల్లో కేవలం ఇద్దరు మాత్రమే ఓటు వేశారని నివేదిక తెలిపింది. దీంతో విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల ఓటింగ్ శాతంపై ఎన్నికల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది.

## 'ఆప్'కు షాక్... మహిళా సమ్మాన్ యోజన రిజిస్ట్రేషన్లపై ఎల్జీ కొరడా



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందస్తు పథకాల ప్రకటన, రిజిస్ట్రేషన్లతో దూసుకు వెళ్ళు ఆప్ ఆద్మీ పార్టీ కి గట్టి దెబ్బ తగిలింది. 'మహిళా సమ్మాన్ యోజన' పేరుతో రిజిస్ట్రేషన్లు చేస్తున్న వ్యక్తులపై లీగల్ చర్యలు తీసుకోవాలని లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా శనివారంనాడు ఆదేశించారు. కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీస్ కమిషనర్‌కు లెఫ్టినెంట్ గవర్నర్ ఈ తాజా ఆదేశాలు ఇచ్చారు. క్యాంపులు పెట్టి మరీ పథకాల పేరుతో రిజిస్ట్రేషన్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎల్జీ ఆ ఆదేశాల్లో స్పష్టం చేశారు. మహిళా సమ్మాన్ స్కీమ్ పేరుతో ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీ మహిళలను తప్పుదారి పట్టిస్తూ అవకతవకలకు పాల్పడుతున్నట్టు సందీప్ దీక్షిత్ లెఫ్టినెంట్ గవర్నర్‌కు గత గురువారంనాడు ఫిర్యాదు చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి, ఆప్ సుప్రీం అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో మహిళా సమ్మాజన్ యోజన నడుస్తోందని చెబుతుండటం అసలు విషయం కాదనీ, ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత మళ్లీ అధికారంలోకి రాగానే ఈ పథకం కింద ఆర్థిక సాయాన్ని రూ.2,100కు పెంచుతామని కేజ్రీవాల్ ఇటీవల ప్రకటించారని దీక్షిత్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మహిళా సమ్మాన్ యోజనను ప్రభుత్వం నోటిఫై చేయలేదని, అలాంటి స్కీమ్ ఏదీ లేదని ఢిల్లీ మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ ఇటీవల పేర్కొన్న విషయాన్ని దీక్షిత ఎల్జీ దృష్టికి తెచ్చారు. దీంతో ఆప్ 'ఫ్రాడ్'కు పాల్పడుతోందనే విషయం స్పష్టమవుతోందని, వాళ్లు ఇంటింటికి వెళ్లి మహిళల సంతకాలు కూడా తీసుకుంటున్నారని తన ఫిర్యాదులో దీక్షిత్ పేర్కొన్నారు.

## మార్చురీ వ్యవస్థ మెరుగుపడాలి...!

న్యాయ ప్రక్రియలకు సహాయపడటానికి వైద్య పరిజ్ఞానాన్ని ఉపయోగించే వైద్యశాఖను న్యాయ వైద్యశాస్త్రం అంటారు ఇందులో భాగంగా మరణానంతర పరీక్షలు, గాయాల విశ్లేషణ, మానభంగాల బాధితుల నుంచి సాక్ష్యాలు సేకరించడం, విశ్లేషించడం వంటివి చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ విభాగాన్ని సమూల ప్రక్షాళన చేసేందుకు, హైకోర్టు క్రిమినల్ అప్పీల్ నెం. 326 ఆఫ్ 2017లో వెల్లడించిన ఆదేశాలను అనుసరించి, ప్రభుత్వం ఒక నిపుణుల కమిటీని నియమించింది (జీవో: 129, 16%--10-%-2024). హైకోర్టు న్యాయమూర్తులు తమ తీర్పులో శవపరీక్షల నిర్వహణలో పాటించాల్సిన శాస్త్రబద్ధమైన ప్రమాణాలపైనా, తదనంతరం తయారు చేసే నివేదికల నిబద్ధతపైనా విస్తృత చర్చ జరిపారు.

ఆధునిక సమాజంలో ప్రజల అసహజ మరణాలకు గల కారణాలను తెలుసుకోవడం, దోషులను శిక్షించడం, నేరాలను నివారించడం ప్రభుత్వాల బాధ్యత. ఈ ప్రక్రియలో పోలీసులూ, కోర్టులతో పాటు ఫోరెన్సిక్ వైద్యుల పాత్ర చెప్పుకోదగ్గది. మన రాష్ట్రంలో బోధనాసుపత్రులతో పాటు నిర్దేశిత జిల్లా, తాలూకా ఆసుపత్రులలో శవపరీక్షలు నిర్వహిస్తారు. ప్రస్తుత పరిస్థితులలో చాలా చోట్ల ఫోరెన్సిక్ వైద్యులు అందుబాటులో ఉండడంచేత నాణ్యతా ప్రమాణాలతో శవపరీక్షలు నిర్వహించడానికి అవకాశం కలిగింది. హైకోర్టు ఆశించిన విధంగా న్యాయ వైద్యశాస్త్రంలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటించడానికి నియమ నిబంధనావళి రూపొందించడం ఈ విశేషజ్ఞుల కమిటీకి పెద్ద కష్టమైన పని కాకపోయినప్పటికీ దానిని ఆచరణలో పెట్టాలంటే మన శవాగారాలను ఆధునీకరించాల్సిన అవసరం ఉంది.

గతంతో పోల్చుకుంటే కొంత మేర మార్చురీల అభివృద్ధి జరిగింది. కానీ రాష్ట్రంలో చాల చోట్ల శవాలను భద్రపరిచే శీతల వ్యవస్థ అవసరాలకు సరిపోయేలా లేదు. కోల్డ్ స్టోరేజీలను కూడా సరిగా నిర్వహించటం లేదు. మన మార్చురీలలో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణకు, ముఖ్యంగా ద్రవ వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి. శవపరీక్షలు చేయడానికి కావల్సిన ఆధునిక పనిముట్లు చాల చోట్ల అందుబాటులో లేవు. ప్రపంచం అంతా ఎలక్ట్రిక్ రంపాలతో పుర్రెలను తొలచి మెదడును పరీక్షిస్తుంటే, మనం మాత్రం పాత పద్ధతిలో ఇంకా సుత్తి, శానం వాడుతుండడం బాధాకరం. శవపరీక్షలు చేసే వైద్యులకి అవసరమైన రక్షణ తొడుగులను, అదనపు పరీక్షలు నిర్వహించడానికి కావల్సిన సరంజామాను సమకూర్చుకోవడం అనునిత్యం ఒక యుద్ధంలా మారింది. కొన్ని అసహజ మరణాలని పరిశోధించడానికి బాడీ శాంపిల్స్‌ని దూరంగా ఉన్న ప్రయోగశాలలకు పంపాలి. అప్పటి దాకా ఆ నమూనాలని కాపాడేందుకు డీప్ ఫ్రీజర్లు, ప్రత్యేక సంరక్షణ ద్రవ్యాలు అవసరం అవుతాయి. ఈ మౌలిక సదుపాయాల కల్పన పని నాణ్యతను ఎంతో పెంచుతుంది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాలలు విషపదార్థాల వల్ల మరణించినవారి శవపరీక్షలలో సరైన ఫలితాలను అందించలేకపోతున్నాయి. అలాగే అనేక విషాలను గుర్తించడంలో అసమర్థంగా ఉన్నాయి. కాలం చెల్లిన విశ్లేషణాత్మక విషశాస్త్ర పద్ధతులు ఉపయోగించడమే దీనికి ముఖ్య కారణం. ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాలల మధ్య, న్యాయ వైద్య విభాగం మధ్య సరిగ్గా సమన్వయం లేకపోవడం వల్ల కొన్ని కేసులలో న్యాయ విచారణ విఫలం అవుతున్నది. ఇంక శవపరీక్ష నివేదికల ప్రమాణాల విషయానికి వస్తే కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సాఫ్ట్‌వేర్ మన రాష్ట్రంలో కూడా వినియోగిస్తే చాల ఉపయోగకరంగా ఉంటుంది.

అవినీతిని నిరోధిస్తూ కొంత పారదర్శకతను సుస్థిరం చేసే అవకాశం ఉంది. హైకోర్ట్ చెప్పిన విధంగా మరణానికి కారణమైన ముఖ్య గాయాలను ఫొటోగ్రాఫ్ లేదా వీడియోగ్రాఫ్ చేసి ఇంటర్‌నెట్‌లో భద్రపరచడం సంవత్సరాల పాటు జరిగే న్యాయ ప్రక్రియను బలోపేతం చేస్తుంది. ప్రపంచ స్థాయి ప్రమాణాలను ఆంధ్రప్రదేశ్ న్యాయ వైద్య వ్యవస్థలో తీసుకురావాలన్న న్యాయమూర్తుల ఉన్నత ఆలోచనకు జోహార్లు. అయితే, ఆ మొత్తం ప్రక్రియ జరగడానికి మన మార్చురీలలో, న్యాయ వైద్య ప్రయోగశాలల్లో, పోలీస్ వ్యవస్థలో, అలాగే వృత్తి పట్ల మన అంకిత భావంలో పెను మార్పులు అవసరం.

# మానవాళి పట్ల ప్రాణాంతకంగా మారుతున్న ప్లాస్టిక్



సాంకేతికత అభివృద్ధి చెందుతున్నకొద్దీ అనేక ఆవిష్కరణలు వెలుగుచూస్తున్నాయి. ఇవి రెండు వైపులా పదునున్న కత్తి వలె మానవాళికి ప్రయోజనం చేకూరుస్తూనే ప్రమాదకారిగానూ పరిణమిస్తున్నాయి. 20వ శతాబ్దంలో ఆవిష్కరించిన ప్లాస్టిక్ కూడా ఆ కోవలోనిదే. నిత్య జీవితంలో భాగమైపోయిన ప్లాస్టిక్ రోజురోజుకు మానవాళి పట్ల ప్రాణాంతకంగా మారుతున్నది.

మానవుడి దైనందిన జీవితంలో ప్లాస్టిక్ భాగమైపోయింది. సాంకేతికత సాయంతో మనకు మరింతగా చేరువైన నానో ప్లాస్టిక్, మైక్రోప్లాస్టిక్ మన ప్రాణాలను హరిస్తున్నాయి. కంటికి కనిపించని పరిమాణంలో ఉండే ఇవి నీరు, ఆహారంలో కలిసిపోయి అక్కడి నుంచి మన శరీరంలోకి చేరుతున్నాయి. తాజాగా వెలుగుచూసిన ఓ పరిశోధనలో మన రక్తంలోనూ నానో ప్లాస్టిక్ ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. మెదడులోకి చొచ్చుకుపోయి నాడీ వ్యవస్థను ప్లాస్టిక్ దెబ్బతీస్తున్నట్టు అందులో తేలింది. అతి సూక్ష్మ రూపంలో ఉండే ఇవి రక్షణ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయి. మెదడులోకి చొచ్చుకుపోయిన నానో ప్లాస్టిక్ పార్కిన్సన్ వ్యాధికి కారకమవుతుండటం ఆందోళన కలిగించే విషయం. వాతావరణంలో ఉండే నానో ప్లాస్టిక్ పదార్థాలు ఆల్ఫా సినుక్లిన్ అనే ప్రొటీన్‌తో సంకర్షణ జరుపుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. నాడీ కణాల మధ్య కమ్యూనికేషన్‌కు ఉపయోగపడే ఇవి క్రమంగా పార్కిన్సన్ వ్యాధిగా రూపాంతరం చెందేలా దోహదం చేస్తున్నాయి. పార్కిన్సన్ అనేది ప్రపంచవ్యాప్తంగా అతివేగంగా విస్తరిస్తున్న నాడీ సంబంధిత రుగ్మత. కదలికలను నియంత్రించే నాడీ కణాలను ఈ వ్యాధి నాశనం చేస్తుంది. దీనివల్ల క్రమంగా నాడీ వ్యవస్థ పని చేయడం మానేస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం 2019లో ప్రపంచవ్యాప్తంగా 85 లక్షల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నట్టు తేలింది. అయితే 25 ఏండ్లలో పార్కిన్సన్ బాధితుల సంఖ్య రెట్టింపు కావడం ఆందోళన కలిగించే విషయం. 2019 నాటికి పార్కిన్సన్ కారణంగా సుమారు 58 లక్షల మంది వైకల్యం బారినపడ్డారు. 2000తో పోలిస్తే ఇది 81 శాతం అధికం కావడం గమనార్హం. అదే సమయంలో మరణాలు కూడా భారీగా పెరిగాయి. 2019 నాటికి ఈ వ్యాధితో 3,29,000 మంది మృతిచెందారు. 2000తో పోలిస్తే 100 శాతం అధిక మరణాలు నమోదయ్యాయి. మన దేశంలోనూ పార్కిన్సన్‌తో బాధపడుతున్నవారు లక్షల మంది ఉన్నారు. అయితే ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే చైనాలో ఈ వ్యాధి బాధితులు ఎక్కువ మంది ఉన్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు చెప్తున్నాయి. పార్కిన్సన్ వ్యాధి వేగంగా విస్తరిస్తున్నా.. ఆయా దేశాలు దీనిపై అంతగా దృష్టి సారించడం లేదు. అందుకే క్రమంగా ఈ వ్యాధి ప్రాణాంతకంగా మారుతున్నట్టు గణాంకాలు చెప్తున్నాయి. సరైన వైద్య సదుపాయాలు లేకపోవడం, చికిత్స అందకపోవడం తదితర కారణాల వల్ల అనేకమంది మృత్యువాతపడుతున్నారు. ముందుగానే వ్యాధిని గుర్తించకపోవడం, సరైన సమయంలో చికిత్స అందకపోవడం మరణాలకు కారణం. తక్కువ ఆదాయం కలిగిన దేశాల్లో న్యూరాలజిస్టులు చాలా తక్కువ సంఖ్యలో ఉండటం ఆందోళనకరం. ఈ దేశాల్లో ప్రతి లక్ష మంది జనాభాకు 0.03 మంది న్యూరాలజిస్టులు మాత్రమే అందుబాటులో ఉన్నారు. అధిక ఆదాయం కలిగిన దేశాల్లో ప్రతి లక్ష మందికి 4.75 మంది న్యూరాలజిస్టులు ఉన్నారు. యావత్ ప్రపంచంలో సమస్త మానవాళి అనారోగ్యం బారిన పడుతున్నా.. ప్లాస్టిక్ వాడకం తగ్గడం లేదు. ఏటా దీని వినియోగం పెరుగుతూనే ఉన్నది. హానికరమైన ఈ ప్లాస్టిక్‌ను ప్రభుత్వాలు నిషేధిస్తున్నట్టు ప్రకటనలు చేస్తూ చేతులు దులుపుకొంటున్నాయి. సరైన రీతిలో చర్యలు చేపట్టకపోవడంతో ప్లాస్టిక్ పెనుభూతంగా మారుతున్నది. 2021 లెక్కల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 400 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తి అయ్యింది. ఈ మొత్తం కొంతకాలానికి ప్లాస్టిక్ వ్యర్థాలుగా మారి వాతావరణంలో కలిసిపోయి మానవాళికి ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు దీనిపై దృష్టి సారించి ప్లాస్టిక్ వాడకాన్ని గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉన్నది.

# ప్రజాస్వామ్య భారతానికి అండ మన రాజ్యాంగం



"రాజ్యాంగం కేవలం న్యాయవాదుల పత్రం మాత్రమే కాదు, ఇది జీవన వాహనం. దాని ఆత్మ నిత్యం యుగస్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది" అన్న అంబేడ్కర్ మాటలు చెరగని సత్యాలు. మన రాజ్యాంగ నిర్మాతలు వ్యక్తి ఆధారిత వికాసాన్ని ఆశిస్తూ దేశానికి ఆచరణీయ పాలనా నమూనాను రూపొందించారు. గత ఏడున్నర దశాబ్దాలుగా దేశానికి దిక్సూచిగా పనిచేస్తున్న రాజ్యాంగ అమలును పరిశీలిస్తే దీని నిర్మాతల దార్శనికత దేశ ప్రజలకు తెలుస్తుంది.

12 భాగాలు, 395 అధికరణలు, దేశకాలానుగుణంగా కొత్త విషయాల్ని జోడించిన 106 సవరణలతో కూడిన రాజ్యాంగం సుమారు ఏడున్నర దశాబ్దాలుగా భారతదేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లేందుకు ప్రధాన భూమికను వహిస్తోంది. స్వాతంత్ర్యోద్యమ ఫలితంగా సాధించిన స్వయం పాలనలోంచి, స్వేచ్ఛావాయువుల్లోంచి ప్రజలే మన రాజ్యాంగాన్ని రాసుకున్నారు. 1950 జనవరి 26న అమల్లోకి వచ్చిన మన రాజ్యాంగం పురాతన భారతీయ సంప్రదాయాల మీద నిర్మితమైనది. నాలుగు వేల సంవత్సరాల చరిత్రలో ఈ దేశ ప్రజల అనుభవాలు రాజ్యాంగంలో నిక్షేపితమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ఆధునిక రాజ్యాంగాలు చాలా విఫలమయ్యాయి. కాని భారత రాజ్యాంగం అలా కాకుండా నిలిచి వెలుగుతున్నది. ప్రతి భారతీయ పౌరుడూ కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా స్వేచ్ఛగా తన భావాలను, అభిప్రాయాలను వెల్లడించగలుగుతున్నారంటే అది భారత రాజ్యాంగం సాధించిన గొప్ప విజయమనే చెప్పాలి. అధికరణ 19(1)ఎ భారతీయ పౌరుల్ని ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వెర్సస్ రాజ్ నారాయణ్‌కి సంబంధించిన కేసులో ప్రతి భారతీయ పౌరుడూ సమాచారాన్ని స్వీకరించడంతో పాటు వ్యాప్తి చేసే హక్కును కలిగివున్నాడని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. భిన్నత్వంలో ఏకత్వం, లౌకికవాదం, మత సహనం, అందరికీ సమాన అవకాశాలు, అట్టడుగు వర్గాల కోసం ప్రత్యేక చట్టాలు, సంక్షేమ కార్యక్రమాలు భారత రాజ్యాంగం ప్రసాదించింది. రాజ్యాంగ రచనలో కార్యదక్షత వహించిన డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సంపూర్ణ ప్రజాస్వామ్యాన్ని ఆకాంక్షించారు. సమ ప్రజాస్వామ్య పద్ధతుల్ని రాజ్యాంగ పరిషత్తు తీసుకొచ్చింది. వ్యత్యాసం లేని ప్రజాస్వామ్యాన్ని తీర్మానించింది. పరిపూర్ణ ప్రజాస్వామ్యానికి రాజ్యంగ రచయితలు పునాదులు వేశారు.


ప్రజల ఆర్థిక, సాంఘిక జీవితంలో విప్లవాత్మక మార్పులను రక్తపాతం లేకుండా తీసుకొచ్చే ప్రక్రియే ప్రజాస్వామ్యం అని ఈ సందర్భంలోనే డాక్టర్ అంబేడ్కర్ పేర్కొన్నారు. ఇటువంటి రాజకీయ ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే సాంఘిక, ఆర్థిక ప్రజాస్వామ్యాలు రక్తమాంసాల పాత్ర పోషిస్తాయని వివరించారు. కులం ద్వారా వచ్చిన వెనుకబాటుతనంతో ఉత్పత్తి కులాలు అణచివేతకు గురయ్యాయని, వీటిని అధిగమించాలంటే ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థే దివ్యఔషధమనీ ఆయన అన్నారు. ఎటువంటి వాదప్రతివాదాలూ లేకుండానే పరిషత్ దీనిని ఆమోదించింది. ఈ నేపథ్యంలోనే వివిధ వర్గాల ప్రజల మధ్య ఐక్యతను సాధించేందుకు వివిధ సంక్షేమ విధానాలు రూపొందాయి. సహృదయ భావజాలాన్ని పెంపొందించే నిర్ణయాలు కూడా జరిగాయి. రాజ్యాంగ రచనాసంఘం అధ్యక్షునిగా డాక్టర్ అంబేడ్కర్ రాజ్యాంగ పరిషత్ సమావేశంలో ప్రజాస్వామ్య మూలాలు భారతీయుల వారసత్వ సంపద అన్నారు. జె.ఎస్.మిల్, హెరాల్డ్ లాస్కీ, మెకావర్ చెప్పిన పాశ్చాత్య ప్రజాస్వామ్యం భారతదేశానికి సరిపడదని అంబేడ్కర్ పేర్కొన్నారు. భారతదేశ సామాజిక చట్రం అందుకు భిన్నంగా ఉందన్నారు.

వివిధ కులాలుగా, మతాలుగా, వర్గాలుగా, ప్రాంతాలుగా, భాషలుగా, సంస్కృతులుగా విభజన చెందిన ఈ సమాజం, 'ఏకతా' భావనకు చేరుకోవడానికి అవసరమైన మానసిక పరివర్తనను పెంపొందించే రాజకీయవ్యవస్థ అవసరాన్ని రాజ్యాంగ పరిషత్ తెరమీదికి తీసుకొచ్చింది. ప్రజల మనోభావాలకు అనుగుణంగా మార్పులు, చేర్పులకు అవకాశం వుండాలని సభ్యులు కోరుకున్నారు. ఇది సమాజ ఆశయాలను, ఆకాంక్షలను ప్రతిబింబించేదిగా ఉండాలి. రాజ్యాంగం అందించిన ప్రాథమిక హక్కులు నిర్లక్ష్యానికి గురికాకూడదు. దీనిని విస్మరించి పాలకులు స్వప్రయోజనాల కోసమే పనిచేస్తే, బలహీనవర్గాల అభివృద్ధి, సంక్షేమం కుంటుబడుతుంది. ఇక్కడే ప్రజాస్వామ్యానికి ముప్పువాటిల్లే పరిస్థితులు ఏర్పడతాయి. అందుకే రచనాసంఘం ప్రజాస్వామ్యమంటే కేవలం ప్రభుత్వ ఏర్పాటు ఒకటే కాదని వివరణ ఇచ్చింది. ప్రజాస్వామ్యం పట్ల ప్రజలకు సంపూర్ణ అవగాహన కలిగినప్పుడే ఓటుహక్కు విలువ తెలుస్తుందని రాజ్యాంగ పరిషత్తు భావించింది. రాజకీయపార్టీల లక్ష్యాలు, వారి కార్యాచరణను ప్రజలు అంచనా వేయగలగాలనేది వారి ఉద్దేశం. అప్పుడే పారదర్శకంగా ఓటుహక్కు వినియోగించుకోగలుగుతారన్నారు. రాజ్యం %-% కులం %-% మతవ్యవస్థల ఉనికి, స్వరూపస్వభావాలు మనిషిని ఏ రకంగా ప్రభావితం చేస్తున్నాయో తెలుసుకున్నప్పుడే సంపూర్ణ ప్రజాస్వామ్యం మనగలుగుతుందని రచనా సంఘం పేర్కొంది. అందుకే "ఒకవ్యక్తి %-% ఒకే ఓటు, ఒక ఓటు %-% ఒకే విలువ" అనే సూత్రానికి అవిశ్రాంతంగా కృషి జరిగింది. ఇది ఆచరణలోకి వచ్చే వరకు డాక్టర్ అంబేడ్కర్ చాలా కృషి చేశారు. రచనా సంఘం మూడు రకాల ప్రజాస్వామ్యం గురించి చర్చించింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వ సిద్ధాంత ప్రాతిపదికగా కలిగిన జీవనవిధానం సామాజిక ప్రజాస్వామ్యం. ప్రజల మధ్య ధనిక, పేద వ్యత్యాసాలు తగ్గిపోయి సామాజిక సహజీవనానికి బాటలు వేసేది ఆర్థిక ప్రజాస్వామ్యం. పెట్టుబడిదారీ ఆర్థిక విధానం కొన్ని సందర్భాల్లో ప్రజాస్వామ్య లక్ష్యాలకు అడ్డంకిగా నిలుస్తుందన్నారు. ఈ విధానంలో వ్యక్తి స్వేచ్ఛ, ఇతర హక్కులకు సైతం రక్షణ కొరవడుతుంది. అందుకే శ్రేయోరాజ్యాన్ని ప్రతిపాదించారు. రాజ్యాంగంలో సంక్షేమ రాజ్యస్థాపనకు తగిన ఆదేశిక సూత్రాలను పొందుపరిచారు. రాజ్యాంగం ద్వారా బలహీనవర్గాలు జీవనోపాధి పొందే విధంగా వీటిని రూపొందించారు. సామాజిక వనరుల మీద యాజమాన్య నియంత్రణ ప్రజలకే వుండాలని పరిషత్ ఆకాంక్షించింది. సంపద, ఉత్పత్తికారకాలు ఏ కొద్దిమంది చేతుల్లోనో కేంద్రీకృతం కాకూడదని, బలహీనవర్గాల విద్య, ఉపాధి ఆర్థిక విషయాలను రాజ్యమే పరిరక్షించాలని ఆశించారు. ఆదేశిక సూత్రాల అమలు ద్వారా ఆదర్శ ప్రజాస్వామ్యాన్ని నిర్మించవచ్చని, ఇటువంటి కార్యాచరణ సాధ్యం కావాలంటే ప్రభుత్వమే ఈ బాధ్యత వహించాలనేది రచనా సంఘం తరుపున అంబేడ్కర్ సూచించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పనితీరు బాగుంటేనే అది వర్ధిల్లుతుంది. దీనికి ప్రధానంగా రెండు విషయాలు మూలస్తంభాలుగా నిలవాలి. ఒకటి సమర్థవంతమైన పాత్రపోషించగల ప్రతిపక్షం, రెండు స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును వినియోగించుకోగల పరిస్థితులు. ఇవి ఉన్నప్పుడే అణగారిన ప్రజానీకం విముక్తి సుసాధ్యమవుతుంది.

ప్రజాస్వామ్యం అంతరించిపోతే ప్రజల ఆకాంక్షలు నీరుగారిపోతాయన్నది రచనా సంఘం హెచ్చరిక. రాజకీయ పార్టీల బాధ్యతాయుతమైన పాలనతోనే రాజ్యాంగం మనగలుగుతుంది. ఈ సందర్భంలోనే దేశీయ రాజనీతి సిద్ధాంతకర్తలు నాడు రాజ్యాంగాన్ని కొనియాడారు. సమైక్య జీవన వేదంగా ఈ ముసాయిదా సాక్షాత్కరిస్తుందన్నారు. అంఖండ భారతాన్ని నిర్మించి పటిష్టపరిచిన రాజ్యాంగం ఆమోదం పొందిన రోజుని ఉత్సవంగా జరుపుకుందాం.

## రామాయణంలో స్త్రీ పాత్రల ఔచిత్యం

భక్తి



రామాయణ, భారత, భాగవతాలు భారతీయులకు పవిత్ర గ్రంథాలు. భారత సాహిత్యానికే అవి పట్టుకొమ్మలు. భారతీయ జీవన విధానానికి దర్పణాలు. మానవ జీవన విధాన రూపకల్పనకు చక్కగా ఉపకరించే సమున్నత సాధనాలు. ఆదర్శ మానవ జీవితానికి దారిచూపే కరదీపిక రామాయణం. మూడు కుటుంబ జీవితాలను మన ముందుంచి, ఏది ఉత్తమ జీవితమో చెప్తూ, కుటుంబ బాంధవ్యాలను ఉదాహరణగా నిర్వచించి, ఎవరితో ఎలా మసలుకోవాలో సున్నితంగా సూచించే కావ్యం ఇది. అందుకే రామాయణానికి వైశిష్ట్యం కల్పించి, ఆరాధించారు. వాల్మీకి రామాయణాన్ని ఆధారంగా చేసుకొని, ప్రాంతీయ భాషల్లో పలు రామాయణాలు వెలువడ్డాయి. తెలుగులో తొలి రామాయణం 'భాస్కర రామాయణం'. ద్విపదగా, చంపూ పద్ధతిలో రూపొందిన మొదటి రామాయణం. అది జానపద ప్రభావం లేక ఇంచుమించు మూల రామాయణ కథ ఆధారంగానే సాగింది. రామాయణాన్ని సాహిత్య చరిత్రలో కుటుంబ, సామాజిక ఆదర్శాల ద్వారా జీవితంలో విస్తృతమైన దృక్పథాన్ని ప్రవేశపెట్టిన మొదటి రచనలలో ఒకటిగా చెప్పవచ్చు. స్త్రీ పాత్రల గురించిన నిర్దిష్టమైన అధ్యయనంతో గుర్తించబడిన విలువలు లేదా ఆదర్శాలు ఏవీ చెప్పకుండా వదలలేదని చెప్పవచ్చు. మానవ ఆలోచనల భావోద్వేగం, ఉనికి సంపూర్ణతను ప్రదర్శిస్తుంది. భారతదేశమే కాకుండా ప్రపంచంపై దాని ప్రభావాన్ని విస్తృతం చేస్తుంది. రామాయణమంతా సీత పాత్ర విస్తరిస్తుంది. 'సీతాయః చరిత మహత్' అనే వ్యక్తీకరణ దీనికి నిదర్శనం. కథాంశం మార్చడానికి (మంథర)బీ కథాంశ మలుపు (కౌసల్య, సుమిత్ర, కైకేయి)బీ అనుబంధించడం (శబరి, అహల్య)బీ ఏకపక్ష పాత్ర (ఊర్మిళ)బీ ఇలా మనకు ఎన్నో స్త్రీ పాత్రలు నిజ జీవితపు సారూప్యతను కనిపింపజేస్తాయి. స్త్రీ పాత్రల ఔచిత్యం: భాస్కర రామాయణంలో మొదట అహల్య వృత్తాంతంలో ప్రత్యేకత కనిపిస్తుంది. ఇంద్రుడు అహల్యను మోసగించి గౌతముడు లేని సమయాన కోరి వస్తాడు. తన కూతతో పొద్దు పొడిచిన సంకేతం ఇచ్చాడు. గౌతముడు అనుష్టానాలు నిర్వర్తించుకోవడానికి వెళ్తాడు. ఆ సమయం చూసుకొని ఇంద్రుడు ఆశ్రమంలో ప్రవేశిస్తాడు. దివ్య దృష్టి కలిగిన గౌతముడు అన్ని తెలుసుకోవచ్చు కానీ, 'బుద్ధారెడ్డి' సామాన్య మానవుడి కల్పనలు కోడికూతతో తెల్లవారిందని భ్రమపడే విధంగా చిత్రించాడు. తిరిగివచ్చిన గౌతముడు అహల్యను శపిస్తాడు. రంగనాథ రామాయణంలో 'పడతి పాషాణమై పడి యుండు నీవు' అని శపించినట్లు ఉన్నది. మంథర': ఈ పాత్రను బుద్ధారెడ్డి రాముడు చిన్నప్పుడు తన కాలు విరిచినందుకు ప్రతీకారం తీర్చుకునే స్వభావం కలదిగా చిత్రిస్తాడు. యజ్ఞదత్తుడు మరణించినప్పుడు అతని తండ్రితో పాటు తల్లికూడా ఎంతగానో విలపించిందని చెప్పడంలో ఆ పాత్రలో మాతృహృదయాన్ని వ్యక్తపరిచాడు. ఊర్మిళ: రంగనాథ రామాయణంలో ఊర్మిళాదేవి నిద్ర ఘట్టాన్ని వివరిస్తాడు. అరణ్యవాసానికి వెళ్లిన తన భర్త (రాముని వెంట లక్ష్మణుడు) వెళ్లినప్పుడు, లక్ష్మణ కర్తవ్య నిర్వహణ కోసం నిద్రాదేవి తనను ఆవహించడం, లక్ష్మణుడు తిరిగి రాగానే, నిద్రాదేవి వెళ్లిపోవడం దీనిలో చెప్పబడింది. సీత: సీతాదేవిని హిందూ మతంలోనే విశ్వాసాల ప్రతీకగా చూపబడింది. విష్ణువు అవతారమైన శ్రీరాముని ధర్మపత్ని హిందూ సమాజంలో స్త్రీ ప్రవర్తనకు, ఆలోచనకు సీతా చరిత్ర మార్గదర్శకంగా నిలిచిపోయింది. సకల గుణాలు కలిగిన సాధ్విగా, భారతీయులకు నిత్యం ఆరాధించే సుగుణాల రాశిగా పేరొందింది. రామాయణ కథంతా సీతే ప్రధాన పాత్ర వహించింది.



## చిక్కిపోయేవారికి చక్కని కొబ్బరి పాయసం

"నారికేళం తనూకృత్య ఛిన్నం పయసిః గో క్షిపేత్ సితాగవ్యాజ్య సంయుక్తం తత్సచేన్మృదువహ్నినా"అంటాడు 'భోజనకుతుహలం' రచయిత రఘనాథ సూరి. ఈ శ్లోకం ప్రకారం- కొబ్బరి పాలతో పాయసం వాతపైత్యాల్ని తగ్గిస్తుంది. ఈ పాయసాన్ని ఎలా తయారు చేయాలో కూడా ఈ శ్లోకం చెబుతుంది. ఈ శ్లోకంలో తనూకృత్యం అంటే కొబ్బరిని సన్నగా తరగటం. ఒకవేళ సన్నగా తురిమే సాధనం లేకపోతే దానిని ఛిన్నం కూడా చేయవచ్చని శాస్త్రకారుడు చెబుతాడు. ఇలా సన్నగా తరిగిన కొబ్బరిని చిక్కని ఆవుపాలలో కలిపి ఉడికించాలి. అలా ఉడికిన మిశ్రమంలో నెయ్యి వేసి దగ్గరపడేలా ఉడికించాలి. అలా ఉడికించిన తర్వాత దానిలో చిటికెడంత పచ్చకర్పూరం కలిపితే మంచి పరిమళంతో పాటుగా పవిత్ర భావం కూడా వస్తుందని రఘనాథ సూరి చెబుతాడు. ఇలా తయారు చేసిన కొబ్బరి పాయసం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయి. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.కొబ్బరితో చేసిన పాయసం ఎక్కువ పుష్టిదాయకం. శరీరానికి పోషణ ఇస్తుంది. ఎదిగే పిల్లలకు మేలు చేస్తుంది. తక్కువగా తిన్నా ఎక్కువగా ఆకలి తీరుతుంది.మంచి నిద్ర పట్టడానికి ఇదొక సాధనం. రక్తస్రావాలు అరికడుతుంది. వాత వ్యాధులు ఉన్నవారు దీనిని జాగ్రత్తగా ఆలోచించి సేవించాలి. దగ్గు, జలుబు, ఆయాసం మొదలైన వ్యాధులతో బాధపడేవారికి ఇది చెడు ఎక్కువ చేస్తుంది.ఇది చర్మ సమస్యలకు మంచి మందులా పనిచేస్తుంది. చర్మానికి మంచి మెరుపునిస్తుంది.అలసటను తగ్గిస్తుంది. వికారాన్ని, ఎక్కిళ్లను, ఇతర గ్యాసు సమస్యలను తొలగిస్తుంది.సాధారణంగా ఎక్కువ మంది ముదురు కొబ్బరిని ఉపయోగిస్తారు. ముదురు కొబ్బరి కన్నా లేత కొబ్బరి ఎక్కువ ప్రయోజనకారి.

అనేక రకాల శారీరక సమస్యలకు ఇది విరుగుడుగా పనిచేస్తుంది.




నవభూమి

www.navabhoomi.in

www.epaper.navabhoomi.in

5 | హైదరాబాద్ | సోమవారం | 30 | డిసెంబర్ | 2024


# చిన్న ప్రయత్నం... పెద్ద మార్పు



ఒక సర్పంచ్‌గా ఆమె చేసిన చిన్న ప్రయత్నం ఆ గ్రామ మహిళల ఆలోచనా విధానాన్నే మార్చేసింది. గృహిణి పేరుతో ఇంటి ముందు తగిలించిన నేమ్ ప్లేట్... వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది. మగవారికి మగువ ఎందులోనూ తీసిపోదని చెబుతూ... వారిని సాధికారత దిశగా అడుగులు వేయిస్తున్నారు శేషన్‌దీప కౌర్ సిద్ధూ. ప్రస్తుతం పదవిలో లేకపోయినా... తన ప్రాంత మహిళలకు మార్గదర్శి అయ్యారు ఈ మాజీ సర్పంచ్.

"తెల్లారి లేచింది మొదలు రాత్రి పడుకొనే వరకూ ఇంట్లో ఆడవారికి క్షణం తీరిక దొరకదు. కానీ వారి కష్టం ఎవరికీ పట్టదు. వారి ఆవేదన అరణ్యరోదన. కనీస గుర్తింపునకు నోచుకోని జీవితాలు గృహిణులవి. కాలంతో పోటీపడి పరుగెడుతున్నా... ప్రపంచం మన అరచేతులోకి వచ్చేసినా... మా గ్రామంలో ఇంకా అసమానతలే. ఇది నన్ను కలచివేసింది. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే ఎవరో ఒకరు తొలి అడుగు వేయాలి. నేను చేసింది అదే. సర్పంచ్‌గా నాకు వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకొని... గ్రామీణ మహిళల్లో చైతన్యం నింపే ప్రయత్నం చేశాను. పంజాబ్ బతిండా జిల్లా మానక్‌ఖానా గ్రామం మాది. చిన్నప్పటి నుంచి నేను చదువులో ముందుండేదాన్ని. సివిల్స్ సాధించాలన్నది ఆశయం. దాని కోసం ఢిల్లీలో చదువుకొంటూ సన్నద్ధమయ్యాను.

**గ్రామానికి తిరిగివచ్చి...**

సివిల్స్ కోసం కఠోరంగా శ్రమించాను. 2018లో తొలిసారి పరీక్ష రాశాను. కానీ విఫలమయ్యాను. అది నన్ను బాగా కుంగదీసింది. అంత కష్టపడినా ర్యాంకు సాధించలేకపోవడంతో తిరిగి మా గ్రామానికి వచ్చేశాను. ఈసారి ఇంటి దగ్గరే ఉండి చదువుకొందామని నిర్ణయించుకున్నాను. కానీ మనం ఒకటి తలిస్తే దైవం మరోలా తలుస్తుందంటారు. నా విషయంలోనూ అదే జరిగింది. మా ఊళ్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకొని... నన్ను సర్పంచ్‌గా ఉండమని అడిగారు. పురుషాధిక్యం ఉన్న మా ప్రాంతంలో ఒక మహిళకు ఇలాంటి అవకాశం రావడం అరుదైన పరిణామం. గతంలో మా గ్రామంలో ఏ మహిళ కూడా ఈ పదవిని అలంకరించలేదు. దాంతో అడగంగానే సరేనన్నాను.

**మార్పు వైపు తొలి అడుగు...**

సర్పంచ్ అయ్యాను. బానే ఉంది. కానీ అసలు సర్పంచ్‌గా నా విధులు, అధికారాలు ఏమిటన్న దానిపై స్పష్టత లేదు. ఎక్కడ మొదలు పెట్టాలి? ఎలా మొదలుపెట్టాలి? అంతా అయోమయం. కానీ మార్పు తేవడానికి నాకు లభించిన అద్భుత అవకాశం ఇది. దీన్ని వదులుకోకూడదని నిశ్చయించుకున్నాను. ఢిల్లీలో ఉండగా మహిళా సాధికారతకు సంబంధించి నేను కొన్ని స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేశాను. ఆ అనుభవం నాకు ఇక్కడ పనికివచ్చింది. ఒకరిపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదిగేందుకు కావల్సిన అంశాలపై దృష్టి పెట్టాను. అంతేకాదు, ఎప్పుడూ గుమ్మం దాటని ఆడవారి జీవితాల్లో వెలుగులు నింపి, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే ధ్యేయంగా పని చేయాలని అనుకున్నా. అందులో భాగంగా తొలుత తమ ఆశయాల సాధన దిశగా మహిళలను ప్రోత్సహించాను.

**గ్రంథాలయంతో మొదలు...**

ఆరంభంలో అందరూ నన్ను అవహేళన చేశారు. నీవల్ల ఏమవుతుందంటూ ప్రశ్నించారు. ఎవరు ఏమన్నా, ఎంత నిరుత్సాహపరిచినా... నా సామర్థ్యం ఏమిటో నాకు తెలుసు. సర్పంచ్‌గా నా తొలి ముద్ర గ్రంథాలయ నిర్మాణం. అధ్వాన్నంగా ఉన్న రోడ్ల పనుల వంటివి పక్కన పెట్టి ఎవరికీ ఉపయోగంలేని గ్రంథాలయం ఏంటని చాలామంది ప్రశ్నించారు. నాకు పిచ్చి పట్టిందని కొందరు వ్యాఖ్యానించారు. అది ఒక భవనం మాత్రమే కాదు... గ్రామంలోని భవిష్యత్ తరాల ఆశలు, ఆశయాలకు ఒక చిహ్నమని చెప్పాను. పిల్లల ఎదుగుదలలో గ్రంథాలయాల పాత్ర ప్రముఖమైనదని వివరించాను. అందులో అన్ని వయసులవారికీ ఉపయోగపడేలా పంజాబీ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో విలువైన పుస్తకాలు పెట్టాము. భద్రత కోసం సీసీటీవీ కెమెరాలు అమర్చాం. క్రమంగా గ్రామస్తులందరూ గ్రంథాలయానికి వెళ్లడం అలవాటుగా మార్చుకున్నారు.


**కన్నీళ్లు పెట్టుకున్నారు...**

గ్రామ అభివృద్ధితో పాటు మహిళల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాను. ఆ క్రమంలోనే ఇంటి ముందు నేమ్ ప్లేట్లు నన్ను ఆకర్షించాయి. అవి చూసినప్పుడు అనిపించింది... 'వాటిపై మగవారి పేరు మాత్రమే ఎందుకు రాయాలి' అని! గృహిణుల పేరుతో నేమ్ ప్లేట్లు రాయించాను. ప్రతి ఇంటి ముందూ వాటిని తగిలించాము. అవి చూసుకొని మహిళలు భావోద్వేగానికి లోనయ్యారు. 'మా ఆత్మగౌరవాన్ని నిలబెట్టావంటూ' కృతజ్ఞతలు చెప్పారు. ఒక యువతి నా దగ్గరకు వచ్చి... 'ఇప్పటివరకు నన్ను బయటకు అడుగుపెట్టనివ్వలేదు. నా నిర్ణయాలు నేను తీసుకొనే స్వేచ్ఛ లేదు. కానీ ఇవాళ ఇంటి ముందు నా పేరు చూసినప్పుడు ఎంతో గర్వంగా అనిపించింది' అంటూ కన్నీళ్లు పెట్టుకుంది. ఇలా ఒక మహిళ పేరుతో డోర్ ప్లేటు కనిపించడం మా ఊళ్లో ఇదే మొదలు. ఈ ఏడాది సర్పంచ్‌గా నా పదవీకాలం అయిపోయింది. కానీ మహిళను సాధికారత వైపు నడిపించేందుకు, వారి జీవితాల్లో మార్పు తెచ్చేందుకు నా పయనం సాగుతూనే ఉంటుంది."

**మహిళలకు ప్రత్యేకం...**

మార్పు వైపు నేను వేసిన మలి అడుగు... మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక పార్కు ఏర్పాటు. నిత్యం ఇంటి పనుల్లో తలమునకలయ్యే ఆడవారికి తమకంటూ కాస్త సమయం కూడా దొరకదు. సరదాగా కాసేపు సేద దీరేందుకు అవకాశం ఉండదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని, తీరిక సమయంలో కాస్తంత ఆహ్లాదంగా గడిపేలా ఈ పార్కును తీర్చిదిద్దాము. ఇది స్థానిక మహిళల్లో గణనీయమైన మార్పునకు కారణమైంది. ఒక్కొక్కరుగా ఇంటి నుంచి బయటకు వచ్చి, స్వేచ్ఛగా కాసేపు పార్కులో గడుపుతున్నారు. స్నేహితులతో మనసు విప్పి మాట్లాడుకో గలుగుతున్నారు. అంతకముందు ఇక్కడ మహిళల కోసం ఎలాంటి ప్రత్యేక సదుపాయాలూ లేవు.

# తియ్యని ఖర్జూర తినేద్దామా!



ఖర్జూర అద్భుతమైన పోషకాహారం. శరీరంలో పిత్తం ఎక్కువగా ఉన్నవారు ఖర్జూర పండును, వాత శరీరం ఉన్నవారు ఎండు ఖర్జూరాన్ని తినడం మంచిది. ఎండు ఖర్జూర అనేది డ్రై ఫ్రూట్స్‌లో ఒకటైనప్పటికీ ఇందులో షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుందనే అపోహతో దీనిని తక్కువగా వినియోగిస్తుంటారు. ఖర్జూరలో అత్యధికంగా ఫైబర్‌తోపాటు ప్రొటీన్లు, విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. రోజుకు మూడు ఖర్జూరాలు తినడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. క్యాన్సర్‌ను నిరోధించడంలో, బరువు తగ్గడంలో, శరీరాన్ని ఫిట్‌గా ఉంచడంలో ఖర్జూర పాత్ర విశేషమైంది.

ఖర్జూరలోని యాంటీ ఆక్సిడెంట్లు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. రక్తంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. గుండె కొట్టుకునే వేగాన్ని, రక్తపోటును సాధారణ స్థాయిలో ఉంచుతాయి. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి.

నీటిలో నానబెట్టిన ఎండు ఖర్జూరాలు తినడం వల్ల మలబద్దకం సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇందులోని ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. తక్షణ శక్తి లభిస్తుంది.

మహిళలు ప్రతిరోజూ ఖర్జూర తింటే రుతుక్రమం సరిగా ఉంటుంది. హార్మోన్లు నియంత్రణలో ఉంటాయి. గర్భధారణ సమయంలో ఆక్సిటోసిస్ డిమాండ్‌ను తగ్గిస్తుంది. గర్భవతులకు సహజ ప్రసవం అవుతుంది. కాలేయ సమస్యలు కూడా దూరమవుతాయి.

ప్రతిరోజూ ఉదయం అల్పాహారంలో ఖర్జూరాలు ఉండేలా చూసుకుంటే శరీరానికి అవసరమైన విటమిన్లు అంది చర్మం కాంతివంతంగా మారుతుంది. శిరోజాలు ఆరోగ్యంగా పెరుగుతాయి. ఆందోళన తగ్గి జ్ఞాపకశక్తి పెరుగుతుంది. అల్జీమర్స్ లక్షణాలు తగ్గుతాయి.

ఖర్జూరలో చక్కెర కంటెంట్ ఉన్నప్పటికీ అది రక్తంలో చక్కెర స్థాయిని త్వరగా పెంచదు. వ్యాయామం చేయడానికి అరగంట ముందు రెండు నుంచి నాలుగు ఖర్జూరాలు తీసుకుంటే శరీరానికి అవసరమైన శక్తి లభిస్తుంది. వీటిలోని మెగ్నీషియం, సెలీనియం, మాంగనీస్ వంటి సూక్ష్మ పోషకాలు ఎముకల బలోపేతానికి దోహదం చేస్తాయి.

బాగా ఆకలిగా ఉన్నపుడు భోజనానికి ముందు ఖర్జూరాలు తినడం వల్ల నోటిలో ప్రత్యేకమైన ఎంజైమ్‌లు విడుదలవుతాయి. ఇవి భోజనం తరవాత పొట్టలోని ఆహారం సక్రమంగా జీర్ణం కావడానికి సహాయం చేస్తాయి.

అర్ధరాత్రి సమయంలో ఆకలి అనిపించినపుడు రెండు లేదా మూడు ఖర్జూరాలు తినడం వల్ల పొట్ట నిండిన అనుభూతి కలిగి మంచి నిద్ర పడుతుంది.

# నా కష్టం... వేరొకరికి రాకూడదని...





పదిహేనేళ్లకే పెళ్లి. పద్దెనిమిదేళ్లు నిండకుండానే ఒక బిడ్డకు తల్లి. వద్దు వద్దని మొత్తుకున్నా పుట్టింటివాళ్లు బరువు వదిలించుకున్నారు. అత్తింటివారు మాఇంటికి రావద్దని అన్నారు. అందరూ ఉండి ఒంటరి అయ్యారు 24 ఏళ్ల రోషిణీ పర్వీన్. కానీ ఆమె కుంగిపోలేదు. విపత్కర పరిస్థితులకు ఎదురొడ్డి ఆత్మవిశ్వాసంతో నిలబడ్డారు. బాల్య వివాహాలను అరికడుతూ... ఎందరో బాలికల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నారు.

"నా బాల్యం అంతా ముళ్ల బాటలోనే సాగింది. బాగా చదువుకొని... ఒకరిపై ఆధారపడకుండా నా బతుకు నేను బతుకుదామని అనుకున్నా. కానీ ఆ సంకల్పానికి మా అమ్మానాన్నలే విఘాతం కలిగించారు. బీహార్ రాష్ట్రం కిషన్‌గంజ్ జిల్లాలోని మారుమూల పల్లె సిమల్‌బారీలో ఓ సాధారణ కుటుంబం మాది. ఎనిమిదో తరగతి వరకు అంతా బాగానే సాగింది. ఎప్పుడైతే తొమ్మిదో తరగతిలోకి అడుగుపెట్టానో అప్పటి నుంచీ ఊహించని కష్టాలు వచ్చిపడ్డాయి. మా ఇంట్లోవాళ్లు పెళ్లి సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. 'ఇంకా పదో తరగతి కూడా పూర్తవ్వలేదు. అప్పుడే పెళ్లేంటి?' అని అడిగాను. నాకు ఇంకా చదువుకోవాలని ఉందని, అప్పటివరకు ఓపిక పట్టమని ప్రాథేయపడ్డాను. అమ్మానాన్న వినలేదు. రోజూ ఎవరూ ఒకరు నన్ను చూడ్డానికి వచ్చేవారు. చాలా సంబంధాలు తిప్పి పంపాను. అయినా వాళ్ల ప్రయత్నం ఆగలేదు. చివరకు నా పోరాటం వృథా అయింది. బలవంతంగా పెళ్లి చేశారు. అది కూడా నాకంటే వయసులో మూడు రెట్లు పెద్దవాడితో. అప్పుడతనికి 45 సంవత్సరాలు. అత్తింటికి వెళ్లేవరకు అతని వయసు నాకు తెలియదు. వివాహ బంధం అంటే ఏంటో కూడా అవగాహన లేదు. వేధింపులు ఎక్కువయ్యాయి. దాంతో భయం వేసి మూడు నెలలకే మా ఇంటికి వెళ్లిపోయాను.

**పుట్టింటివారూ పట్టించుకోలేదు...**

కొన్నాళ్లకు తెలిసింది... నేను గర్భవతిని అని. తరువాత బాబు పుట్టాడు. భర్త దగ్గరకు వెళ్లమని అమ్మానాన్న చెప్పారు. నేను ఆ నరకంలోకి మళ్లీ వెళ్లాలనుకోలేదు. కానీ ఇంట్లోవాళ్లు బలవంతం చేశారు. వెళితే... అత్తింటివాళ్లు నన్ను లోపలికి రానివ్వలేదు. ఏడాది దూరంగా ఉన్నానని, అందుకే నేను తనకు వద్దని నా భర్త తెగేసి చెప్పాడు. మా ఇంట్లోవాళ్లు కూడా నన్ను రానివ్వలేదు. అందరూ ఉండి ఎవరూ లేని అనాథనయ్యాను. చంకలో పసి బిడ్డతో రోడ్డున పడ్డాను. అలాగని బాధతో కూర్చోలేదు. నా కాళ్ల మీద నేను నిలబడాలని ఆ క్షణమే బలంగా నిర్ణయించుకున్నాను.

**బంధాలు తెంచుకుని...**

నన్ను వద్దనుకున్న భర్త, నాకు ఆశ్రయం ఇవ్వని తల్లిదండ్రులు, సామాజిక కట్టుబాట్లు... బంధాలన్నిటినీ తెంచుకొని ధైర్యంగా అడుగు బయటకు వేశాను. నా కోసం, నా బిడ్డకు బంగారు భవిష్యత్తు కోసం కృషి చేయాలని సంకల్పించాను. తొలుత ఒక షోరూమ్‌లో హెల్పర్‌గా చేరాను. అదే సమయంలో 'చైల్డ్‌లైన్ ఇండియా ఫౌండేషన్'లో వాలంటీర్‌గా పని చేశాను. అక్కడ నాలా భయంకరమైన కథలున్న మహిళలు చాలామందిని చూశాను. బాల్య వివాహానికి బలయింది నేనొక్కదాన్నే కాదని అప్పుడు అర్థమైంది. అలాంటి మహిళల గళం నేనెందుకు కాకూడదనే ఆలోచన వచ్చింది. నాటి నుంచి మహిళల హక్కుల సాధన, సాధికారత దిశగా అడుగులు వేశాను. ముఖ్యంగా బాల్య వివాహాలను నియంత్రించడంపై దృష్టి పెట్టాను.

**పాఠశాలల్లో పునాది...**

సమాజంలో రుగ్మతలు రూపుమాపి, బాల్య వివాహాలు అరికట్టాలంటే తల్లిదండ్రులతో పాటు బాలికలకు కూడా అవగాహన కల్పించాలి. ఆ ఉద్దేశంతోనే పలు గ్రామాల్లోని బాలికలతో పదిహేను బృందాలు ఏర్పాటు చేశాను. స్థానిక పెద్దలు, నాయకుల సాయం కూడా తీసుకున్నాను. వారందరి సహకారంతో ఎక్కడైనా బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారం సేకరిస్తాను. ఎక్కడైనా అందుకు ఏర్పాట్లు జరుగుతుంటే తక్షణం వెళ్లి, పెద్దలతో మాట్లాడి ఆపడానికి ప్రయత్నిస్తాను. ఒకవేళ వినకపోతే తదనంతర పరిణామాల గురించి వివరిస్తాను. అప్పటికీ దారికి రాకపోతే పోలీసుల సహాయం తీసుకొంటాను.

**ఇక్కడే ఎక్కువ...**

'నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే' (ఎన్‌ఎఫహెచ్‌ఎస)-5 నివేదిక ప్రకారం... 20 నుంచి 24 ఏళ్ల మధ్య వయసుగల ప్రతి ఐదుగురు మహిళల్లో ఇద్దరు 18 ఏళ్లు నిండకుండా పెళ్లి చేసుకున్నవారే. అంత చిన్న వయసులో వివాహ బంధంలోకి అడుగుపెట్టడంవల్ల వాళ్లు విలువైన జీవితాన్ని కోల్పోతున్నారు. అది వారికి జీవితాంతం ఒక మాయని గాయంలా మిగిలిపోతోంది. అలాగే మహిళల అక్రమ రవాణా కూడా పెద్ద సమస్యగా మారింది. వీటన్నిటిపైనా ఒక యుద్ధమే చేస్తున్నా. అమ్మాయిలు నిర్భయంగా తమ జీవితానికి ఏంకావాలో నిర్ణయించుకొనే స్వేచ్ఛను కల్పించేందుకు కృషి చేస్తున్నా. స్వయంసాధికారత దిశగా వారిని నడిపించేందుకు నావంతు ప్రయత్నం ఇది." 'యునిసెఫ్'తో కలిసి...

'సేవ్ ది చిల్డ్రన్, యునిసెఫ్' తదితర స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేస్తూ వచ్చాను. ఆ క్రమంలో బీహార్‌లోని చాలా గ్రామాలు తిరిగాను. బాల్య వివాహాలవల్ల కలిగే అనర్థాలను తల్లిదండ్రులకు చెప్పాను. అది వారి భవిష్యత్తును మొగ్గలోనే చిదిమేస్తుందని, అది చట్టవిరుద్ధమని వివరించాను. ఫలితంగా ఇప్పటికి పదుల సంఖ్యలో బాల్య వివాహాలు ఆపగలిగాను. నా ప్రయత్నానికి ప్రోత్సాహకంగా రెండేళ్ల కిందట జెనీవాలో జరిగిన సదస్సులో 'యునైటెడ్ నేషన్స్' నాకు ప్రతిష్టాత్మక అవార్డునిచ్చి సత్కరించింది. సమాజంలో పాతుకుపోయిన కట్టుబాట్లను దాటి, మహిళల జీవితాల్లో మంచి మార్పునకు కృషి చేస్తున్నందుకుగానూ నన్ను కొనియాడింది.

# మడమల్లో పగుళ్లా!



చలికాలం వస్తోందంటే కొంతమందికి అది ఒక పీడకలలాగే అనిపిస్తుంది. పాదాలు, మడమలు పగిలి రక్తం వెలికి రావడం, దాని తాలూకు నొప్పి, మంటలు కొందరికి నిజంగానే నరకాన్ని తలపిస్తాయి. నిజానికి ఈ సమస్యను చిన్నపాటి చిట్కా వైద్యాలతోనే అధిగమించవచ్చు. ముఖ్యంగా చలి కాలమంతా రోజుకు రెండు సార్లు మాయిశ్చరైజర్‌తో పాదాల్ని శుభ్రం చేసుకోవడం ఒక పద్ధతి. ఇలా చేయడం వల్ల పాదాలు ఎండిపోవడం గానీ, గరుకుగా మారడం గానీ ఉండదు. గోరు వెచ్చని నీళ్లల్లో కొంచెం తేనె వేసి, ఆ నీళ్లల్లో పాదాలు ఉంచితే పాదాలు పగుళ్లు పోయి మృదువుగా మారతాయి. ఆయుర్వేద శాస్త్రం, బ్యాక్టీరియా, సెప్టిక్ సమస్యల నుంచి మడమలు, పాదాల్ని కాపాడుకోవడానికి ఈ విధానాన్నే సూచిస్తుంది.తేనెలో మాయిశ్చరైజర్‌గా ఉపయోగపడే గుణాలు కూడా ఉన్నాయి. వీటన్నింటితో పాటు, పాదాల పరిరక్షణలో ఆలివ్ ఆయిల్ పాత్ర కూడా కీలకలమే. పాదాలు పగుళ్లు బారిన చోట ఆలివ్ ఆయిల్‌తో మర్దనా చేస్తే ఆ భాగాల్లో రక్తప్రసరణ పెరుగుతుంది. చాలామంది స్నానానికి ముందు ఆలివ్ ఆయిల్ మర్దనం చేసుకోవడంలోని ఉద్దేశం ఇదే. వీటితో పాటు చలికాలంలో పాదాలకు కాటన్ సాక్స్ వాడటం చాలా మేలు. ఇవి కాలుష్యాలనుంచి, దుమ్ము, ధూళినుంచి కాపాడతాయి. పాదాల్ని కాపాడటంలో హెర్బల్ క్రీములు బాగా ఉపయోగపడతాయి. ఈ క్రీమును గోరువెచ్చని నీళ్లతో కలిపి పాదాలు పగిలిన చోట పూయాలి. ఉదయం వేళల్లోనూ, నిద్ర కు ముందు ఇలా రోజుకు రెండు సార్లు ఈ క్రీమును వాడి తే మడమల, పాదాల బాధలు చాలా వరకు తగ్గిపోతాయి.

**కార్డియో ఎక్సర్‌సైజ్**

గుండె వేగం పెరిగేలా చేసే వ్యాయామాల వల్ల తక్కువ సమయంలో ఎక్కువ క్యాలరీలు ఖర్చవుతాయి. ఇందుకోసం ఈ కార్డియో ఎక్సర్‌సైజెస్ బెస్ట్ ఛాయిస్. ట్రెడ్‌మిల్: ట్రెడ్‌మిల్ మీద పరిగెత్తగలిగేంత వేగం, గ్రేడ్ సెట్ చేసుకుని ఆగకుండా 20 ని.లు పరిగెత్తేకంటే మధ్యలో 3 ని.లపాటు వేగం తగ్గించి తిరిగి పెంచుతూ పరిగెత్తితే రెట్టింపు ఫలితం ఉంటుంది. సైడ్ జంప్: నిలబడ్డ చోటునుంచి కుడి, ఎడమ పక్కకు జంప్ చేసి తిరిగి యథాస్థానానికి రావాలి. ఇలా 20 సార్లు చేయాలి.స్పాట్ లెగ్ లిఫ్ట్: కాలు మడిచి పైకి లేపి తిరిగి దించేయాలి. అలా రెండో కాలితో కూడా చేయాలి. ఇలా వేగంగా 20 సార్లు చేసినప్పుడే ఫలితం ఉంటుంది.జంపింగ్ జాక్స్: రెండు కాళ్లు దూరంగా జరుపుతూ చేతులు కూడా పైకి లేపి ఎగరాలి. ఇలా జంపింగ్ జాక్స్ 25 చేయాలి.

# బిజినెస్




## అంబానీ బిగ్ డీల్.. మరో సంస్థను కొనుగోలు చేసిన రిలయన్స్..

**ముంబై-నవభూమి:** దిగ్గజ పారిశ్రామిక వేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ.. మళ్లీ దూకుడు పెంచారు. రిలయన్స్ కొద్ది రోజుల కిందట బోనస్ షేర్లు ప్రకటించినా.. షేరు అంత పుంజుకోలేదన్న సంగతి తెలిసిందే. తర్వాత వరుస పెట్టి పలు సంస్థల్ని కొనుగోలు చేయడం లేదా వాటాల్ని దక్కించుకోవడం జరుగుతూ వస్తోంది. ఇప్పుడు.. రిలయన్స్ సంస్థ.. ఒక హెల్త్‌కేర్ ప్లాట్‌ఫాంను సొంతం చేసుకుంది.అంబర్‌తీఅవం వాస్తుతీవం%: భారత్‌లోనే అత్యంత ధనవంతుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ కీలక ప్రకటన చేసింది. టెక్నాలజీ ఆపరేటెడ్, ఆంకాలజీ సేవలు అందించేటువంటి హెల్త్‌కేర్ ప్లాట్‌ఫాం కర్కినోస్‌ను కొనుగోలు చేసినట్లు వెల్లడించింది. ఈ మేరకు శనివారం ప్రకటన చేసింది. ఈ డీల్ విలువ రూ. 375 కోట్లు అని వెల్లడించింది. రిలయన్స్ స్ట్రాటజిక్ బిజినెస్ వెంచర్స్ లిమిటెడ్.. అవసరమైన షేర్ల కేటాయింపుత కర్కినోస్ ప్రైవేట్ లిమిటెడ్ కొనుగోలును పూర్తి చేసిందని.. రిలయన్స్ సంస్థ ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజీ ఫైలింగ్‌లో తెలిపింది. కర్కినోస్ ఇదివరకే.. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం లేదా నిర్ధరించడం వంటి సాంకేతికతతో నడిచే వినూత్న పరిష్కారాల్ని అందించే సంస్థగా పేరొందింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కర్కినోస్ సంస్థ టర్నోవర్ దాదాపుగా రూ. 22 కోట్లుగా ఉంది. లాభదాయక సంస్థగా కొనసాగుతూనే.. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం, మెరుగ్గా సమర్థంగా చికిత్స చేయడం వంటి వాటిపైనే దృష్టి సారించింది. ఆంకాలజీ అంటే టెస్టింగ్, రేడియేషన్ థెరపీ వంటి సేవల్ని అందించేందుకు.. కర్కినోస్ ఎన్నో ఆస్పత్రులతో భాగస్వామ్యం కలిగి ఉంది. 2023 డిసెంబర్ అంటే ఏడాది కిందటే ఇది దాదాపు 60 ఆస్పత్రులతో భాగస్వామ్యం కలిగి ఉంది.

## రిలయన్స్ ఉపకార వేతనాల్లో తెలుగు విద్యార్థులకు పెద్ద పీట

### దేశ వ్యాప్తంగా 5 వేల మంది యూజీ స్కాలర్ల ఎంపిక




**న్యూఢిల్లీ-నవభూమి:** రిలయన్స్ ఫౌండేషన్ 2024-25 బ్యాచ్ అండర్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్ లబ్ధిదారులను ప్రకటించింది. దేశవ్యాప్తంగా దాదా పు ఒక లక్ష మంది వీటికి దరఖాస్తు చేసుకోగా, 5 వేల మందిని ఎంపిక చేసినట్లు తెలిపింది.

ఎంపికైనవారిలో ఒక్కొక్కరికి ట్యూషన్ ఫీజు, హాస్టల్, ఇతర విద్యా సంబంధిత ఖర్చుల కోసం రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం చేయనున్నట్లు తెలిపింది. 850 మంది విద్యార్థులతో ఏపీ మొదటి, 411 మందితో తెలంగాణ నాలుగో స్థానంలో నిలిచిందని వివరించింది. రిలయన్స్ ఫౌండేషన్ వెబ్‌సైట్ %ట్ట్రజూం:// ఒఎష్ట్రశీశ్రీఖతీ ఒష్ట్రఙజూ ం.తీవశ్రీఖుఅ ఎవట శీబఅఫ్అశీఅ.శీతీస్ట్ర/ఖ+ ూఎష్ట్రశీ శ్రీఖతీ- ఒష్ట్రఙజూబిూజూజూశ్రీఅఫ్అశీఅూఫ్బం.ఖంజూఇ%ను ద్వారా ఫలితాలను తెలుసుకోవచ్చని తెలిపింది.

## పీఎం కేర్స్ విరాళాల్లో క్షీణత

**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో కోవిడ్-19 మహమ్మారి ప్రబలిన తర్వాత 2020 మార్చిలో స్థాపించిన ప్రైమ్ మినిస్టర్స్ సిటిజన్ అసిస్టెన్స్ అండ్ రిలీఫ్ ఇన్ ఎమర్జెన్సీ సిచువేషన్స్(పీఎం కేర్స్) ఫండ్‌కు విరాళాలు భారీగా తగ్గిపోయాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈ నిధికి అందిన విరాళాలు కేవలం రూ.912 కోట్లు మాత్రమే.

2020-21లో రూ.7,184 కోట్ల విరాళాలు లభించగా 2021-22లో రూ.1,938 కోట్లు మాత్ర మే లభించాయి. 2021 తర్వాత విదేశీ విరాళాలు కూడా క్రమంగా తగ్గుముఖం పట్టాయి. మరోవైపు ఈ ఫండ్ నుంచి 2022-23లో మొత్తం వ్యయం రూ.439 కోట్లు గా ఉంది. ఇందులో రూ.346 కోట్లను కొవిడ్ కాలంలో పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్ నిధికి వినియోగించినట్టు అధికారులు చెప్పారు.


## అధిక వడ్డీ పేరుతో 6 వేల కోట్ల స్కామ్ గుజరాత్‌లో నిందితుడి అరెస్ట్



**గాంధీనగర్:నవభూమి:**గుజరాత్‌లో బ్యాంకుల కంటే అధిక వడ్డీ ఇస్తామంటూ ఆశచూపి, మోసం చేసిన భారీ కుంభకోణంలో ప్రధాన నిందితుడు భూపేంద్రసింగ్ ఝలాను పోలీసులు అరెస్ట్ చేశారు. బీజే ఫైనాన్షియల్ సర్వీసెస్, బీజే గ్రూప్ పేరుతో వేలాది మంది నుంచి రూ.6 వేల కోట్ల వరకు వసూలు చేసిన నిందితుడు నెల రోజుల నుంచి పరారీలో ఉండగా పక్కా సమాచారంతో సీఐడీ బృందాలు నిందితుడిని మెహ్సానా జిల్లా దావ్డాలోని ఫామ్‌హౌజ్‌లో పట్టుకున్నారు.

నిందితుడి నుంచి విలాసవంతమైన కార్లు, భారీగా నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తున్నది. మరోవైపు భూపేంద్రసింగ్ స్థానిక కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా న్యాయస్థానం తిరస్కరించింది.

## ఉద్యోగ కల్పనలో దూసుకుపోతున్న ఎలక్ట్రానిక్స్.. వచ్చే మూడేండ్లలో కోటి ఉద్యోగాలు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఉద్యోగ కల్పనలో ఎలక్ట్రానిక్స్ రంగం దూసుకుపోతున్నది. వచ్చే మూడేండ్లలో ఈ రంగంలో 1.2 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని టీమ్‌లీజ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. వీరిలో 30 లక్షల మంది ప్రత్యక్షంగాను, మరో 90 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొంది. ప్రత్యక్షంగా ఉపాధి లభించనున్నవారిలో 10 లక్షల మంది ఇంజినీర్లు, 20 లక్షల మంది ఐటీఐ ప్రొఫెషనల్స్, 2 లక్షల మంది కృత్రిమ మేధస్సు, మెషిన్‌లెర్నింగ్, డాటా సైన్సెస్, నాన్-టెక్నికల్ విభాగానికి చెందిన 90 లక్షల మందికి ఉపాధి లభించనున్నది.న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థయైన ఆర్ఎస్‌బీవీఎల్ ..హెల్త్‌కేర్ టెక్నాలజీ సేవలను మరింత విస్తరించడంలో భాగంగా కార్కినోస్‌ను కొనుగోలు చేసింది. ఒప్పందం విలువ రూ.375 కోట్లు. జూలై 24, 2020లో ప్రారంభమైన కార్కినోస్..హెల్త్‌కేర్ టెక్నాలజీ సేవల్లో భాగంగా రోగ నిర్ధారణ, నిర్వహణ, అలాగే క్యాన్సర్‌ను ముందుగా గుర్తించే టెక్నాలజీ సేవలను అందిస్తున్నది. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ టర్నోవర్ రూ.22 కోట్లుగా ఉన్నది. ప్రస్తుతం సంస్థ దేశవ్యాప్తంగా 60 ఆసుపత్రులతో ఒప్పందం కుదుర్చుకొని వైద్య సేవలు అందిస్తున్నది.

# రిలయన్స్, హెచ్డీఎఫ్సీ బ్యాంకులకు భారీ లబ్ధి..!




**న్యూఢిల్లీ-నవభూమి:** గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్లలో టాప్-10 సంస్థల్లో ఆరు సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.86,847.88 కోట్లు పెరిగింది. హెచ్డీఎఫ్సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ భారీగా లబ్ధి పొందాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ -30 గతవారం 657.48 పాయింట్లు, ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ 225.9 పాయింట్ల లాభంతో ముగిశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్ టెల్, ఐటీసీ, హిందూస్థాన్ యూనీ లివర్ లాభ పడ్డాయి. మరోవైపు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) నష్టపోయాయి.హెచ్డీఎఫ్సీ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.20,235.95 కోట్లు పుంజుకుని రూ.13,74,945.30 కోట్ల వద్ద స్థిర పడింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎం-క్యాప్ రూ.20,230.9 కోట్ల లాభంతో రూ.16,52,235.07 కోట్ల వద్ద ముగిసింది. ఐటీసీ ఎం-క్యాప్ రూ.17,933.49 కోట్ల లబ్ధితో రూ.5,99,185.81 కోట్ల వద్ద నిలిచింది. ఐసీఐసీఐ బ్యాంక్ ఎం-క్యాప్ రూ.15,254.01 కోట్ల లాభంతో రూ.9,22,703.05 కోట్ల వద్ద ముగిసింది. భారతీ ఎయిర్ టెల్ ఎం-క్యాప్ రూ.11,948.24 కోట్లు పెరిగి రూ.9,10,735.22 కోట్లకు చేరుకుంది. హిందూస్థాన్ యూనీ లివర్ ఎం-క్యాప్ రూ.1,245.29 కోట్లు పుంజుకుని రూ.5,49,863.10 కోట్లకు చేరుకుంది.మరోవైపు, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.11,557.39 కోట్ల నష్టంతో రూ.7,13,567.99 కోట్లకు చేరుకుంది. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.8,412.24 కోట్లు కోల్పోయి రూ.5,61,406.80 కోట్ల వద్ద నిలిచింది. ఇన్ఫోసిస్ ఎం-క్యాప్ రూ.2,283.75 కోట్ల పతనంతో రూ.7,95,803.15 కోట్ల వద్ద ముగిసింది. టీసీఎస్ ఎం-క్యాప్ రూ.36.18 కోట్ల నష్టంతో రూ.15,08,000.79 కోట్ల వద్ద స్థిర పడింది. గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత టాప్-10 సంస్థల్లో రిలయన్స్ మొదటి స్థానంలో కొనసాగుతున్నది. తర్వాతి స్థానాల్లో టీసీఎస్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్ టెల్, ఇన్ఫోసిస్, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ), ఐటీసీ, ఎల్ఐసీ, హిందూస్థాన్ యూనీ లివర్

# టెలికం సంస్థలకు ఇక్కట్లే..

## టారీఫ్‌ల పెంపుతో కొత్త ఏడాదిలో సవాళ్లే !



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ ప్రైవేట్ టెలికం సంస్థలకు కొత్త ఏడాదిలో ప్రధానంగా రెండు సవాళ్లు ఎదురుకావచ్చన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ ఏడాది ఆయా టెలికం కంపెనీలు టారీఫ్‌లను పెంచిన విషయం తెలిసిందే. అయితే ఇది రివర్స్ ఫైర్ అయిందన్న సంకేతాలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రధాన టెలికం సంస్థల నుంచి కస్టమర్లు ఇతర సంస్థల్లోకి మారిపోతున్నారు. దీంతో వచ్చే ఏడాదీ ఈ జంపింగ్‌లుంటాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నిజానికి ఇప్పటికే రిచార్జ్ ప్లాన్ల ధరలు తారెత్తిస్తున్నాయి. అయినప్పటికీ ఖర్చులు పెరిగాయన్న కారణాలతో టెలికం ఆపరేటర్లు ధరల భారాన్ని కస్టమర్లపై మోపుతూనే ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ఈ నేపథ్యంలో ఈ ఏడాది మధ్యలో ధరలు మరింత పెరగడంతో సబ్‌స్క్రైబర్ల సంఖ్య పెద్ద ఎత్తునే పడిపోయింది. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాల్లో చార్జీలు 10 నుంచి 26 శాతం మేర పెరిగాయి. దీంతో ఆయా సంస్థలు 2.6 కోట్ల కస్టమర్లను కోల్పోయాయని అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. మరోవైపు దాదాపు 68 లక్షల కస్టమర్లు ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ కనెక్షన్‌ను తీసుకున్నట్టు తేలింది. ఇప్పటికీ బీఎస్ఎన్ఎల్ 3జీ సర్వీసులనే ఇస్తుండగా, 4జీ సేవల విస్తరణ పనుల్లో ఉండటం గమనార్హం. అయినప్పటికీ కొత్త కస్టమర్లు వస్తున్నారంటే ధరల భారం ఏ స్థాయిలో ప్రైవేట్ కంపెనీలకు ప్రతికూలంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

**శాట్కామ్‌ల ఎంట్రీతో..**

వచ్చే ఏడాది శాటిలైట్ ఆధారిత సేవల సంస్థలతోనూ టెలికం కంపెనీలకు మార్కెట్‌లో భారీగానే పోటీ ఉండొచ్చన్న అంచనాలున్నాయి. ప్రధానంగా ఎలాన్ మస్క్ స్టార్‌లింక్ రాకతో ప్రస్తుతం టెలికం సంస్థలకు పెద్ద ఎత్తున ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న డాటా వ్యాపారానికి ఎదురుదెబ్బేనన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. శాట్కామ్ సర్వీసులతో ధరల యుద్ధానికి వీలుందని, డాటా ధరలు ఇంకా పడిపోవచ్చని చెప్తున్నారు. ఇదే గనుక జరిగితే ప్రైవేట్ రంగ టెలికం సంస్థలకు నష్టాలే. 5జీ సేవలను దేశవ్యాప్తంగా విస్తరిస్తూపోతున్న టెల్కోలు.. అందుకోసం రూ.70వేల కోట్లదాకా పెట్టుబడులు పెట్టాయి.

## బాబోయ్.. మళ్లీ పుంజుకున్న గోల్డ్, సిల్వర్ రేట్లు



**న్యూఢిల్లీ-నవభూమి:**ఇంకో రెండు రోజుల్లో ఈ ఏడాది పూర్తి కానుంది. ఇదే సమయంలో బంగారం వెండి ధరలు పెరుగుతూ, తగ్గుతున్నాయి. ఈ క్రమంలో నిన్న తగ్గిన ఈ ధరలు నేడు మళ్లీ పుంజుకున్నాయి. దీంతో ఈరోజు (డిసెంబర్ 29న) ఉదయం 6.20 గంటల నాటికి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 240 పెరిగి రూ. 76,740కి చేరింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 70,098కి చేరింది.మరోవైపు హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 76,720కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ. 70,327కు చేరింది. ఇక వెండి ధర విషయానికి వస్తే కిలో వెండి రూ. 1260 తగ్గి రూ. 88,600 స్థాయికి చేరుకోవడం విశేషం. ఈ నేపథ్యంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు (10 గ్రాములకు) (24 క్యారెట్స్, 22 క్యారెట్స్)

ముంబైలో రూ. 76,600, రూ. 70,217<br>
ఢిల్లీలో రూ. 76,740, రూ. 70,098<br>
హైదరాబాద్‌లో రూ. 76,720, రూ. 70,327<br>
విజయవాడలో రూ. 76,720, రూ. 70,327<br>
కోల్‌కతాలో రూ. 76,500, రూ. 70,125<br>
చెన్నైలో రూ. 76,820, రూ. 70,418<br>
బెంగళూరులో రూ. 76,660, రూ. 70,272

ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కిలోకు)

చెన్నైలో రూ. 89,010<br>
ఢిల్లీలో రూ. 88,600<br>
ముంబైలో రూ. 88,750<br>
కోల్‌కతాలో రూ. 88,640<br>
హైదరాబాద్‌లో రూ. 88,890<br>
విశాఖపట్నంలో రూ. 88,890<br>
బెంగళూరులో రూ. 88,820

**బంగారం స్వచ్ఛత తెలుసుకోవడం ఎలాగో తెలుసా..**

బంగారం స్వచ్ఛతను గుర్తించడానికి (ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) ద్వారా హాల్ మార్క్ ఇస్తారు. 24 క్యారెట్ల బంగారు ఆభరణాలపై 999, 23 క్యారెట్‌లపై 958, 22 క్యారెట్‌పై 916, 21 క్యారెట్‌పై 875, 18 క్యారెట్‌పై 750 అని ఉంటుంది. ఎక్కువగా బంగారాన్ని 22 క్యారెట్లలో విక్రయిస్తుండగా, కొందరు 18 క్యారెట్లను కూడా ఉపయోగిస్తారు. క్యారెట్ 24కి మించదు, క్యారెట్ ఎక్కువైతే బంగారం స్వచ్ఛంగా ఉంటుంది. 24 క్యారెట్ల బంగారం 99.9% స్వచ్ఛమైనది. 22 క్యారెట్ల బంగారం దాదాపు 91 శాతం స్వచ్ఛమైనది.

# ఫండ్లలో మహిళా ఇన్వెస్టర్ల జోరు..

## ఏడాదిలో రెండున్నర రెట్లు పెరిగిన సంఖ్య



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీలో మహిళా పెట్టుబడిదారులు భారీగా పెరుగుతున్నారు. ప్రస్తుత సంవత్సరంలో చిన్న, మధ్యస్థాయి నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు ఫండ్లలో ఇన్వెస్ట్ చేస్తున్నారని, గడిచిన ఏడాదికాలంలో వీరి సంఖ్య రెండున్నర రెట్లు పెరిగినట్లు ఆన్‌లైన్ బ్రోకరేజ్ సంస్థ గ్రోవ్ తెలిపింది. మహిళల్లో ఆర్థిక స్వావలంభన పెరుగుతున్నదని, ముఖ్యంగా పట్టణ, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలతోపాటు చిన్న స్థాయి నగరాల్లో సైతం 140 శాతం పెరిగిందని, దీంతో వీరు ఈక్విటీ మార్కెట్లతోపాటు ఎంఎఫ్ మార్కెట్లలో విరివిగా పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించింది. మిగతా రంగాలకు దూరంగా ఉంటున్న మహిళలు..ఈక్విటీ, ఫండ్లలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నట్లు, ఈ ఏడాది కోటి మందికి పైకి చేరుకున్నారని గ్రోవ్ కో-ఫౌండర్, సీఈవో లలిత్ కేశ్రా తెలిపారు.గడిచిన ఏడాదికాలంలో మెట్రో, టైర్-1,2,3 నగరాల్లో ఫండ్లలో పెట్టుబడులు పెట్టే మహిళలు 100 శాతం చొప్పున పెరిగారు. నగరాల వారీగా చూస్తే ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, పూణె, లక్నో, అహ్మదాబాద్, జైపూర్ వంటి మెట్రో నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేశారు. అలాగే పురుషుల కంటే సిప్‌లలో మహిళలు అత్యధికంగా పెట్టుబడులు పెట్టడం విశేషం. ఈ ఏడాది మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ ఏయూఎం రూ.17 లక్షల కోట్ల మేర పెరిగిందని ఆంఫీ తెలిపింది. డిసెంబర్ 2023లో రూ.50.79 లక్షల కోట్లుగా ఉన్న ఫండ్ ఆస్తుల విలువ ప్రస్తుతం రూ.68 లక్షల కోట్లకు చేరుకున్నది. అలాగే గత నెలలో దేశీయ స్టాక్ మార్కెట్లో కొత్తగా 42.76 లక్షల మంది చేరారు. అలాగే గడిచిన నాలుగేండ్లుగా ప్రతియేటా 3 కోట్ల డీమ్యాట్ ఖాతాలు ప్రారంభిస్తున్నారు.

## రూ. 20 వేల శాలరీ వ్యక్తి.. ఇలా రూ. 6 కోట్లు సంపాదించుకోవచ్చు..

**న్యూఢిల్లీ-నవభూమి:**మీకు తక్కువ శాలరీ ఉందా. అయినా కూడా పర్లేదు. మీరు భవిష్యత్తులో 6 కోట్ల రూపాయలను సులభంగా సంపాదించుకోవచ్చు. అసాధ్యమేమీ కాదు. అయితే ఇది ఎలా సాధ్యం? నెలకు ఎంత సేవ్ చేయాలి, ఎన్నేళ్లు చేయాలనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.సాధారణంగా ఫ్రెషర్స్ లేదా చిన్న వయస్సులో ఉద్యోగం ప్రారంభించే వ్యక్తులకు వారి నెలవారీ జీతం తక్కువగా ఉంటుంది. ఉదాహరణకు రూ. 15,000 వేల నుంచి రూ. 20 వేల జీతం వారు 6 కోట్ల రూపాయలు ఎలా సంపాదించాలనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం. మాములుగా అయితే లక్షల జీతం ఉన్న వారు కొంత ఎక్కువ సేవ్ చేసుకోవచ్చు. కానీ తక్కువ జీతం ఉన్న వారు సైతం ప్రతి నెల కూడా తక్కువ మొత్తంలో పెట్టుబడులు చేసి మంచి రాబడులను దక్కించుకోవచ్చు. దాని కోసం ప్రతి నెల ఎంత పెట్టుబడి చేయాలి, ఎన్నేళ్లు చేయాలనే వివరాలను ఇప్పుడు చూద్దాం.దీర్ఘకాలంలో మంచి కార్పస్ మొత్తాన్ని పొందాలంటే మ్యూచువల్ ఫండ్స్ సిప్ పెట్టుబడులు మంచి మార్గమని చెప్పవచ్చు. వీటిలో చేసిన పెట్టుబడులు వృద్ధి చెంద డానికి కాంపౌండింగ్ విధానం ఉంటుంది. వారి నెలవారీ పెట్టుబడి మొత్తం పెరిగే కొద్ది, ఆదాయం కూడా పెరుగుతుంది. ఈ క్రమంలో రూ. 2000 నెలవారీగా విధానంలో 40 ఏళ్లపాటు పాటు క్రమం తప్పకుండా పెట్టుబడి చేయాలి. ఇలా 40 ఏళ్లపాటు చేసిన పెట్టుబడి మొత్తం రూ. 9,60,000 అవుతుంది. ఈ క్రమంలో వార్షిక రాబడి 15 శాతం వడ్డీ చొప్పున చూస్తే 40 ఏళ్ల తర్వాత వారికి రూ. 6,28,07,511 లభిస్తాయి. ఈ నేపథ్యంలో వడ్డీల రూపంలోనే రూ. 6,18,47,511 కోట్లు వారికి వచ్చే అవకాశం ఉంటుంది.సిప్ పెట్టుబడుల ద్వారా..మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు చేయడానికి ఇది ఒక ప్రామాణిక పెట్టుబడి పథకం. ఇందులో మీరు నిరంతరం నెలవారీగా ఒక నిర్దిష్ట మొత్తాన్ని పెట్టుబడి చేయాల్సి ఉంటుంది. ఈ విధానం కాంపౌండింగ్ వడ్డీ పద్ధతిని ఉపయోగించి, పెట్టుబడులు కాలక్రమంలో పెరుగుతాయి. అయితే సరైన పెట్టుబడులు చేయడం ద్వారా మీరు దశల వారీగా మీ సంపదను దీర్ఘకాలంలో భారీగా పెంచుకోవచ్చు.సరైన సమయంలో..ఇందులో ప్రత్యేకత ఏమిటంటే మీరు మొదటి సంవత్సరంలో పెద్ద మొత్తం పెట్టుబడి చేయకపోయినా, ప్రతి నెలా క్రమం తప్పకుండా పెట్టుబడులు చేస్తూ పోతే, సమయం గడిచే కొద్దీ వాటి వృద్ధిని చూస్తూ పోతారు. ఆ క్రమంలో 40 సంవత్సరాల కాలంలో మీ పెట్టుబడులపై 15% వృద్ధి, మీ సంపాదనకు తోడ్పడుతుంది. పెట్టుబడులు పెట్టే క్రమం, విస్తృతంగా పొదుపు చేయడం, దీర్ఘకాలంలో పెట్టుబడులు చేయడం ద్వారా మీరు పెద్ద మొత్తంలో సంపాదించుకుంటారు.

# విమాన టికెట్లపై రూ.3000 తగ్గింపు..

## ఎయిరిండియా ఆఫర్.. ఇంకో రెండ్రోజులే ఛాన్స్!




**న్యూఢిల్లీ-నవభూమి:**విమాన ప్రయాణాలు చేసే వారికి మంచి ఆఫర్ అందించి ఎయిరిండియా. ఈ డిసెంబర్ 31 వరకు చేసే ప్రయాణాలపై డిస్కౌంట్లు అందిస్తోంది. ఆ బ్యాంక్ క్రెడిట్ కార్డులు ఉపయోగించి టికెట్లు బుక్ చేసుకుంటే రూ.3000 వరకు తగ్గింపు ఇస్తోంది. మరి ఈ ఆఫర్ గురించి పూర్తి వివరాలు తెలుసుకోండి.

విమాన ప్రయాణికులకు బంపర్ ఆఫర్. దేశీయ దిగ్గజ ఎయిర్‌లైన్స్ ఎయిర్ ఇండియా మరోసారి డిస్కౌంట్ ఆఫర్ పట్టుకొచ్చింది. విమాన టికెట్లపై భారీ తగ్గింపు అందిస్తోంది. ఈ ఆఫర్ డిసెంబర్ 31వ తేదీ వరకే అందుబాటులో ఉంటుంది. ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డులు ఉపయోగించి టికెట్లు బుక్ చేసుకున్నట్లయితే గరిష్ఠంగా రూ.3 వేల వరకు తగ్గింపు పొందవచ్చని తెలిపింది. ఆఫర్ బట్టి ఈ డిస్కౌంట్ లభిస్తుంది. మరి ఏ రూట్లలో ఈ డిస్కౌంట్ వస్తుంది? ఆఫర్ వివరాలేంటి? అనేది తెలుసుకుందాం.ఎయిరిండియా తీసుకొచ్చిన ఆఫర్ ప్రకారం.. అర్హులైన ఐసీఐసీఐ బ్యాంక్ కస్టమర్లు ప్రత్యేక ఇన్‌స్టాంట్ డిస్కౌంట్ పొందవచ్చు. ఎయిర్ ఇండియా అధికారిక వెబ్‌సైట్, ఎయిరిండియా మొబైల్ యాప్ ద్వారా టికెట్లు బుక్ చేసుకునే వారికి ఈ ఆఫర్ వర్తిస్తుందని గుర్తుంచుకోవాలి. అలాగే ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డుల ద్వారా మాత్రమే ఈ టికెట్లు బుక్ చేసుకోవాలి. ఈ ఆఫర్ డిసెంబర్ 31, 2024 వరకే అందుబాటులో ఉంటుంది. ఆలోపు టికెట్లు బుక్ చేసుకుంటే ఇన్‌స్టాంట్ డిస్కౌంట్ పొందవచ్చు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

రూ.750 ఫ్లాట్ డిస్కౌంట్ అనేది డొమెస్టిక్ ఫ్లైట్స్ రిటర్న్ టికెట్లపై పొందవచ్చు. దీనికి %ICICI%750 అనే ప్రోమో కోడ్ ఉపయోగించాలి. ఇక అంతర్జాతీయ విమాన ప్రయాణాలపై గరిష్ఠంగా రూ.2500 డిస్కౌంట్ పొందవచ్చు. దీనికి %ICICI%2500 ప్రోమోకోడ్ ఉపయోగించాలి. ఇక బిజినెస్ క్లాస్ బుకింగ్స్ పై రూ.3 వేలు తగ్గింపు వస్తుంది. ఇందుకు ప్రోమో కోడ్ %ICICI%3000 ఉపయోగించాలి. అలాగే %PNR%లో నలుగురి వరకు మాత్రమే అవకాశం ఉంటుంది. అలాగే ఈ ఆఫర్ అనేది డిసెంబర్ 21, 2024 నుంచి డిసెంబర్ 31, 2024 వరకు అన్ని రోజుల్లో బుకింగ్ చేసుకునే వారికి వర్తిస్తుంది.

ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డు ఉన్న వారు డిస్కౌంట్ పొందవచ్చు. అయితే, బిజినెస్, కమెర్షియల్, కార్పొరేట్ కార్డులకు వర్తించదు. అలాగే ప్రత్యేక %BINs%లకు మాత్రమే వర్తిస్తుంది. కేవలం ఎయిరిండియా వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారానే ట్రాన్సాక్షన్ చేస్తే డిస్కౌంట్ లభిస్తుంది. అలాగే విమాన టికెట్ల బేస్ ఫేర్ పైనే ఈ తగ్గింపు లభిస్తుంది. చిన్న పిల్లలకు ఈ ఆఫర్ వర్తించదు. ఒక కస్టమర్ నెలకు ఒకసారి మాత్రమే ఈ ఆఫర్ ఉపయోగించుకోవచ్చు. దేశీయ, అంతర్జాతీయ ప్రయాణాలకు ఈ ఆఫర్ పొందవచ్చు. నెలలో ఒకసారి మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. అలాగే ఒకే ట్రాన్సాక్షన్కి వర్తిస్తుంది. మల్టిపుల్ ట్రాన్సాక్షన్లకు డిస్కౌంట్ రాదు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
7 హైదరాబాద్ సోమవారం 30 । డిసెంబర్ । 2024





## మా పథకాలకు భయపడే బీజేపీ అడ్డుకుంటోంది: కేజ్రీవాల్

**న్యూఢిల్లీ-నవభూమి:** ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై విచారణకు లెఫ్టినెంట్ గవర్నర్ విచారణకు ఆదేశించడంపై ఆ పార్టీ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ (%ూతీజఱఅఉ ఖవయతీఱుఖ్రీ%) స్పందించారు. నిరాధారమైన విచారణతో తమ పార్టీ 'మహిళా సమ్మాన్ యోజన'ను బలహీనపరచేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ తమ పార్టీ పథకాలకు చూసి బీజేపీ భయపడుతోందని, వాటిని దెబ్బతీసేందుకు కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్‌ను అడ్డుపెట్టుకుందని శనివారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ ఆయన అన్నారు.'మహిళా యోజన పథకం' కింద మహిళలకు రూ.2,100 చొప్పున నెలవారీ ఆర్థిక సాయం, 'సంజీవని యోజన' పథకం కింద 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఉచిత వైద్య చికిత్సను 'ఆప్' ప్రకటించింది. తాము ప్రకటించిన రెండు పథకాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుండటం, లక్షలాది మంది ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో బీజేపీకి ఓటమి భయం పట్టుకుందని కేజ్రీవాల్ అన్నారు. ఈ పథకాలను ఆప్ విజయవంతం చేసినట్లయితే బీజేపీకి అనేక నియోజకవర్గాల్లో గట్టిదెబ్బ తగులుతుందని, చాలాచోట్ల డిపాజిట్లు కూడా కోల్పోతుందని ఆ పార్టీనేతలే తనతో చెబుతున్నారని తెలిపారు. ఆప్ చేసిన రిజిస్ట్రేషన్ క్యాంపులు విజయవంతం కావడంతో బీజేపీ బెదిరింపు ఎత్తుగడలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. క్యాంపులను చెల్లాచెదురు చేసేందుకు దుండగులను, పోలీసులను ఉసిగొలుపుతోందని అన్నారు.

## భయం.. భయం.. ఆందోళనలో గర్భిణులు



**బళ్లారి(బెంగళూరు)-నవభూమి:** జిల్లాలో గర్భిణులకు కాన్పుల భయం వీడలేదు. నవమాసాలు మోసి ప్రసవానికి వచ్చిన తల్లులు మృత్యువాత పడడం ఆందోళన కలిగిస్తోంది. గత నెలలో బళ్లారి)లో జరిగిన బాలింతల మరణాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన విషయం తెలిసిందే. దుర్ఘటన మరిచిపోక ముందే రెండ్రొౌజుల క్రితం విజయనగర (హొస్పేట్)లో ఇద్దరు బాలింతలు మృతి చెందారు. బళ్లారి జిల్లా సండూరు తాలూకా ఇంగల్లి గ్రామానికి చెందిన ఐశ్వర్య అనే గర్భిణీ విజయనగర( జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి డిసెంబరు 20న కాన్పు కోసం చేరింది. ఆమెకు ఈ నెల 24న సిజేరియన్ చేసి కాన్పు చేశారు. తరువాత ఆమె ఆరోగ్య పరిస్థితి ఆందోళణకరం కావడంతో ఆమెను కొప్పళ జిల్లాకు వైద్యం కోసం తరలించారు. చికిత్స పొందతూ ఆమె శుక్రవారం రాత్రి మరణం చెందారు. బాలింత మరణంతో బంధవులు, ఆందోళన వ్యక్తం చేశారు.అయితే జిల్లా వైద్యధికారి బాలింత మృతికి బయట హొటల్ నుంచి తెచ్చిన ఇడ్లీలే కారణమని ప్రకటించారు. కలుషితమైన ఆహారం తినిపించారని, అందుకే ఘటన జరిగిందని పేర్కొంటున్నారు. మరో బాలింత పూజ కూడా కాన్పు తరువాత మరణం చెందారు. ఈమెకు కాన్పు తేదీ కన్నా ముందే సిజేరియన్ చేయడం వల్ల మృతి చెందిందని వైద్యులు పేర్కొంటున్నారు. ఇద్దరు బాలింతల మృతితో మరోసారి జిల్లాలో ఆందోళన మొదలయ్యింది.

## వైవీ రెడ్డి బంగారు సలహా!



**న్యూఢిల్లీ-నవభూమి:** విదేశీ మారక నిల్వల విషయంలో దేశం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న తరుణమది. కేవలం వారం రోజుల దిగుమతులకు మాత్రమే సరిపడేలా విదేశీ మారకం నిల్వలు ఉన్నాయి. అలాంటి తరుణంలో మన్మోహన్‌సింగ్ ఆర్థిక మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. బంగారాన్ని తాకట్టు పెట్టడం ద్వారా విదేశీ మారక నిల్వలు పెంచాలని నిర్ణయించారు. వాస్తవానికి మన్మోహన్‌సింగ్ కన్నా ముందు ఆర్థిక మంత్రిగా పనిచేసిన యశ్వంత్ సిన్హాకు కూడా బంగారం విక్రయించి చమురు దిగుమతులకు అవసరమైన నిధులు సర్దుబాటు చేశారు. ఈ ఇద్దరు ఆర్థిక మంత్రులకు బంగారం తాకట్టు సలహా ఇచ్చింది. దాన్ని పూర్తిగా అమలు చేసిన అధికారి వైవీ రెడ్డి. యశ్వంత్ సిన్హా 20 టన్నుల బంగారాన్ని స్విట్జర్లాండ్‌లో తాకట్టు పెట్టారు. ఆ తర్వాత ఆర్థిక మంత్రిగా వచ్చిన మన్మోహన్‌సింగ్ మరో 47 టన్నుల బంగారాన్ని బ్రిటన్‌లో తాకట్టుపెట్టి అప్పులు తీసుకొచ్చారు. ఆ తర్వాత దేశంలో క్రమేణా ఆర్థిక సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన వారిలో మన్మోహన్‌సింగ్‌తోపాటు వైవీ రెడ్డి కూడా ఒకరనేది కొందరికే తెలుసు. కడప జిల్లాలోని ఓ మారుమూల గ్రామానికి చెందిన వైవీ రెడ్డి అంతర్జాతీయంగా ఆర్థిక సంస్కరణల్లో నిపుణుడిగా పేరుగాంచారు. గల్ఫ్‌లోని బహ్రెయిన్ ప్రభుత్వంతోపాటు చైనాతో సహా అనేక దేశాలతో, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, ఐరాస ఆర్థిక సంస్కరణ విభాగాల్లో వైవీ రెడ్డి పని చేశారు. ఐఏఎస్ అధికారిగా నల్గొండ, గుంటూరు సహా పలు జిల్లాల్లో కలెక్టర్‌గా పని చేసి ఆర్థిక శాఖకు వచ్చారు. ఆర్థిక రంగంలో ఆయనకున్న అపార అనుభవంతో ఆ తర్వాత ఆయన ఆర్బీఐ గవర్నర్‌గా పని చేశారు. '

## పీపీపీ విధానంలో కొత్త ప్రాజెక్టులు




**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయ రైల్వేస్.. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో నూతన ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని యోచిస్తోంది. రానున్న నెలల్లో ఈ విధానంలో భాగంగా మినరల్ కారిడార్లు వంటి నూతన వాణిజ్యపరమైన లైన్లను నిర్మించాలని ప్రతిపాదిస్తున్నట్టు ఓ సీనియర్ ప్రభుత్వ అధికారి తెలిపారు. భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు అయ్యే ఖర్చును తగ్గించుకోవా లన్న ఉద్దేశంతో భారతీయ రైల్వేస్ ఉన్నట్టు తెలుస్తోంది. కాగా, పీపీపీ విధానం వైపు మారాలని ప్రతిపాదించినప్పటికీ 2025-26 బడ్జెట్‌లో మూలధన వ్యయానికి సంబంధించి భారీ ఊతాన్ని భారతీయ రైల్వేస్ పొందే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. కాగా 2031 నాటికి ప్రతిపాదిత ఇంధన, మైనింగ్, సిమెంట్ రైల్ కారిడార్లకు రూ.5.25 లక్షల కోట్లకు పైగా వ్యయం అవుతుందని అంచనా. మరోవైపు, రైళ్లకు సంబంధించిన కొత్త టైమ్ టేబుల్‌ను భారతీయ రైల్వేస్ వచ్చే జనవరి 1న విడుదల చేయనుంది.

## వ్యవసాయ ఉత్పత్తులకు ఏకరూప జాతీయ మార్కెట్లు



**న్యూఢిల్లీ-నవభూమి:** దాదాపు మూడేళ్ల కిందట మూడు వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చి, రైతుల ఆందోళనలతో వెనక్కి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ విషయంలో సంస్కరణలు తీసుకువచ్చింది. ఈ క్రమంలో తాజాగా మరో కొత్త ముసాయిదాను విడుదల చేసింది. దీని ప్రకారం దేశవ్యాప్తంగా ఏకరూప జాతీయ మార్కెట్లను ఏర్పాటు చేయాలని రాష్ట్రాలకు సూచించింది. నూతన విధానం కింద ఒకే లైసెన్సు, ఒకే రిజిస్ట్రేషన్ వ్యవస్థ, ఒకేసారి చెల్లించేలా ఫీజు ఉండనున్నాయి. ఇక, ఈ ముసాయిదా ప్రకారం.. ప్రైవేటు హోల్‌సేల్ మార్కెట్లు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. వీటి ద్వారా ఉత్పత్తి, ఎగుమతిదారులు, రిటైల్ వ్యాపారులు, వ్యవస్థీకృత రిటైల్ వ్యాపారులు నేరుగా విక్రయాలు జరుపుకోవచ్చు. అదేవిధంగా గిడ్డంగులు, శీతల గోదాములను ప్రత్యేక మార్కెట్లుగా గుర్తిస్తారు. అలాగే, ప్రైవేటు ఈ-ట్రేడింగ్ వేదికల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ రుసుములను ఒకేసారి నిర్ణయిస్తారు.

## ఎన్నారై ఓటింగ్ గురించి షాకింగ్ రిపోర్ట్.. ఈ రాష్ట్రాల్లో ఒక్కరూ కూడా..



**న్యూఢిల్లీ-నవభూమి:** లోక్‌సభ ఎన్నికల తర్వాత ఎన్నికల సంఘం ఓ కీలక డేటాను విడుదల చేసింది. ఈ డేటా ప్రకారం విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల ఓటింగ్ గణాంకాల గురించి షాకింగ్ నిజాలు వెలుగులోకి వచ్చాయి. అయితే ఓటరు జాబితాలో ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు వారి పేర్లను చేర్చుకునే సమయంలో చాలా ఉత్సాహం కనిపించిందని ఎన్నికల సంఘం (%జుశ్రీవష్ఱశీఅ జశీఎఎఱంంఱశీఅ%) తెలిపింది. ఆ క్రమంలో ఓటరు జాబితాలో 1.2 లక్షల మంది తమ పేర్లను చేరుకున్నారు. కానీ ఎన్నికల సమయంలో మాత్రం ఇండియాకు ఓటు వేసేందుకు వచ్చింది కేవలం 2.48 శాతం మంది మాత్రమే.డేటా ప్రకారం 2024లో 1,19,374 మంది ఎన్‌ఆర్‌ఐలు వారి పేర్లను నమోదు చేసుకున్నారని ఎన్నికల సంఘం గణాంకాలను విడుదల చేసింది. ఇందులో కేరళ నుంచి అత్యధికంగా 89,839 రిజిస్ట్రేషన్లు జరిగాయి. కానీ లోక్‌సభ ఎన్నికల సమయంలో కేవలం 2,958 మంది మాత్రమే భారతదేశానికి వచ్చారు. అందులో 2,670 మంది కేరళ నుంచి మాత్రమే ఉన్నారు. ప్రధాని మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 885 మంది విదేశీ ఓటర్లలో లోక్‌సభ ఎన్నికల్లో కేవలం ఇద్దరు మాత్రమే ఓటు వేశారని నివేదిక తెలిపింది. దీంతో విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల ఓటింగ్ శాతంపై ఎన్నికల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది.

ఈ రాష్ట్రాల నుంచి ఒక్క ఎన్నారై కూడా ఓటు వేయడానికి రాలేదుఇలాంటి గణాంకాలు మహారాష్ట్రలో కూడా కనిపించాయి. అక్కడ 5,097 మంది ఎన్నారై ఓటర్లలో 17 మంది మాత్రమే ఓటు వేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 7,927 మంది ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు నమోదయ్యారు. కానీ 195 మంది మాత్రమే ఓటు వేశారు. ఇక విదేశాల్లో నివసిస్తున్న కర్ణాటక, ఉత్తరప్రదేశ్, తమిళనాడు వంటి అనేక పెద్ద రాష్ట్రాల నుంచి ఒక్క ఎన్నారై కూడా ఓటు వేసేందుకు భారత్‌కు రాలేదని ఎన్నికల సంఘం తెలిపింది. అసోం 19 మంది ఓటర్లలో ఎవరూ ఓటు వేయలేదు. బీహార్‌లో కూడా అదే పరిస్థితి ఉంది. నమోదు చేసుకున్న 89 మంది ఎన్నారై ఓటర్లలో ఎవరూ కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. 84 మంది ఓటర్లలో ఎవరూ ఓటు వేయని పరిస్థితి గోవాలో కనిపించింది. ఎన్నారై ఓటింగ్ తక్కువగా ఉండటానికి అనేక కారణాలు

భారతదేశంలోని ఎన్నారై ఓటర్లు ఇక్కడ మాత్రమే తమ ఓటు వేయగలరు. వారి భారతీయ చిరునామా ఆధారంగా ఓటరు జాబితాలో పేరు నమోదైంది. అయితే ఓటు వేయడానికి వారు వ్యక్తిగతంగా తమ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లాలి. చాలా మంది ఎన్నారై ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొనలేకపోవడానికి ఇదే కారణం. ఎన్నారై ఓటింగ్ తగ్గడం వెనుక చాలా కారణాలు ఉన్నాయని భావిస్తున్నారు. ఇందులో సమయాభావం, భారీ ఛార్జీలను పరిగణనలోకి తీసుకుంటారు. దీంతో ప్రజలు ఓటు వేసేందుకు రావడం మానేశారని పలువురు చెబుతున్నారు.

## నూతన సంవత్సర వేడుకలు రాత్రి ఒంటిగంట వరకే..



**బెంగళూర -నవభూమి:** నూతన సంవత్సర వేడుకలు రాత్రి ఒంటిగంట వరకే జరుపుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని బెంగళూరు నగర పోలీసు కమిషనర్ దయానంద్ తెలిపారు. శనివారం కమిషనర్ మీడియాతో మాట్లాడారు. ఈనెల 31న మంగళవారం ఏడాది ముగింపు వేడుకలు రాత్రి ఒంటిగంట వరకూ మాత్రమే పరిమితం చేశామన్నారు. పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్‌లు ఒంటిగంటకు మూసివేయాలని ఆదేశించామన్నారు.ఎయిర్‌పోర్టు రోడ్‌తో పాటు నగర పరిధిలోని అన్ని ఫ్లైఓవర్‌లను మూసివేస్తామన్నారు. మద్యం మత్తులో వాహనాలు ఇష్టారాజ్యంగా తిరగకుండా కట్టడి చేస్తామన్నారు. నగర పరిధిలో ఎటువంటి హింసాత్మకం, ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే ముగ్గురు విదేశీ డ్రగ్‌పెడ్లర్‌లతో పాటు 70మందిని అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.బెంగళూరు శివారు ప్రాంతాల్లో రేవ్ పార్టీలపైనా నిఘా ఉంటుందన్నారు. ఎంజీ రోడ్, బ్రిగేడ్, కోరమంగల, ఇందిరానగర్‌లలో ఎక్కువ మంది ప్రజలు చేరుతున్నందున సేఫ్టీ ఐలాండ్, సీసీ టీవీలతో పాటు డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఉంటుందన్నారు. బ్రిగేడ్, ఎంజీ రోడ్‌లలో ఒక వైపు మాత్రమే సంచరించేందుకు వీలుంటుందని రాత్రి 11గంటల తర్వాత ఎంజీ రోడ్ మెట్రో స్టేషన్‌ను మూసివేస్తామన్నారు. కానీ మెట్రో సేవలు రాత్రి 2 గంటలకు కొనసాగుతాయని మెట్రో కార్పొరేషన్ ప్రకటించింది. మెజస్టిక్ నుంచి రాత్రి 2.40 గంటలకు చివరి మెట్రో రైలు బయలుదేరనున్నట్లు ప్రకటించారు. గతంలో ఏడాది ఆఖరు రోజున చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

## మంచులో చిక్కుకున్న కశ్మీర్, హిమాచల్



**న్యూఢిల్లీ-నవభూమి:** చలిగాలులతో ఉత్తర భారతదేశం గడ్డకట్టుకుపోతోంది. జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లను మంచు దుప్పటి కప్పేస్తోంది. దట్టంగా కురుస్తున్న మంచు రోడ్లపై అంగుళాల మేర పేరుకుపోతోంది. దీంతో, ముందుకు కదల్లేక వేలాది వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా కాజీగుండ్ ప్రాంతంలో శ్రీనగర్-జమ్మూ హైవేపై 2వేలకు పైగా వాహనాలు మంచులో చిక్కుకుపోయాయి. హిమాచల్‌ప్రదేశ్‌లోని కులూలో సోలాంగ్ నాలా మార్గంలో వెయ్యికి పైగా వాహనాలు, 5వేల మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. పోలీసులు రోడ్లపై మంచును తొలగించి వారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. సహాయచర్యలు కొనసాగుతున్నాయి. మంచు కారణంగా శ్రీనగర్-లేహ్, శ్రీనగర్-జమ్మూ హైవేలను మూసివేశారు. గుల్‌మార్గ్‌లో మంచులో చిక్కుకుపోయిన పలువురు పర్యాటకులను సైనికులు కాపాడారు. చలిగాలులు, మంచు కారణంగా కశ్మీర్ యూనివర్సిటీ పరిధిలోని అన్ని కాలేజీల్లో పరీక్షలను కూడా వాయిదా వేశారు. ఇక, హిమాచల్ ప్రదేశ్‌లో ఐదు జిల్లాల్లో విపరీతమైన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. రాబోయే రెండు మూడు రోజుల్లో పంజాబ్, యూపీ, బిహార్, జార?ండ్, జమ్మూకశ్మీర్, చండీగఢ్, ఢిల్లీ, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్‌ల్లో ఉష్ణోగ్రతలు 3-5డిగ్రీల మేర పడిపోవచ్చని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. చలి కారణంగా హరియాణాలో పాఠశాలలకు జనవరి 1 నుంచి 15వరకు సెలవులు ప్రకటించారు.

## మనోళ్ల ఖర్చు ఎక్కువే



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రతినెల కుటుంబ అవసరాలకు మీరు ఎంత ఖర్చుపెడుతుంటారు? గ్రామీణ కుటుంబమైతే ఎంత ఖర్చు పెడతారు? పట్టణాల్లో ఉండే కుటుంబానిదెంత ఖర్చు? ఆసక్తికరమైన విషయమే కదా ఇది! పట్టణాల్లో కుటుంబాల నెలవారీ తలసరి వినియోగం (ఎంపీసీఈ)లో తెలుగు రాష్ట్రాలు మిగతా రాష్ట్రాలకన్నా ముందున్నాయి. తెలంగాణ పట్టణ ప్రాంతాల్లో కుటుంబాలు నెలకు రూ.9,131 ఖర్చు పెడుతుంటే, ఏపీ పట్టణప్రాంతాల్లో ఈ లెక్క రూ.9,877గా ఉంది. తెలంగాణ పల్లెల్లోని కుటుంబాలు నెలకు రూ.5,675 చొప్పున ఖర్చు చేస్తుంటే.. ఏపీలోనైతే గ్రామీణ ప్రాంతాల్లో రూ.6,107 ఖర్చు చేస్తున్నాయి. దేశంలో పేదరికం, అసమానతలు, కుటుంబాల ఆర్థిక స్థితిగతులను అంచనా వేసేందుకు 'గృహ వినియోగ వ్యయ సర్వే 2023-24' పేరుతో 2023 ఆగస్టు-2024 జూలై మధ్య రాష్ట్రాలవారీగా ఓ సర్వే నిర్వహించారు. మొత్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 1,54,357 మంది నుంచి, పట్టణ ప్రాంతాల్లో 1,07,596 మంది నుంచి వివరాలు తీసుకున్నారు. దేశవ్యాప్తంగా కుటుంబాలు నెలవారీగా పెడుతున్న ఖర్చులో దక్షిణాది రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. కేరళ, తెలంగాణ, తమిళనాడు, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలు నెలవారీ తలసరి వినియోగానికి చేస్తున్న ఖర్చులు జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉండడం విశేషం.

**సర్వే విశేషాలు ఇవీ..**

**కేరళ:** గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.6,611 ఖర్చు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.7834 ఖర్చు చేస్తున్నారు.

**తమిళనాడు:** గ్రామీణ కుటుంబాలు రూ.5,872 ఖర్చు పెడుతుండగా, పట్టణాల్లోని కుటుంబాలు రూ.8,325 ఖర్చు చేస్తున్నాయి.

**కర్ణాటక:** పట్టణ ప్రాంతాల్లో రూ.8,169 ఖర్చు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ఖర్చు నెలకు రూ.5,068గా ఉంది.

**జాతీయ స్థాయి:** గ్రామీణ ప్రాంతాల్లో సగటు ఖర్చు రూ.4,122, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు రూ.6,996 ఖర్చు చేస్తున్నారు.

**పారిశ్రామిక రాష్ట్రాలు:** పారిశ్రామిక రాష్ట్రాలుగా పేరొందిన గుజరాత్, మహారాష్ట్రలలో జాతీయ సగటుకు కొంత అటు ఇటుగా కుటుంబాల నెలవారీ ఖర్చులు ఉన్నాయి.

## సహనటికి లైంగిక వేధింపులు.. కన్నడ టీవీ నటుడు చరిత్ అరెస్టు



**బెంగళూర -నవభూమి:** కన్నడ టీవీ నాటికల్లో ప్రముఖ నటుడు చరిత్ బాలప్ప శుక్రవారం అరెస్టు అయ్యాడు. సహ నటిని లైంగిక వేధింపులకు గురి చేయడం, మాట వినకుంటే చంపేస్తానని బెదిరించాడనే ఆరోపణలపై బెంగళూరులోని రాజేశ్వరీ పేట పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. కన్నడలో ముద్దు లక్ష్మి అనే నాటికతో పేరొందిన చరిత్.. పలు తెలుగు నాటికల్లోనూ నటించాడు. కన్నడ, తెలుగు నాటికల్లో నటించే ఓ నటి(29) బాలప్ప తనని వేధిస్తున్నాడంటూ డిసెంబరు 13న పోలీసులను ఆశ్రయించింది. చరిత్ ప్రేమ పేరుతో తనకు దగ్గరై బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆమె ఫిర్యాదు చేసింది. కాగా, చరిత్‌కు ఇది వరకే వివాహమవ్వగా న్యాయస్థానం ద్వారా భార్య నుంచి విడాకులు తీసుకున్నారు. భరణం కోసం నోటీసులు పంపిన మాజీ భార్యను చరిత్ బెదిరించడంతో జూన్‌లో ఆయనపై ఓ కేసు నమోదైంది.

## ఆస్ట్రేలియా, జర్మనీకి చలో చలో!



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు తమ ఇమిగ్రేషన్ విధానాలను సవరిస్తున్నాయి. కొన్ని దేశాలు వీసా నిబంధనలను సడలిస్తుంటే మరికొన్ని కొత్తగా పరిమితులు విధిస్తున్నాయి. ఈ మార్పుల ప్రభావం విదేశాల్లో ఉన్నత చదువులు అభ్యసించాలనుకొనే భారతీయ విద్యార్థులపై పడుతోంది. కొన్నేళ్లుగా మన దేశ విద్యార్థులకు అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా గమ్యస్థానాలుగా ఉన్నాయి. చదువు పూర్తయిన తర్వాత ఉపాధితో పాటు శాశ్వత నివాసానికి అవకాశం కల్పించే దేశాలవైపు ప్రస్తుతం విద్యార్థులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఈ విషయంలో ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ వంటి దేశాలు భారతీయ విద్యార్థులకు ఆకర్షణీయమైన ఎంపికలుగా మారుతున్నాయి. దీనికి విరుద్ధంగా అమెరికా, యూకే ఈ ప్రక్రియలను సరళతరం చేయడంలో సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఒకప్పుడు భారతీయ విద్యార్థులకు మొదటి ఎంపికగా ఉన్న అమెరికాకు కొంతకాలంగా దరఖాస్తులు తగ్గుముఖం పట్టాయి. సంక్లిష్టమైన వీసా నిబంధనలు, పెరుగుతున్న తిరస్కరణ రేట్లు, ఉద్యోగ భద్రతపై ఆందోళనలు వంటి అంశాలు విద్యార్థులను పునరాలోచనలో పడేస్తున్నాయి. ట్రంప్ మళ్లీ అధికారంలోకి రావడంతో భారతీయ విద్యార్థులకు మరింత అనుకూలమైన ఇమిగ్రేషన్ విధానాలు, గ్రీన్ కార్డు జారీలో సడలింపులు ఇస్తారన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

**కెనడా ఆంక్షలు కఠినతరం**

స్నేహపూర్వ వీసా విధానాలు, బలమైన మౌలిక సదుపాయాలతో భారతీయ విద్యార్థులకు కెనడా చాలాకాలంగా కీలక గమ్యస్థానంగా ఉంది. అయితే కఠినమైన ఇమిగ్రేషన్ నిబంధనలు, పరిమితమైన అనుమతులు దరఖాస్తుల సంఖ్య క్షీణతకు కారణమవుతున్నాయి. ఈ సవాళ్లు ఉన్నప్పటికీ 2024లో 4,37,000 స్టడీ పర్మిట్లను కేటాయించడం అంతర్జాతీయ విద్య పట్ల కెనడా నిబద్ధతకు నిదర్శనమని నిపుణులు పేర్కొంటున్నారు. భారతీయ విద్యార్థుల పట్ల యూకే మిశ్రమ వైఖరి కనబరిచింది. గ్రాడ్యుయేట్ విద్యార్థులు చదువులు పూర్తి చేసిన తర్వాత రెండేళ్ల పాటు పనిచేయడానికి అనుమతిస్తుంది. పీజీ విద్యార్థులు డిపెండెంట్లను తీసుకురావడంపై ఆంక్షలు విధించడం వారిని కలవరపెడుతోంది. విపరీతమైన రద్దీ, వనరుల కేటాయింపులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడంలో భాగంగా 2025 నాటికి విదేశీ విద్యార్థుల నమోదును 2,70,000కు పరిమితం చేయాలని ఆస్ట్రేలియా ప్రభుత్వం నిర్ణయించింది. ఆస్ట్రేలియా వర్సిటీల్లో సీట్ల కోసం పోటీ మరింత పెరిగినప్పటికీ కెనడా తరహాలో పొడిగించిన పోస్టు స్టడీ వర్క్ ప్రయోజనాలు విద్యార్థులను ఊరిస్తున్నాయి.

నిబంధనలు సడలించిన జర్మనీ

భారతీయ విద్యార్థులకు జర్మనీ అత్యుత్తమ ఎంపికగా మారుతోంది. పోస్టు స్టడీ వర్క్ ఎంపికలు ప్రధాన ఆకర్షణగా మారాయి. నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి అవకాశాలను పెంపొందిస్తూ నైపుణ్యం కలిగిన ఉద్యోగులకు ఏటా 90వేల వీసాలు జారీ చేయాలని ఆ దేశం యోచిస్తోంది. వీసా నిబంధనల్లో మార్పులతో విద్యార్థులు సంప్రదాయ గమ్యస్థానాలను పక్కన పెట్టి ఫ్రాన్స్, ఐర్లాండ్, ఫిన్లాండ్ తదితర ప్రత్యామ్నాయాలనూ అన్వేషిస్తున్నారు.

న్యూజిలాండ్ ప్రభుత్వం అక్రిడిటేటెడ్ ఎంప్లాయర్ వర్క్ వీసా (ఏఈడబ్ల్యూవీ) నిబంధనలు సవరించింది. సగటు వేతన పరిమితిని తొలగించడం, వలసదారులకు పని అనుభవాన్ని మూడేళ్ల నుంచి రెండేళ్లకు తగ్గించడం, కొత్తగా సీజనల్ వీసాలను ప్రవేశపెట్టడం వంటి మార్పులు వచ్చే జనవరి నుంచి నాలుగు దశల్లో అమలులోకి రానున్నాయి. తాజా సవరణలతో ఎంప్లాయర్ అక్రిడిటేషన్ కోసం సగటు ప్రాసెసింగ్ సమయం 62 రోజుల నుంచి 14 రోజులకు తగ్గింది. అలాగే జాబ్ చెక్ ఉత్పాదకత రెట్టింపు కానుంది. ఉద్యోగుల సగటు వేతన పరిమితిని వచ్చే మార్చిలో తొలగించనున్నారు. ఈ మార్పుల ప్రభావం ప్రస్తుత ఉపాధి ఒప్పందాలపై ఉండదు. నివాస అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఉద్యోగులు తప్పనిసరిగా సంపాదించాల్సిన వేతనంలో ఏమార్పు లేదు. ఏఈడబ్ల్యూవీ వలసదారులు తమ పిల్లలను తీసుకురావడానికి ఏటా కనీసం 55,844 న్యూజిలాండ్ డాలర్లు (దాదాపు రూ.27 లక్షలు) సంపాదించాల్సి ఉంటుంది.

## వలసల చిచ్చు.. ఇమిగ్రేషన్ విధానంపై రెండు వర్గాలుగా చీలిన ట్రంప్ టీమ్



**వాషింగ్టన్-నవభూమి:** అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శిబిరంలో చిచ్చు రేగింది. వలస విధానాలపై ఆయన అనుచరులు రెండుగా చీలారు. ప్రతిభ ఆధారిత వలస విధానానికి ఒక వర్గం మద్దతు ఇవ్వగా, కఠినమైన వలస విధానాలను అమలు చేయాలని మరో వర్గం వాదిస్తున్నది. కృత్రిమ మేధపై వైట్‌హౌస్ సీనియర్ పాలసీ అడ్వైజర్‌గా భారత సంతతికి చెందిన శ్రీరామ్ కృష్ణన్‌ను నియమించిన నాటి నుంచి ఈ వివాదం మొదలయ్యింది. ఇతర దేశాల నిపుణులకు ఇచ్చే గ్రీన్‌కార్డులపై పరిమితులు తొలగిస్తే బాగుంటుందని శ్రీరామ్ కృష్ణన్ అభిప్రాయపడటం వివాదానికి ఆజ్యం పోసింది.

**వారిని పార్టీ నుంచి తొలగించండి: మస్క్**

ట్రంప్‌కు కీలక మద్దతుదారుగా ఉన్న ఎలాన్ మస్క్ సైతం ప్రతిభ గల ఇతర దేశాల నిపుణులకు అమెరికా వీసాలు దక్కాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మస్క్ అభిప్రాయానికి ట్రంప్ శిబిరంలోని భారత సంతతి వ్యక్తి వివేక్ రామస్వామి మద్దతు ఇచ్చారు. వీరిపై పలువురు రిపబ్లికన్ పార్టీ మద్దతుదారులు విమర్శలు గుప్పించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన మస్క్.. ద్వేషపూరిత, జాత్యాంహంకారం కలిగిన మూర్ఖులను పార్టీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 | హైదరాబాద్ సోమవారం 30 । డిసెంబర్ । 2024



# కల్కి 2898 ఏడీలో మహేశ్‌బాబు ఉంటే అన్ని రికార్డులు బద్దలయ్యేవి: నాగ్ అశ్విన్

మహానటి ఫేం నాగ్ అశ్విన్ కాంపౌండ్ నుంచి వచ్చిన సైన్స్ ఫిక్షన్ ప్రాజెక్ట్ కల్కి 2898 ఏడీ ప్రభాస్ టైటిల్ రోల్‌లో నటించిన ఈ మూవీని వైజయంతీ మూవీస్ తెరకెక్కించింది. ప్రపంచవ్యాప్తంగా జూన్ 27న తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదలైన ఈ సినిమా గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.1200 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది. తాజాగా ఓ చిట్ చాట్‌లో ఈ సినిమా గురించి నాగ్ అశ్విన్ చేసిన కామెంట్స్ నెట్టింట రౌండప్ చేస్తున్నాయి. సలార్ డైనోసారి అయితే కల్కి 2898 ఏడీ డ్రాగన్ అవుతుందన్నాడు నాగ్ అశ్విన్. బాక్సాఫీస్ వద్ద సెగలు పుట్టించేందుకు సలార్ 2, స్పిరిట్ వేచి ఉన్నాయి. స్పిరిట్, సలార్ 2 రూ.1500 కోట్ల హ్యాట్రిక్ వసూళ్లు రాబట్టడం చూడొచ్చని చెప్పాడు. బడ్జెట్‌ను రికవరీ చేసుకునేందుకు మాత్రమే పాన్ ఇండియా సీక్వెల్స్ వస్తున్నాయి. కల్కి 2898 ఏడీ పార్ట్ 2 త్వరలోనే ఉండబోతుందన్నాడు. అంతేకాదు ఈ మూవీ షూటింగ్ టైంలో ఒక పార్ట్ తీయాలా, రెండు భాగాలు తీయాలా అనే అయోమయంలో ఉన్నప్పుడు చీటీలు వేసి 2 అని ఫిక్స్ అయినట్టు చెప్పాడు.






యుక్తి తరేజా

# షేక్ చేస్తున్న సంజీదా

హిందీ సినిమాలతో పాటు బుల్లితెరపై తనదైన ముద్ర వేసిన ముద్దుగుమ్మ సంజీదా షేక్. పలు సినిమాల్లో హీరోయిన్‌గా నటించడంతో పాటు కొన్ని సినిమాల్లో కీలక పాత్రల్లో నటించడం ద్వారా హిందీ ప్రేక్షకులకు సుపరిచితురాలు అయ్యింది. రెండు దశాబ్దాల క్రితం బుల్లి తెర ద్వారా ఈ అమ్మడు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది. క్యా హెూగా నిమ్మోకాలో నటించి మెప్పించింది. ఆ తర్వాత 2007లో స్టార్ ప్లస్ ఛానల్‌లో వచ్చిన కయామత్ సీరియల్‌లో నటించి మెప్పించింది. సీరియల్స్‌లో బిజీగా ఉన్న సమయంలోనే ఈ అమ్మడు హీరోయిన్‌గానూ ఆఫర్లు దక్కించుకుంది. బుల్లితెర వెండితెరపై తనదైన ముద్ర వేసిన సంజీదా అందాల ఆరబోత ఫోటోలతో రెగ్యులర్‌గా సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటుంది. తాజాగా మరోసారి పింక్ డ్రెస్‌లో థైస్ అందాలను షేర్ చేయడంతో పాటు క్లీ వేజ్ షో తో మతి పోగొట్టింది. ఈ రేంజ్‌లో అందాల ఆరబోత చేస్తున్న సంజీదా వయసు గురించి ప్రస్తుతం ఆసక్తికర చర్చ జరుగుతోంది. చాలా మంది ఈ ఫోటోలకు పాతికేళ్ల పడుచు అందం అంటూ కామెంట్స్ చేస్తున్నారు. కానీ గూగుల్ లెక్క ప్రకారం ఈమె వయసు ఇటీవలే నాలుగు పదుల వయసుకు చేరింది. ఈ వయసులోనూ ఇంత అందంగా కనిపించడం కేవలం ఈమెకే చెల్లింది అనడంలో సందేహం లేదు. ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపుగా అయిదు మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ఈ అమ్మడు రెగ్యులర్‌గా స్టార్ హీరోయిన్స్‌కి పోటీ అన్నట్లు తన అందమైన ఫోటోలను షేర్ చేస్తుంది. బాలీవుడ్‌లో అతి తక్కువ మంది మూడు పదుల వయసు దాటిన తర్వాత ఇలా అందంగా ఉంటారు. వారితో పాటు సంజీదా షేక్ చేరింది అంటూ ఆమె ఫాలోవర్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ స్థాయిలో అందంగా ఉన్నా సినిమాల్లో రావాల్సిన గుర్తింపు, దక్కాల్సిన ఆఫర్లు దక్కలేదు అనే అభిప్రాయంన వ్యక్తం చేస్తున్నారు. సౌత్‌లో అయినా ఈమె సినిమాలు చేయాల్సింది అంటూ కొందరు అంటున్నారు. కన్నడ, పంజాబ్ భాషల్లో నటించిన ఈమె ముందు ముందు సౌత్‌లో మరిన్ని సినిమాల్లో నటిస్తుందేమో చూడాలి. హిందీలో ఈమెకు ఈమధ్య వరుస ఆఫర్లు వస్తున్నాయి. ఈ ఏడాది ఫైటర్ సినిమాతో మంచి గుర్తింపు దక్కింది. వచ్చే ఏడాదిలోనూ ఈమె సినిమా హిందీ నుంచి రాబోతుంది. వెబ్ సిరీస్‌ల్లోనూ ఈమెకు మంచి గుర్తింపు లభిస్తోంది. ముందు ముందు ఈమె టీవీ షోల్లో నటించేందుకు ఆసక్తి కనబర్చుతోంది. హీరోలకు జోడీగా హీరోయిన్‌గా నటించే అవకాశాలు రాకున్నా కచ్చితంగా మంచి పాత్రల్లో నటించే అవకాశాలు దక్కవచ్చు.

# సెకండ్ హాఫ్ గూస్ బంప్స్ నేషనల్ అవార్డ్ పక్కా..!




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ సినిమా 2025 సంక్రాంతికి రిలీజ్ అవుతుంది. ఈ సినిమాను దిల్ రాజు నిర్మిస్తుండగా థమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. కియరా అద్వాని హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో అంజలి ఇంపార్టెంట్ రోల్ లో నటించింది. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ డల్లాస్ లో జరిగింది. ఈ ఈవెంట్ కి సుకుమార్ స్పెషల్ గెస్ట్ గా వెళ్లారు. గేమ్ ఛేంజర్ డల్లాస్ ఈవెంట్ లో సుకుమార్ స్పీచ్ ఫ్యాన్స్ ని ఖుషి చేసింది. ముందుగా మైక్ అందుకున్న సుకుమార్ 1 సినిమాను గుర్తు చేసుకున్నారు. ఆ సినిమా ఇక్కడ కలెక్ట్ చేయకపోతే తాను సినిమాలు తీసి ఉండే వాడిని కాదని అన్నారు. ఇక తనకు మొదటి సినిమా ఆఫర్ ఇచ్చిన దిల్ రాజుకి థాంక్స్. ఇప్పుడు కొత్త వారికి ఛాన్స్ ఇవ్వడం ఈజీనే కానీ అప్పట్లో చాలా డౌట్ పడే వాళ్లు.. ఎప్పుడు చెప్పినా కూడా మళ్లా మళ్లీ చెబుతాను ఆయన రుణం ఎప్పటికీ తీర్చుకోలేని అన్నారు సుకుమార్. ఇక శంకర్ గురించి చెబుతూ.. ఆయన చేతిలోనే ఫస్ట్ ఫిల్మ్ ఫేర్ అవార్డ్ అందుకున్నా.. మీ సినిమాలు చూస్తూ పెరిగామని అన్నారు సుకుమార్. తాను అసిస్టెంట్ గా చేస్తున్న టైం లో చిరంజీవి గారితో శంకర్ ఎందుకు సినిమా చేయరని అనుకున్నా చరణ్ తో తీస్తున్నారని తెలిసి ఆనందపడ్డానని అన్నారు సుకుమార్. థాంక్ యు సర్ తెలుగులో ఈ సినిమా చేసినందుకని అన్నారు. సూర్య గురించి చెబుతూ.. ఖుషికి నేను చాలా పెద్ద ఫ్యాన్.. ఆ సినిమా తో తాను సీన్స్ ఎలా తీయాలో చూసి నేర్చుకున్నా అన్నారు సుకుమార్. ఇక తమన్ తనకు క్లిష్ట పరిస్థితుల్లో వచ్చాడు.. కానీ నేను యూజ్ చేసుకోలేదని అన్నారు సుకుమార్. తాను చేసిన ప్రతి సినిమా హీరోని ప్రేమిస్తాను.. ఎప్పుడు సినిమా పూర్తయ్యాక వేరే ఎవరితో కనెక్ట్ లో ఉండను.. కానీ చరణ్ తో ఆ అనుబంధం కొనసాగుతుంది. నాకు చాలా ఇష్టమైన బ్రదర్ అని అన్నారు సుకుమార్. ఫస్ట్ హాఫ్ ఆసం.. ఇంటర్వల్ బ్లాక్ బస్టర్.. సెకండ్ హాఫ్ ఫ్లాష్ బ్యాక్ గూస్ బంప్స్. శంకర్ గారి జెంటిల్మన్, భారతీయుడు చూసి ఎంత ఎంజాయ్ చేశానో ఈ సినిమా చూసి అంత ఎంజాయ్ చేశానని అన్నారు సుకుమార్. చరణ్ చేసిన రంగస్థలం కి నేషనల్ అవార్డ్ వస్తుందని అనుకున్నాం.. ఈ సినిమా క్లైమాక్స్ చూస్తే ఈసారి కూడా అదే ఫీలింగ్ కలిగింది. ఈ సినిమా క్లైమాక్స్ చూస్తే నేషనల్ అవార్డ్ వస్తుందని అన్నారు సుకుమార్.. ఇంత మంచి సినిమా చేసినందుకు శంకర్ గారు థాంక్యు అని అన్నారు సుకుమార్.

# దేవి నాగవల్లి మరో యూ టర్న్




ఎప్పుడు ముక్కు సూటిగా క్వశ్చన్ చేస్తుంటారు.. ఆన్సర్ ఇస్తుంటారు.. కొన్నిసార్లు వివాదాల్లో కూడా నిలుస్తుంటారు! అయితే నాగవల్లి.. బిగ్ బాస్-4 హౌస్‌లోకి కూడా వెళ్లిన విషయం తెలిసిందే. దాదాపు 22 రోజుల పాటు హౌస్ లో ఉన్న ఆమె.. ఆ తర్వాత ఎలిమినేట్ అయ్యారు. అనంతరం మళ్లీ మీడియాలోనే కంటిన్యూ అయ్యారు. అలా మొత్తానికి జర్నలిజం ఫీల్డ్ లో దేవి నాగవల్లి.. తనకంటూ మంచి అనుభవం, పాపులారిటీ సొంతం చేసుకున్నారని చెప్పాలి. ఇప్పుడు ఆమె తాను వర్క్ చేసిన మీడియా ఛానల్ కు గుడ్ చెప్పినట్లు తెలుస్తుంది. దీంతో ఆమెకు సహెూద్యోగులు ఫేర్ వెల్ ఇచ్చిన వీడియోస్ అండ్ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఆల్ ది బెస్ట్ అని రాసిన ఉన్న కేక్ ను కట్ చేసిన దేవి నాగవల్లి.. ఎమోషనల్ అయ్యారు. తన కొలీగ్స్ అందరితో క్వాలిటీ టైమ్ స్పెండ్ చేశారు. అయితే ఇకపై నాగవల్లి.. సినీ ఇండస్ట్రీలో బిజీగా గడపనున్నారని, అందుకే మీడియాకు గుడ్ బై చెప్పినట్లు తెలుస్తోంది. డైరెక్టర్ గా చిత్రసీమలో అడుగు పెట్టనున్నట్లు సమాచారం. రీసెంట్ గా వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అయిన పుష్ప-2కు ఆమె అసిస్టెంట్ డైరెక్టర్ గా వర్క్ చేశారు. ఆ విషయాన్ని ఆమెనే సోషల్ మీడియాలో తెలిపారు. టైటిల్ కార్డ్స్ లో నాగవల్లి పేరును కూడా సుకుమార్ వేశారు. పెద్ద పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ మూవీలో ఇసుక రవ్వంత పని చేస్తే సుకుమార్ కొండంత గుర్తింపు ఇచ్చారని నాగవల్లి కొనియాడారు. మీ దగ్గర పాఠాలు నేర్చుకోవడం తన అదృష్టమని తెలిపారు. ఎంతో ధైర్యమిచ్చారని చెప్పారు. సుకుమార్ కూడా ఆమెపై ప్రశంసలు కురిపించారు. దీంతో ఇప్పుడు దేవి నాగవల్లి.. సుకుమార్ శిష్యురాలిగా ఇండస్ట్రీలోకి డైరెక్టర్ గా ఎంట్రీ ఇవ్వనున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. ఇప్పటికే సుక్కూ శిష్యులు అనేక మంది అడుగుపెట్టి మంచి సక్సెస్ అయిన విషయం తెలిసిందే. అదే సమయంలో ఆమె ఇంకొంత కాలం అసిస్టెంట్ డైరెక్టర్ గా వర్క్ చేస్తారని మరో టాక్ వినిపిస్తోంది. మరి వీటిలో నిజమేదో నాగవల్లి స్పందిస్తే కానీ తెలియదు.

# అతి పెద్ద రామ్ చరణ్ కటౌట్ ఇదుగో..!





రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో దిల్ రాజు భారీ బడ్జెట్‌తో నిర్మించిన 'గేమ ఛేంజర్' సినిమా విడుదలకు సిద్ధం అయ్యింది. వచ్చే నెలలో సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న గేమ్ ఛేంజర్ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. అంచనాలకు తగ్గట్లుగా దర్శకుడు గేమ్ ఛేంజర్ సినిమాను రూపొందించారు. సినిమాను భారీ ఎత్తున ప్రమోట్ చేయడం కోసం దిల్ రాజు అమెరికాలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించిన విషయం తెల్సిందే. సినిమాపై ఉన్న అంచనాల నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున చరణ్ కటౌట్‌లు ఏర్పాటు చేస్తున్నారు ఒడిశాలో రాజమౌళి, ఎందుకంటే! విజయవాడలోని బృందావన కాలనీ వజ్రా మైదానంలో ఈ భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఏ ఇండియన్ హీరో పెట్టని 256 అడుగుల భారీ కటౌట్‌ను చరణ్ ఫ్యాన్స్ ఏర్పాటు చేశారు. యువశక్తి అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఈ భారీ కటౌట్ ను ఏర్పాటు చేశారు. రామ్ చరణ్‌పై తమకు ఉన్న అభిమానంను వారు ఇలా చూపించారు. సోషల్ మీడియాలో వారు ఏర్పాటు చేసిన అతి భారీ కటౌట్ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. సినీ ప్రముఖుల ఆధ్వర్యంలో ఈ భారీ కటౌట్ ఆవిష్కరణ జరిగింది. దాదాపు వారం రోజుల పాటు కష్టపడి ఈ భారీ కటౌట్‌ను ఏర్పాటు చేసినట్లుగా ఫ్యాన్స్ చెబుతున్నారు. చెన్నై నుంచి వచ్చిన ప్రత్యేక టీం ఈ భారీ కటౌట్ నిర్మాణంలో పాలు పంచుకున్నారు. అత్యంత ఖరీదుతో ఈ భారీ కటౌట్‌ను ఏర్పాటు చేసినట్లుగా ఫ్యాన్స్ చెప్పుకొచ్చారు. గేమ్ ఛేంజర్ భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుంది అనే నమ్మకంను వారు వ్యక్తం చేశారు. లుంగీ కట్టుకుని, బనియన్ పై ఉన్న రామ్ చరణ్ మాస్ లుక్‌కి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. విజయవాడ రామ్ చరణ్ ఫ్యాన్స్‌పై మెగా ఫ్యాన్స్ అంతా ప్రశంసలు కురిపిస్తున్నారు. రామ్ చరణ్ ఈ అరుదైన ఘనతకు పూర్తిగా అర్హుడు అంటూ పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముందు ముందు ఆయన నుంచి మరిన్ని ఇలాంటి మంచి సినిమాలు రావాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. రామ్ చరణ్, కియారా అద్వానీ జంటగా రూపొందిన ఈ సినిమాలో తమిళ దర్శకుడు ఎస్‌జే సూర్య ఈ సినిమాలో కీలక పాత్రలో నటించడం ప్రత్యేక ఆకర్షణగా నిలువబోతుంది. సూర్య పాత్రను రాబోయే రోజుల్లో గుర్తు పెట్టుకునే విధంగా ఉంటుంది అంటూ యూనిట్ సభ్యులు చెబుతున్నారు. ఈ సంక్రాంతికి విడుదల కాబోతున్న చిత్రాల్లో ఈ సినిమా హైలైట్‌గా నిలవబోతుంది. సినిమా షూటింగ్ ప్రారంభం అయినప్పటి నుంచి రామ్ చరణ్ ఏకంగా 200 రోజుల పాటు చరణ్ ఈ సినిమాలో నటించారు. మొదటి సారి రామ్ చరణ్ తండ్రి, కొడుకు పాత్రల్లో డ్యూయెల్ రోల్‌లో కనిపించబోతున్నాడు. తండ్రి పాత్రకు జోడీగా అంజలి నటించగా, శ్రీకాంత్ మరో ముఖ్య పాత్రలో కనిపించబోతున్నాడు.

# చర్చిలో 'జై శ్రీరామ్' అన్న యూట్యూబర్.. కేసు నమోదు



ఈ మధ్య సోషల్ మీడియాలో పలు యూట్యూబర్‌లు, ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు వ్యూస్, లైక్స్ కోసం ప్రతి చెత్త కంటెంట్‌ను అప్‌లోడ్ చేస్తున్న విషయం తెలిసిందే. మొన్నటికి మొన్న హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ఒక వ్యక్తి డబ్బుల కట్టలను పడేసి.. నేను డబ్బులు చెట్ల పొదల్లో పడేశాను. దొరికితే తీసుకోండి అంటూ వీడియో చేయగా.. ఈ వీడియో ఫుల్ వైరల్‌గా మారడంతో పాటు అతడి చేసిన పనికి పోలీసులు తనపై కేసు నమోదు చేశారు. ఇవే కాకుండా రోజు ఇలాంటి వీడియోలే మనం తరచూ చూస్తూ ఉంటాం. ఇదిలావుంటే ఆకాశ్ సాగర్ అనే యూట్యూబర్ చేసిన చెత్త పని ప్రస్తుతం క్రైస్తవుల మనోభావాలు దెబ్బతినేలా చేసింది. ఆకాశ్ సాగర్ అనే హిందీ యూట్యూబర్‌కి అటు యూట్యూబ్‌తో పాటు ఇన్‌స్టాగ్రామ్‌లో మంచి ఫాలోయింగ్ ఉంది. అతడు చేసేది. అడల్ట్ కంటెంట్ అయిన ఫాలోవర్లను బాగానే పెంచుకున్నాడు ఆకాశ్. అయితే అతడు రీసెంట్‌గా మేఘలయాకు ట్రిప్‌కి వెళ్లగా.. అక్కడ చేసిన ఒక చెత్త పని ప్రస్తుతం వివాదాస్పదంగా మారింది.

# గవాస్కర్ కాళ్లు మొక్కిన నితీష్‌రెడ్డి తండ్రి..



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత యువ క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్ టెస్టులో 8వ స్థానంలో వచ్చి అద్భుతమైన సెంచరీ చేయడంతో ఆయన తండ్రి ముత్యాల రెడ్డి ఎంతో ఎమోషనల్ అయ్యారు. మ్యాచ్ అనంతరం నితీష్ తండ్రి ముత్యాలరెడ్డి సునీల్ గవాస్కర్ కాళ్లు మొక్కారు. ఆ తర్వాత నితీష్ రెడ్డి సోదరి కూడా గవాస్కర్ పాదాలకు నమస్కరించారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

మెల్‌బోర్న్ టెస్టు మూడో రోజు ఆట ముగిసిన అనంతరం నితీష్ కుమార్ రెడ్డి కుటుంబం గవాస్కర్‌తో సమావేశమైంది. ఈ సమావేశంలో నితీష్ తండ్రి భావోద్వేగానికిలోనయ్యారు. గవాస్కర్ కనిపించగానే ఆయనను ఆలింగనం చేసుకోవడానికి ముందు కాళ్లపై పడ్డారు. మోకాళ్లపై కూర్చుని కాళ్లు మొక్కారు. అదేవిధంగా తన కుమారుడిపై ప్రశంసలు కురిపించిన మాజీ ఆటగాళ్లు అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సునీల్ గవాస్కర్.. నితీష్ కుమార్ రెడ్డి గురించి, అతని బ్యాటింగ్ గురించి మాట్లాడారు. ఆతనో వజ్రమని కితాబిచ్చాడు. మెల్‌బోర్న్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 8వ స్థానంలో క్రీజులోకి వచ్చిన నితీష్ రెడ్డి.. 189 బంతులు ఎదుర్కొని 114 పరుగులు చేశాడు. దాంతో ఇన్నింగ్స్‌లో భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. నితీష్ ఆటను టెస్టు చరిత్రలోనే అత్యుత్తమ ఇన్నింగ్స్‌గా క్రికెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. తాజా ఇన్నింగ్స్‌తో భారత టెస్టు చరిత్రలో 8వ నంబర్ బ్యాట్స్‌మెన్‌గా బరిలో దిగి రెండో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నితీష్ నిలిచాడు. అంతకుముందు 2002లో వెస్టిండీస్‌పై అజయ్ రాత్రా అజేయంగా 115 పరుగులు చేశాడు. కాగా మెల్‌బోర్న్‌లో సాధించిన సెంచరీని నితీష్ కుమార్ రెడ్డి తన తండ్రికి అంకితమిచ్చాడు.

# బుమ్రా మాయాజాలం.. ఆసీస్ ఆరో వికెట్ డౌన్ బాక్సింగ్ డే టెస్టుపై భారత్



**మెల్‌బోర్న్- నవభూమి:** బాక్సింగ్ డే టెస్టుపై భారత్ పట్టుబిగిస్తున్నది. లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ అద్భుత పోరాటంతో టీమ్‌ఇండియా పోటీలోకి వచ్చింది. నాలుగోరోజు ఆట ప్రారంభమైన కొద్దిసేపటికే భారత్ ఆలౌట్ అయింది. 9 పరుగులు మాత్రమే జోడించిన సెంచరీ హీరో నితీశ్ రెడ్డి (114) లియోన్ బౌలింగ్‌లో స్టార్క్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో ఆస్ట్రేలియాకు 120 పరుగుల ఆధిక్యం లభిం చింది. అనంతరం రెండో ఇన్సింగ్స్ ప్రారంభించిన ఆసీస్ బ్యాటర్లకు టీమ్‌ఇండియా పేసర్లు చుక్కలు చూపించారు. ఏ దశలోను కుదురుకోనియకుండా క్రమం తప్పకుండా వికెట్లు పడగొడు తున్నారు. దీంతో ఆతిథ్య జట్టు 85 రన్స్‌కే 5 వికెట్లు కోల్పోయింది. బుమ్రా వేసిన 6 ఓవర్‌లో ఆసీస్ ఓపెనర్ కొన్‌స్టాస్ (8) క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో ప్రారంభమైన వికెట్ల పతనాన్ని సిరాజ్ కొనసాగించాడు. 43 పరుగుల వద్ద ఉస్మాన్ ఖవాజా వికెట్ పడగొట్టాడు. ఇద్దరు సీమర్లు పోటాపోటీగా వికెట్లు పడగొట్టడంతో 93 రన్స్‌కే 6 వికెట్లు కోల్పోయింది. బుమ్రా 4 వికెట్లు తీయగా, సిరాజ్ ఇద్దరిని ఔట్ చేశాడు. ఆస్ట్రేలియా ప్రస్తుతం 192 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది.

# మెల్‌బోర్న్‌లో విశాఖ కుర్రాడు నితీష్‌రెడ్డి సెంచరీ.. అభినందనలు తెలిపిన మంత్రి నారా లోకేష్



**అమరావతి- నవభూమి:** భారత్, ఆస్ట్రేలియా మధ్య మెల్‌బోర్న్‌లో జరుగుతున్న బాక్సింగ్ డే టెస్ట్ మ్యాచ్‌లో మూడో రోజు సెంచరీ చేసిన విశాఖ కుర్రాడు పై అభినందనలు వ్యక్తమవుతున్నాయి. భారత్ జట్టు మొదటి ఇన్నింగ్‌లో వికెట్లు పడుతున్న సమయంలో ఓపికగా పిచ్‌పై నిలబడి ఫాస్ట్‌బౌలర్లను సైతం ధాటిగా ఎదుర్కొని సెంచరీ చేయడం పట్ల ఏపీ మంత్రి నారా లోకేష్ ట్విటర్ వేదిక ద్వారా అభినందనలు తెలిపారు. మెల్‌బోర్న్‌లో వైజాగ్ అబ్బాయి నితీష్ కుమార్ రెడ్డి సెంచరీ చేయడం గర్వంగా ఉందని అన్నారు. ఆసీస్‌పై ఒత్తిడిలో అద్భుతమైన ధైర్యం, పట్టుదల, సంకల్ప శక్తిని ప్రదర్శించి తొలి సెంచరీని సాధించినందుకు మిమ్మల్ని చూసి గర్విస్తున్నామని పేర్కొన్నారు. తన పోరాటాన్ని ఇలానే కొనసాగించాలని సూచించారు. మీరు చేసే ప్రతి పరుగును చూసి ఆనందిస్తామని 2024 సంవత్సరం ముగింపులో తన బ్యాట్‌తో ఆంధ్రప్రదేశ్ గొప్పతనాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటినందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**